ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
20-5-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 109 పేజీలు: 16 వెల: 6.50

**పెను ఆర్థిక తుఫాను వస్తోంది: రాహుల్** 5లో

**ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు**

# బోటూ మనదే.. వేటా మనదే

- చేపల వేటకు సబ్సిడీపై 200 యాంత్రిక పడవలు
- మన జలాల్లో గస్తీ పెంచి మత్స్యకారుల హక్కులు కాపాడుతాం
- సీవీడ్ సాగుతో మహిళలకూ ఉపాధి అవకాశాలు
- 'మత్స్యకారుల సేవ'లో రూ. 262 కోట్లు పంపిణీ చేసిన సిఎం చంద్రబాబు
- కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ



మంగళవారం జరిగిన సభకు హాజరైన మత్స్యకార కుటుంబాలు



మంగళవారం తుమ్మలపెంట గ్రామంలో 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో ఆర్థికసాయం చెక్కును అందజేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

**కృష్ణా నదిలో మత్స్యకారుల భారీ ర్యాలీ** 2లో

**కావలి (నెల్లూరు), మే 19, ప్రభాతవార్త :** తీర ప్రాంత అభివృద్ధిలో మత్స్య కారులకు భాగస్వామ్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మత్స్య కారుల సంక్షేమానికి.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని సిఎం వెల్లడించారు. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారు చేసే ఫేక్ ప్రచారాలను పట్టించు కోవద్దని స్పష్టం చేశారు. నెల్లూరు కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వేట నిషేధ సమయంలో 1,30,796 మంది మత్స్య కార కుటుంబాలకు రూ. 261.50 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. మత్స్య కారుల సేవలో కార్యక్రమంతో మత్స్యకారుల కుటుంబానికి రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. సిఎం ప్రసంగిస్తున్న సమయంలోనే మత్స్య కారుల సేవలో లబ్దిదారుల ఖాతాల్లోకి >>2




## మళ్లీ పెట్రో షాక్

**పెట్రోలు, డీజిల్‌పై 90 పైసలు పెంపు**

**విజయవాడలో పెట్రోలు రూ. 113.88, డీజిల్ రూ. 101.57**

**హైదరాబాద్‌లో పెట్రోలు రూ. 110.88, డీజిల్ రూ. 98.99**

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ ధరలు మరోసారి పెరిగాయి. దీంతో వాహనదారులకు మరోసారి భారీ షాక్ తగిలింది. ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థలు మంగళవారం మరోసారి ఇంధన ధరలను పెంచడంతో వారంలోనే రెండోసారి ధరలు పెరిగిన పరిస్థితి ఏర్పడింది. పెట్రోల్, డీజిల్ ధరలు సగటున లీటరుకు 0.90 పైసల మేర పెంచుతూ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. >>2


మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

# పల్లె ప్రగతికే పారదర్శక సర్వే

**గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాల గుర్తింపు**

**గిరిజన ప్రాంతాలకు మ్యాజిక్ డ్రైయిన్ల విస్తరణ: డి.సిఎం పవన్**

**విజయవాడ.మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం అత్యంత పారదర్శకంగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిత్వశాఖలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు ఏమిటి? ఇంకా ఎలాంటి అవసరాలు ఉన్నాయనే వివరాలతోపాటు పంచాయతీ భూములు, పోరంబోకు స్థలాలు, పశువుల మేత మైదానాలు, స్మశానవాటికల పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ సర్వే నివేదికలు ఆధారంగా గ్రామాల్లో భూములకు రక్షణ కల్పించడంతోపాటు ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా నూతన ఆదాయ వనరులను సృష్టించవచ్చని అన్నారు. పల్లె పండుగ 1, 2 కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందన్నారు. పల్లె పండుగ తొలి విడతలో అనుకున్నట్లుగానే పూర్తిగా 4వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయింది. అలాగే 2వ విడతలో 2,750 కిలోమీటర్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, అంతకంటే ఎక్కువగా 3,580 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించాం అన్నారు. మొదటి విడతలో 22,500 గోకులాలు నిర్మించాలనే లక్ష్యానికి గానూ 22,514 పూర్తి చేశాం. రెండవ విడతలో 15 వేల లక్ష్యానికి గానూ 15,303 గోకులాలు నిర్మించాం. పశువుల తాగునీటి అవసరాల కోసం 15 వేల లక్ష్యానికి గానూ 15,188 నీటి తొట్టెలు నిర్మించాం. మొదటి విడతలో 20 వేల ఫార్మ్ పాండ్స్ లక్ష్యానికి గానూ 21 వేలు పూర్తి చేశాం. రెండవ విడతలో ఈ పనులను భారీగా పెంచి, 81 వేలు లక్ష్యానికి గానూ 86 వేలు ఫార్మ్ పాండ్స్ కుంటలను తవ్వించాం. గ్రామాల్లో మురుగునీటి సమస్య నివారణకు పల్లె పండుగ 2.0 కింద సరికొత్తగా 59 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్స్ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే క్షేత్రస్థాయిలో 32.30 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయన్నారు.

**మ్యాజిక్ డ్రెయిన్లు విస్తరించాలి**

గ్రామాల్లో మురుగునీటి సమస్యను శాశ్వతంగా అరికట్టేందుకు మ్యాజిక్ డ్రెయిన్స్ విధానాన్ని మరింత ఎక్కువ గ్రామాల్లో ప్రవేశపెట్టాలి. నల్లరేగడి నేలలు, డెల్టా ఏరియాల్లో నీరు ఎక్కువగా నిల్వ ఉంటుంది కాబట్టి, అక్కడి భూములకు తగినట్లుగా ఈ మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మించాలి. కొండలు, గుట్టలతో కూడిన మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా పరిశుభ్రతను పెంచేందుకు ఈ సరికొత్త డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి. ఈ పనులు చాలాకాలం మన్నేలా, శాస్త్రీయంగా ఉండటం కోసం నిపుణులైన ఇంజనీర్లు, >>2

## ఆదరణ 3.0తో శాశ్వత ఉపాధి

**- మంత్రి సవిత**

**విజయవాడ మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆదరణ 3.0 పథకం ద్వారా బిసిలకు శావ్వత ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బిసిలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ పథకం ద్వారా ఆదునిక పనిముట్లు అందజేస్తామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో బిసి సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత మంగళ వారం ఆదరణ 3.0 పథకం అమలులో భాగంగా కుల వృత్తులకు ఎటువంటి ఆధునిక పరికరాలు ఇవ్వనున్నారో వివరించారు. యువతకు కూడా ఉపాధి లభించేలా యూనిట్లు ఏర్పాటు చేయను న్నట్లు వెల్లడించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ బిసిలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. గతంలో ఆదరణ 1, ఆదరణ 2 పథకాలను సిఎం చంద్రబాబు అమలు చేశారన్నారు. ఇప్పుడు ఆదరణ 3.0 పతకానికి శ్రీకారం చుడుతున్నారని, ఇందుకోసం రూ.1000 కోట్లు వెచ్చిస్తున్నారని వెల్లడించారు. వ్యక్తిగతంగా, గ్రూపులుగా లబ్ధి కలిగేలా ఆదరణ యూనిట్ల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.


మంగళవారం గ్రామసభలో సిఆర్‌డిఎ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న తుళ్లూరు రైతులు

## గ్రామసభ రసాభాస

**సిఆర్‌డిఎ కమిషనర్ తీరుపై రాజధాని రైతులు అసంతృప్తి**

**అధికారులు సమయం ఎందుకు పాటించరంటూ ఆగ్రహం**

**సచివాలయం,మే 19,ప్రభాతవార్త :** భూసేకరణకై రాజధాని అమరావతి పరిధిలోని తుళ్ళూరులో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభ రసాభాసగా మారింది. ఇటీవల కొత్తగా సిఆర్డిఎ కమీషనర్‌గా నియమితులైన విజయరామరాజు గ్రామ సభకు వస్తే తమ సమస్యలు చెప్పుకుందామని పలువురు రైతులు రాగా కమిషనర్ రాకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం 9గంటలకే గ్రామసభ ప్రారంభమవుతుందని >>2

# రాష్ట్రంలో 'సర్'కు రెడీ

**జూన్ 5 నుంచి సిబ్బందికి శిక్షణ**

**తర్వాత ఇంటింటికి ఓటర్ల గణన ఫారాలు పంపిణి**

**షెడ్యూలు విడుదలచేసిన సిఇసి**




**విజయవాడ, మే 19 (ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ లోనూ ఓటర్ల సమగ్ర సవరణ (సర్) అమలు చేసేందుకు భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎపి ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసింది. ఓటర్ల గణన సందర్భంగా బూత్ లెవల్ అధికారులు ఓటర్ల నుంచి సమాచారాన్ని సేకరించి అనంతరం ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. విచారణకు సహకరిం చని వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తారు. ఓటర్ల సమగ్ర సవరణ (సర్)పై జూన్ నెల 5వ తేదీ నుంచి జూన్ నె14వ తేదీ వరకు సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. జూన్ నెల 15వ తేదీ నుంచి జూలై నెల 14వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఒలు)ఇంటింటికి వెళ్లి ముందుగా ప్రచురించిన ఓటర్ల గణన ఫారాలను పంపిణీ చేస్తారు. ఓటర్లు వారి సమాచారమును నింపిన తర్వాత ఆ ఫారములను సేకరిస్తారు. ఈ సమయంలో ఓటర్ల నుండి ఎటువంటి పత్రాలు సేకరించరు. ఓటర్లు తమ లేదా తమ బంధువుల 2002 ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు రికార్డులతో వారి వివరాలను అనుసంధానం చేసుకోవచ్చు. 2002 ప్రత్యేక సమగ్ర సవరణ ఓటర్ల జాబితాలో ఓటు కలిగియున్నవారు, వారి ఓటు ఎక్కడ ఉన్నదో ఈ లింక్ (https://voters.eci.gov.in/searchInSIR/ S2UA4DPDF-JK4QWODSE)ద్వారా తెలుసుకోవచ్చు. ఆన్లైన్ ద్వారా సమర్పించబడి, అనంతరం బిఎల్ఓ ద్వారా ధృవీకరించబడినవి, వివరాలు పూర్తి చేసి సమర్పించిన ఎన్యూమరేషన్ ఫారముల ఆధారంగా ముసాయిదా ఓటరు జాబితా సిద్ధం చేస్తారు. ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారములు సమర్పించక పోతే వారి పేర్లు ఓటర్ల ముసాయిదా జాబితాలో చేర్చరు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం, 2002 ఓటరు జాబితాలతో అనుసంధానం కాని లేదా అనుసంధానంలో వ్యత్యాసాలు ఉన్న వ్యక్తులకు ఎన్నికల నమోదు అధికారి (ఇఆర్ఓ) నోటీసులు జారీ చేస్తారు. నోటీసులు జారీ చేసిన వ్యక్తుల జాబితాను ఎన్నికల నమోదు అధికారి >>2



## వీధి కుక్కలను తరలించాల్సిందే!

**గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించడానికి సుప్రీంకోర్టు నిరాకరణ**

**పిచ్చికుక్కలు, ప్రమాదకరమైన కుక్కలకు కారుణ్య మరణానికి అనుమతి**

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా జంతు జనన నియంత్రణ (ఎబిసి) నిబంధనలను మరింత కఠినంగా అమలు చేసేలా చూసేందుకు, ప్రజా ప్రదేశాలలో వీధి కుక్కల నిర్వహణపై తాను గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. గత ఏడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలలో మార్పులు కోరుతూ కుక్కల ప్రేమికులు, జంతు హక్కుల సంఘాలు దాఖలు చేసిన పలు దరఖాస్తులను జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతా, ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. పాఠశాలలు,ఆసుపత్రులు, బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌ల వంటి సున్నితమైన ప్రజా ప్రదేశాల నుండి పట్టుకున్న వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్స, టీకాలు వేయించిన తర్వాత వాటిని తిరిగి అదే ప్రదేశాలలో వదిలిపెట్టకూడదని ఆ ఆదేశాలలో నిర్దేశించారు. తీర్పును ప్రకటిస్తూ, జస్టిస్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం, "గౌరవప్రదమైన జీవిత హక్కు"లో ప్రజా ప్రదేశాలలో కుక్కల దాడుల భయం లేకుండా జీవించే హక్కు కూడా ఉంటుందని నొక్కి చెప్పింది. వీధి కుక్కల కాటు ముప్పు పెరుగుతున్నప్పటికీ, దానిని సమర్థవంతంగా పరిష్కరించడంలో విఫలమైనందుకు అధికారులను మందలించింది. దాడులకు సంబంధించిన పలు నివేదికలను ప్రస్తావిస్తూ, ఈ సమస్య "దిగ్భ్రాంతికరమైన పరిమాణాలను" సంతరించుకుందని, ఇప్పటికే ఉన్న ఆదేశాలు, చట్టబద్ధమైన నిబంధనల అమలులో తీవ్రమైన లోపాలను ఇది ప్రతిబింబిస్తోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తమ ఆదేశాలను పాటించడంలో విఫలమయ్యే తప్పు చేసిన అధికారులు కోర్టు ధిక్కరణ, క్రమశిక్షణా చర్యలకు బాధ్యులవుతారని జస్టిస్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం హెచ్చరించింది. సమగ్ర ఆదేశాలు జారీ చేస్తూ, ఎబిసి నిబంధనల కింద మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు >>2



మంగళవారం విశాఖలో తీర భద్రతా భవనాన్ని ప్రారంభిస్తున్న డిజిపి హరీష్ గుప్తా

## తీరభద్రతా పోలీసు భవనం

**ప్రారంభించిన డిజిపి హరీష్ కుమార్ గుప్తా**

**విశాఖపట్నం మే 19 ప్రభాతవార్త :** రాష్ట్ర సముద్ర భద్రతా కోసం పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా, నగరంలో నిర్మితమైన నూతన తీర భద్రతా పోలీస్ భవనాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) హరీష్ కుమార్ గుప్తా మంగళవారం ప్రారంభించారు. ఈ ఆధునిక సదుపాయాలతో కూడిన భవనం, రాష్ట్ర విస్తృత తీర ప్రాంతాలపై పర్యవేక్షణ, గూఢచారి సమాచార సేకరణతో పాటు అత్యవసర ప్రతిస్పందన కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా పనిచేయడానికి ఈ భవనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆధునిక సదుపాయాలతో కూడిన భవనం, రాష్ట్ర విస్తృత తీర ప్రాంతాలపై పర్యవేక్షణ, గూఢచారి సమాచార సేకరణ అత్యవసర ప్రతిస్పందన కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా పనిచేయడానికి రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. తీర >>2

## కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో రామ్మోహన్ నాయుడు, శ్రీకృష్ణదేవరాయలు భేటీ

**విజయవాడ,.మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో రామ్మోహన్ నాయుడు, శ్రీకృష్ణదేవరాయలు భేటీ అయ్యారు. ఏపీలో టెక్స్‌టైల్స్, ఆక్వా, పొగాకు రంగాలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చర్చించారు. పత్తి ధర స్థిరత్వానికి 11 శాతం దిగుమతి సుంకం రద్దు చేయాలని ఏపీ నేతలు కోరారు. అమెరికా సుంకాలతో ఆక్వా రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రధానంగా ప్రస్తావించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు టెక్స్‌టైల్స్, ఆక్వా, పొగాకు రంగాలు కీలకమని తెలిపారు. దేశీయ మార్కెట్‌లో నాణ్యమైన పత్తి లభ్యత సవాళ్లను వివరించారు. అక్టోబర్ 31 వరకు పత్తి ఎగుమతులపై తాత్కాలిక నియంత్రణ విధించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సీసీఐ నిల్వలను నేరుగా ఉత్పత్తిదారులకే వెళ్లేలా చూడాలని కోరారు. లక్షలమంది ఉపాధికి ఇబ్బంది వచ్చిందని పీయూష్ గోయల్‌కు వివరించారు.

# రాష్ట్రంలో మినీ మార్ట్‌ల ఏర్పాటు

**కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషితో మంత్రి నాదెండ్ల భేటీ**

**విశాఖ, విజయవాడలో సిబిడిసి ప్రక్రియకు అనుమతి**


మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయిన మంత్రి నాదెండ్ల

**విజయవాడ, మే 19, ప్రభాతవార్త ప్రతినిధి:** రాబోయే రోజుల్లో ఎపిలో మినీ మార్టులను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళ వారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఎపికి సంబంధించిన పలు కీలక అంశాలపై వారితో చర్చించారు. విశాఖ, విజయవాడలో సిబిడిస ప్రక్రియకు అనుమతి వచ్చిందని కేంద్ర మంత్రులతో నిర్వహించిన సమావేశం అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు. మరో నెల రోజుల్లోనే సిబిడిసికి సాంకేతికత, డేటా సేకరించుకొని ప్రారంభిస్తామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు.

అదే విధంగా రాబోయే రోజుల్లో వెయ్యి మినీ మార్టుల ఏర్పాటుకు అధికారులు ముందుకొచ్చారని తెలియజేశారు. కంది, మినప వారే సరఫరా చేసి మార్కెట్ కంటే తక్కువ ధరలో ఉండేలా ఏర్పాట్లు చేస్తారని నాదెండ్ల పేర్కొన్నారు. >>2

## నేడు మెడికల్ షాపుల బంద్

**విజయవాడ,మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా ఈ నెల 20న మందుల దుకాణాల బంద్ జరగనుంది. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఆన్‌లైన్‌లో నకిలీ, ప్రమాదకర మందుల సరఫరా అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసనను చేపట్టనుండటం గమనార్హం. దీని ఫలితంగా రాష్ట్రంలో 40వేలకు పైగా ఉన్న మందుల దుకాణాలు మూతపడనున్నాయి. దీనికి ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు వెల్లడించారు.

19-5pg2exHMNWJQE.qxd:19-5pg2exHMNWJQE.qxd 1/1/02 6:42 AM Page 1





మంగళవారం తుమ్మలపెంటలో ఓ మత్స్యకార కుటుంబంతో కలిసి భోజనం చేస్తున్న సిఎం చంద్రబాబు

# స్వచ్ఛరథం సానుకూలం

## అభివృద్ధి పనులు తెలిపేలా డాష్‌బోర్డు : డి.సిఎం పవన్

**విజయవాడ,మే 19, ప్రభాతవార్త ప్రతినిధి:** ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా అమలు చేస్తున్న స్వచ్ఛ రథం కార్యక్రమం సానుకూల ఫలితాలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. పౌరులు తమ వద్ద ఉన్న పొడి వ్యర్థాలను ఈ స్వచ్ఛ రథాలకు అప్పగించి, వాటికి బదులుగా నిత్యావసర వస్తువులను పొందే ఈ విధానాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా తిరుపతి జిల్లాలో ఒక ప్రయోగాత్మక ప్రాజెక్టుగా ప్రారంభించిన గ్రీన్ షాప్‌నమూనాను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయా లని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రాలవద్ద పొడి వ్యర్థాలను ఇచ్చి నిత్యావసర వస్తువులను పొందవచ్చనే విషయంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన సూచించారు. ఏప్రిల్ నెలలో స్వచ్ఛ రథాల ద్వారా 18.86 లక్షల కిలోల వ్యర్థాలు సేకరించినట్లు ఆయన వివరించారు. ఈ సేకరించిన వ్యర్థాల విలువ సుమారు రూ.3 కోట్లు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



మంగళవారం 'మత్స్యకార సేవలో' సందర్భంగా ఇంటికి వచ్చిన మత్సకారులతో మంత్రి లోకేష్

# బోటూ మనదే.. వేటా మనదే

>> నిధులు జమ అయ్యాయి. దీంతో తమకు డబ్బులు జమ అయ్యాయంటూ సంతోషం వ్యక్తం చేస్తూ సెల్ ఫోన్లల్లో వచ్చిన మెసేజీలను ముఖ్యమంత్రికి లబ్దిదారులు చూపించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."సముద్ర తీర ప్రాంతంలో పోర్టులు వస్తే అభివృద్ధి జరుగుతుంది. తీర ప్రాంతంలో జరిగే అభివృద్ధిలో మత్స్య కారులకూ భాగస్వామ్యం ఉండాలి. అభివృద్ధిని మత్స్య కారులు అందిపుచ్చుకునేలా ప్రణాళికలు చేస్తాం. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు అవుతోంది. దీని ద్వారా స్థానికులకే ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. రూ.288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నాం. మత్స్య కారులను ఆర్థికంగా బలోపేతం చేసేలా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ కేంద్రంగా ప్రణాళికలు సిద్దం చేస్తున్నాం. వీటిపై కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకూ తావులేదు. ఫేక్ ప్రచారాలను నమ్మ వద్దు. ఈ తీరం మనది, బోటూ మనదే.. ఇక్కడ సంపద కూడా మనదే. ఈ విషయంలో రాజీ లేదు. మన తీరప్రాంతానికి పొరుగు రాష్టం వారు ఎవరొచ్చినా సహించేది లేదు. మత్స్యకారుల హక్కులు కాపాడతాం. మన తీరప్రాంతంలో నిఘా పెట్టి పొరుగు రాష్ట్రాల బోట్లు రాకుండా చర్యలు తీసుకుంటాం. తీరం మనదే, బోటు మనదే వేటా మనదే ఇదే సీబీఎన్ మాట."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్ లా వ్యవహరిస్తా**

"రాష్టంలోని రిజర్వాయర్లు, చెరువుల్లో నీళ్లు నిండుగా ఉన్నాయి. అక్కడ చేపల పెంపకం చేపట్టండి. ఆ మత్స్య సంపదను విక్రయించుకునే హక్కులను మత్స్య కారులకే అప్పగించాం. రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరుల్లో ఫిష్ సీడ్‌ను అందించేలా మత్స్య శాఖకు ఆదేశాలిచ్చాం. చేపల వేటతో పాటు కొత్త ఆదాయ మార్గాలను కూడా మత్స్య కారులకు అందుబాటులోకి తెస్తాం. మన రాష్ట్రానికి సుదీర్ఘ సముద్ర తీరప్రాంతం ఉంది. సముద్ర తీరప్రాంతంలో నివసించే మత్స్య కారుల జీవితాల్లో వెలుగులు నింపేలా చర్యలు చేపడుతున్నాం. టెక్నాలజీతోపాటు... వినూత్న పద్దతుల ద్వారా మత్స్య కారులను ఆర్థికంగా ఆదుకుంటాం. చేపల వేటకు వెళ్లే మత్స్య కారులకు అండగా నిలబడడమే కాకుండా... మత్స్యకార మహిళలకు ఉపాధి కల్పించి.. ఆర్థిక సాధికారత కల్పిస్తాం. సీవీడ్ కల్చర్ ద్వారా మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతాం. మత్స్యకార మహిళలు, డ్వాక్రా సంఘాల మహిళలు సముద్రపు నాచు పెంపకం ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా చేస్తాం. చేపలు మంచి పౌష్టికాహారం. ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ప్రోటీన్ ఉన్న ఈ ఆహారానికి అన్ని చోట్లా గిరాకీ ఉంది. మత్స్య ఉత్పత్తులకు గిరాకీ సృష్టించేలా మార్కెటింగ్ మేనేజర్‌గా వ్యవహరిస్తాను."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**మత్స్య కారుల సేవలో ఉంటాం... అండగా నిలుస్తాం**

"దేశంలో చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంది. ఇది కొనసాగాలంటే... మత్స్య కారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి... వారికి అండగా నిలవాలి. ఆ దిశగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. మత్స్య కారులకు మేం అండగా ఉంటాం. మెకనైజ్డ్, మోటరైజ్డ్ డీజిల్ పడవలకు లీటరుకు రూ.9 మేర డీజిల్ సబ్సిడీ ఇస్తున్నాం. 2026-27లో రూ.50 కోట్ల విలువైన డీజిల్ సబ్సీడిని మత్స్య కార బోట్లకు అందించాం. రూ.3256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, 8 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను కూడా ప్రభుత్వం నిర్మిస్తోంది. మత్స్య కారుల రక్షణ కోసం సముద్రంలో 4,550 ట్రాన్స్ పాండర్లను ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. పడవలు, వలలు, పరిహారం సకాలంలోనే ప్రభుత్వం అందిస్తోంది. 200 మెకనైజ్డ్ బోట్లను మత్స్యకారుల కోసం శాంక్షన్ చేస్తాం. 60 శాతం సబ్సీడీ ఇవ్వటంతో పాటు మిగిలిన మొత్తాన్ని రుణంగా మంజూరు చేస్తాం. మత్స్య కారులు సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు చేపలు ఎక్కడ లభ్యం అవుతాయో అనే సమాచారాన్ని కూడా ఇస్తున్నాం. మెకనైజ్డ్ బోట్లతో సులువుగా చేపల వేట చేసేలా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. ఆక్వా కల్చర్ కు అభివృద్ధి కోసం ఒక్కో యూనిట్ కు రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మన రాష్ట్రానికి ఏ రంగంలో ఆదాయం వస్తుందో దానిపై శ్రద్ధ పెట్టి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. చేపల వేట నిషేధ సమయంలో మత్స్య కారుల సేవలో పేరిట రూ.20 వేల చొప్పున చేయూత అందిస్తున్నాం. రాష్టంలో మత్స్య కారుల సంక్షేమం గురించి నిరంతరం ఆలోచిస్తూ వారిని ఆదుకుంటున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతీ మత్స్య కార కుటుంబానికి 50 కేజీల చొప్పున బియ్యం ఇచ్చి సాయం చేశాం. 201419 మధ్యలోనూ చేపలవేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల వరకూ ఆర్థిక సాయం చేసి టీడీపీ ప్రభుత్వం ఆదుకుంది. మళ్లీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.20 వేలకు ఆర్థిక సాయాన్ని పెంచి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

**మత్స్యకార మహిళలకు సీవీడ్ సాగులో శిక్షణ**

మత్స్య కారుల సేవలో బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన శాఖల స్టాళ్లను ముఖ్యమంత్రి తిలకించారు. అలాగే సీవీడ్, తీర ప్రాంత నిఘా కేంద్రాన్ని సందర్శించారు. తీర ప్రాంతంలో సముద్రపు నాచు సాగు చేసేలా మత్స్య కార మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీఎస్ఎంసీఆర్ఐ సహకారంతో మత్స్యకార మహిళలు అదనపు ఆదాయం పొందేలా సీవీడ్ కల్చర్ చేసేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. తీరప్రాంతాల్లో మహిళలు సముద్రంలో సీవీడ్ సాగు చేసేలా శిక్షణతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు మత్స్యకార మహిళల శిక్షణకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ కోసం జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ ఫర్ సీ పెట్రోలింగ్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. మెరైన్ పోలీస్, మత్స్యశాఖ, అటవీశాఖ, స్థానిక మత్స్య కారులతో సంయుక్తంగా సీ పెట్రోలింగ్ జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల మత్స్యకారుల బోట్లు చొరబడకుండా గస్తీ కోసం శాటిలైట్ చిత్రాల సాయం తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. డ్రోన్ల ద్వారా గస్తీ నిర్వహించి హెచ్చరికలు జారీ చేసే సాంకేతిక వ్యవస్థను అధికారులు సిఎం ఎదుట ప్రదర్శించారు. ఎపి సరిహద్దుల్లోని సముద్ర జలాల్లోకి ప్రవేశించిన పొరుగు రాష్ట్రాల బోట్లకు తెలుగు, తమిళం ఇతర భాషల్లో హెచ్చరికలు జారీ చేసేలా డ్రోన్లను వినియోగిస్తున్నట్టు అధికారులు సిఎంకు వివరించారు. స్థానిక మత్స్య కార బోట్లు అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లినప్పుడు హెచ్చరికలు వచ్చే జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను సీఎం పరిశీలించారు. ఇక స్థానికంగా పండిన మామిడి కాయలను పరిశీలించిన ముఖ్యమంత్రి రైతును అభినందించారు. డీఆర్డీఓ, వెపన్ సిస్టమ్స్ తయారీ కంపెనీల స్టాళ్లను సీఎం సందర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అచ్చెన్నాయుడు, ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మార్ట్‌ల ఏర్పాటు

>> మిల్లెట్స్‌నూ మినీ మార్టుల ద్వారా అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ చేపడతామని మంత్రి నాదెండ్ల అన్నారు. నాణ్యమైన వస్తువులను తక్కువ ధరకు అందించేలా ఏర్పాట్లు చేస్తామని ధీమా వ్యక్తంచేశారు. అదే విధంగా రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలు, ప్రజ లకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే విధానాలు, సరఫరా వ్యవస్థలో సమన్వయం పెంపు వంటి అంశాలపై మంత్రి నాదెండ్ల విస్తృతంగా చర్చించారు.

# మరోమారు వాయిదా పడ్డ కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశం

**విజయవాడ,మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశం మరోమారు వాయిదా పడింది. ఈ నెల 14న జరగాల్సిన సమావేశం 21వ తేదీకి గతంలో వాయిదా పడగా ఇప్పుడు మళ్లీ ఈ నెల 21న కేబినెట్ భేటీదృష్ట్యా వాయిదా మరలా వేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. దాంతో తెలంగాణ విజ్ఞప్తి మేరకు 21న జరగాల్సిన భేటీని కెఆర్ఎంబి వాయిదా వేసింది. సమావేశం తేదీని త్వరలోనే వెల్లడిస్తామని ఈ సందర్భంగా కృష్ణా బోర్డు వెల్లడించింది.

# దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** దేవాదా యశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి జ్యుడీషియల్ రిమాండ్ జూన్ 2 వరకు పొడిగిస్తూ సిబిఐ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అవినీతి ఆరోపణల కేసులో సస్పెండైన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిని ఎసిబి అధికారులు సిబిఐ కోర్టులో ఎసిబి పోలీసులు హాజరు పరిచారు. ఎసిబి జడ్జి వేసవి సెలవుల కారణంగా సిబిఐ కోర్టులో శాంతిని ప్రవేశపెట్టారు,. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విజయవాడలోని జిల్లా జైలులో ఉన్న శాంతికి జ్యుడీషియల్ రిమాండ్ ముగిసింది. ఈ కేసులో ఇప్పటికే రెండు సార్లు బెయిల్ పిటిషన్లను కోర్టు తిరస్కరించింది.

# మాటమీద నిలబడేది మత్స్యకారులే

## వారినుంచి చాలా నేర్చుకోవాలి: మంత్రి లోకేష్

## 100 బోట్లలో సిఎం ఇంటికి వచ్చిన మత్తకారులు

## వారికి ఆత్మీయ విందు ఇచ్చిన మంత్రి లోకేష్

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** మత్స్యకారుల నుంచే మాట మీద నిలబడే తత్వం అందరం అలవర్చుకోవాలి అని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 'మత్స్యకారుల సేవలో' రెండో యేడాది నిధుల విడుదల సందర్భంగా వంద బోట్లపై వచ్చిన మత్స్యకారులు సిఎం, ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల నుంచే మాట మీద నిలబడే తత్వాన్ని అందరూ అలవర్చుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు."మత్స్యకారుల సేవలో" కార్యక్రమం కింద రెండో ఏడాది నిధులు విడుదల చేసిన సందర్భంగా వెంకటపాలెం, తుమ్మలపాలెం, సీతానగరం, కుమ్మరపాలెంలకు చెందిన మత్స్యకారులు వంద బోట్లతో కృష్ణా నదిలో ర్యాలీ నిర్వహించి ముఖ్యమంత్రికి, ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం బోట్లపై వచ్చిన మత్స్యకారులను ఇంట్లో నుంచి చూసిన మంత్రి లోకేష్ వారికి అభివాదం చేస్తూ ఇంటికి రమ్మని ఆప్యాయంగా ఆహ్వానించారు. అంతా కలిసి ఒక్క మాట అనుకుంటే, దానిపై మత్స్యకారులు నిలబడతారని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పాదయాత్రలో మీరు చూపించిన క్రమశిక్షణ ఎన్నటికీ మర్చిపోలేను. మాట మీదే నిలబడుతారు. మీలో ఐక్యత చాలా గొప్పగా ఉంటుంది. మీ నుంచి మేము చాలా నేర్చుకోవాలి. మత్స్యకారుల కోసం ప్రభుత్వం మెరుగైన సేవలందిస్తుంది. మత్స్యకారుల పట్టుదలే వేరు. యువగళం మీకేం కావాలన్నా ధైర్యంగా అడగొచ్చు. ఇది మన ప్రభుత్వం, ఏ సమస్య వచ్చినా మీరు ఇక్కడికి రావచ్చు. ఎలాంటి సహాయమైనా అడగొచ్చు వైఎస్సార్సీపీ పాలనలో రాష్టం ఎంత ధ్వంసమైందో అందరూ చూశారని, అయినా మత్స్యకారులు ఎన్ని కష్టాలు పడినా పిల్లలను బాగా చదివిస్తున్నారని ప్రశంసించారు. మత్స్యకారులకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య అయినా ఎప్పుడూ తమ ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని మంత్రి హామీ ఇచ్చారు. పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ఈ నిధులు అందిస్తున్నారు. తీరప్రాంత భద్రతతో పాటు సముద్ర జాలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. డ్రోన్లు, పెట్రోలింగ్ బోట్లతో అక్రమ వేటను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇంట్లో కూర్చోబెట్టుకుని మత్స్యకారులందరితోనూ ఆప్యాయంగా మాట్లాడి ఫొటోలు దిగారు. తాము సిఎంకు కృతజ్ఞతలు చెప్పడానికి వస్తే మంత్రి లోకేష్ తమకు ఆత్మీయ ఆతిథ్యం అందించారని మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.

# తీరభద్రతా పోలీసు భవనం

>> భద్రతా పోలీస్‌ను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. తీర భద్రతా పోలీస్ శాఖ పనితీరును సమీక్షించి, బీచ్‌ల వద్ద తీసుకుంటున్న నివారణ చర్యల పై ప్రశంసలు కురిపించారు. అలాగే బీచ్ పెట్రోలింగ్ వివరాలు, ప్రాణ రక్షణ చర్యలు, కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమాలు, గ్రామ విజిలెన్స్ కమిటీల పనితీరు వాటి ప్రభావం, తీర భద్రతా విభాగంలో ప్రత్యేక ఇంటెలిజెన్స్ యూనిట్ పనితీరు, అందుబాటులో ఉన్న పరికరాలు, వాహనాలు, వాటి అభివృద్ధి అవసరాలు, ఇప్పటివరకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎపిఎస్పికు చెందిన 3 ప్లాటూన్ల ప్రవేశపెట్టడం, పర్యావరణ పరిరక్షణపై (ఆలివ్ రిడ్లీ తాబేళ్లు) అవగాహన కార్యక్రమాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు, నైట్ హాల్ట్స్, దీవుల్లో జాతీయ పతాకఆవిష్కరణ, నావల్ ఎన్‌సిసి కార్యక్రమాలను పరిశీలించి, తీర భద్రతా పోలీస్ చేపట్టిన కార్యక్రమాలను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో తీర భద్రతా పోలీస్, ఆంధ్రప్రదేశ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపీనాథ్ జట్టి, ఇతర పోలీస్ అధికారులు హాజరయ్యారు.

# పల్లె ప్రగతికే పారదర్శక సర్వే

>> తంగా తీసుకోవాలని చెప్పారు.

**గ్రామీణ రోడ్ల నాణ్యతపై రాజీపడొద్దు**

గ్రామాల్లో నిర్మించే సిసి రోడ్లు దీర్ఘకాలం మన్నేలా ఉండాలి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి. నాణ్యత లోపిస్తే సహించేది లేదు. సిసి రోడ్డు వేసిన తర్వాత ఇరువైపులా అలాగే వదిలేయకుండా, మట్టితో పక్కాగా వాలు చేయాలి. వాలు చేయకుండా వదిలేస్తే వాహన ప్రమాదాలు జరిగే అవకాశంతోపాటు వర్షాకాలంలో నీరు నిలిచిపోయి రోడ్డు అంచులు త్వరగా పాడైపోతాయి. పల్లె ప్రజలకు నాణ్యమైన, దీర్ఘకాలం మన్నే రహదారులను అందించడమే లక్ష్యంగా రోడ్లకు జియో మానిటరింగ్ సిస్టమ్‌ను తీసుకొచ్చాం. రోడ్ల పర్యవేక్షణ, డూప్లికేషన్‌కు చెక్ పెట్టేందుకు ఈ డిజిటల్ పద్ధతి సహాయపడుతుంది. ఏ గ్రామంలో, ఏ ప్రాంతంలో ఎంతవరకు రోడ్డు పనులు జరిగాయో శాటిలైట్, జియోట్యాగింగ్ ద్వారా క్షేత్రస్థాయిలో కచ్చితంగా తెలుసుకోవచ్చు. ఈ సాంకేతికత ద్వారా సేకరించిన వివరాల ఆధారంగా, ఆయా గ్రామాల్లోని రోడ్లను ఇతర ముఖ్య ప్రాంతాల రోడ్లతో సులభంగా అనుసంధానం చేయవచ్చు. ప్రజలు కూడా రోడ్ల యొక్క ప్రస్తుత స్థితిగతులను ఆన్‌లైన్ ద్వారా నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

# మళ్లీ పెట్రో షాక్

>> ఇప్పటికే గత శుక్రవారం పెట్రోల్‌పై లీటర్‌కు రూ.3.14, డీజిల్‌పై రూ.3.11 పెరగగా తాజాగా మరోసారి పెట్రోల్, డీజిల్‌పై అదనంగా 0.90 పైసలు చొప్పున పెరగడంతో వాహనదారులపై అదనపు భారం పడినట్లయింది. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.0.87 పైసల మేర పెరిగి రూ.97.77 నుంచి రూ.98.64కు పెరిగింది. అలాగే లీటర్ డీజిల్ ధర 0.91 పైసలు మేర పెరగడంతో రూ.90.67 నుంచి రూ.91.58కి చేరింది. ఇక దేశ ఆర్థిక రాజధాని ముంబై ప్రాంతంలో లీటర్ పెట్రోల్‌పై 0.91 పైసలు పెంచారు. దీంతో లీటర్ పెట్రోల్ రూ.107.59కి చేరింది. అలాగే లీటర్ డీజిల్‌పై 0.94 పైసలు పెంచారు. దీంతో డీజిల్ లీటరుకు రూ.94.08కు ఎగబాకింది. మరోవైపు కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర 0.96 పైసల మేర పెరిగింది. దీంతో ఇప్పుడు లీటర్ పెట్రోల్ రేటు రూ.109.70కి చేరింది. ఇక లీటర్ డీజిల్ ధరను 0.94 పైసలు పెంచారు. దీంతో కోల్‌కతాలో డీజిల్ లీటరుకు రూ.96.07కు చేరింది. దక్షిణాదిన చెన్నై ప్రాంతంలో లీటర్ పెట్రోల్ రేటును 0.82 పైసలు పెంచడంతో రూ.104.49 స్థాయికి చేరింది. లీటర్ డీజిల్ పై రూ.86 పైసలు పెంచడంతో రూ.96.11 స్థాయికి ఎగబాకింది. ధరల పెంపు తర్వాత హైదరాబాద్ నగరంలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ.110.88కు చేరుకుంది. ఇక డీజిల్ ధర రూ.98.99కు పెరిగింది. ప్రస్తుతం విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.88గా ఉండగా లీటర్ డీజిల్ ధర రూ.101.57కు పెరిగింది. విశాఖపట్టణంలో లీటర్ పెట్రోల్ ధర రూ.108.48గా ఉండగా డిజిల్ ధర రూ.96.22గా ఉంది. ఇక వరంగల్ నగరంలో పెట్రోల్ లీటరు ధర రూ.110.53కు చేరగా డిజిల్ ధర రూ.98.65కు పెరిగింది.

గత శుక్రవారం కూడా చమురు కంపెనీలు లీటరుకు దాదాపు రూ.3 మేర ధరలను పెంచిన నేపథ్యంలో తాజా పెంపుతో కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే ఇంధన ధరలు సుమారు రూ.4 వరకు పెరిగాయి. పెట్రో ధరల పెరుగుదలకు అంతర్జాతీయ ముడి చమురు మార్కెట్‌లో నెలకొన్న అస్థిర పరిస్థితులే ప్రధాన కారణమని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు ప్రపంచ పరిస్థితులు త్వరలో సాధారణ స్థితికి రాకపోతే, రాబోయే రోజుల్లో మరిన్ని విడతలుగా పెట్రో ధరలు పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరో వారం రోజుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరగబోతున్నాయని తెలుస్తోంది. డీజిల్‌పై లీటకు రూ.11.40, పెట్రోల్‌పై లీటరుకు రూ.14.30 మేర పెరిగే అవకాశం ఉందని, అయితే, ప్రస్తుతం నష్టాలను పూర్తిగా పూడ్చడానికి పెట్రోల్, డీజిల్ పై లీటరకు రూ.13 నుంచి రూ.17 వరకు అవసరం కావచ్చునని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ అంచనా వేసింది.

# వీధి కుక్కలను తరలించాల్సిందే!

>> (యుటిలు) కాలపరిమితితో కూడిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రతి జిల్లాలో శస్త్రచికిత్స సౌకర్యాలు, శిక్షణ పొందిన సిబ్బంది, తగిన లాజిస్టిక్స్ మద్దతుతో కూడిన కనీసం ఒక పూర్తిస్థాయి ఎబిసి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అది తప్పనిసరి చేసింది.

**పిచ్చికుక్కలు, ప్రమాదకరమైన కుక్కలకు కారుణ్య మరణానికి అనుమతి**

మానవ ప్రాణాలకు ముప్పును అరికట్టడానికి, తగిన సందర్భాలలో, చట్టబద్ధమైన నిబంధనలకు కచ్చితంగా అనుగుణంగా, పిచ్చికుక్కలు, ప్రమాదకరమైన కుక్కలకు కారుణ్య మరణం (యుథనేషియా) చేపట్టేందుకు అధికారులకు సుప్రీంకోర్టు అనుమతిచ్చింది.

"వీధి కుక్కల జనాభా ఆందోళనకర స్థాయికి చేరిన ప్రాంతాలలో, కుక్క కాట్లు లేదా దూకుడు దాడుల ఘటనలు తరచుగా జరుగుతూ, ప్రజా భద్రతకు నిరంతర ముప్పును కలిగిస్తున్న చోట, సంబంధిత అధికారులు, అర్హత కలిగిన పశువైద్య నిపుణులచే సరైన అంచనాకు లోబడి, జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం 1960, జంతు జనన నియంత్రణ నియమాలు 2023, ఇతర వర్తించే చట్టబద్ధమైన నిబంధనలకు కచ్చితంగా అనుగుణంగా, పిచ్చికుక్కలు, నయంకాని వ్యాధితో ఉన్న, లేదా స్పష్టంగా ప్రమాదకరమైన/ దూకుడు స్వభావం గల కుక్కల విషయంలో, మానవ ప్రాణాలకు, భద్రతకు ఎదురయ్యే ముప్పును సమర్థవంతంగా అరికట్టడానికి, కారుణ్య మరణంతో సహా చట్టబద్ధంగా అనుమతించబడిన చర్యలను తీసుకోవచ్చు" అని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

# కృష్ణా నదిలో బోట్లతో మత్స్యకారుల భారీ ర్యాలీ



మంగళవారం విజయవాడ కృష్ణా నదిలో బోట్లతో మత్స్యకారుల భారీ ర్యాలీ దృశ్యం

**విజయవాడ, మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా నదిలో బోట్లతో మత్స్యకారులు భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మత్స్యకారులు బోట్ల ప్రదర్శన చేశారు. వరుసగా రెండో ఏడాది "మత్స్యకారుల సేవలో పథకం కింద నిధుల విడుదల చేయడంపై మత్స్యకార కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. తమ సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా కృష్ణా నదిలో బోట్ల ర్యాలీతో ప్రభుత్వానికి మత్స్యకారులు మద్దతు తెలిపారు. వేట నిషేధ సమయంలో ఇబ్బంది పడకుండా ఒక్కో మత్స్యకార కుటుంబానికి ప్రభుత్వం 20 వేల రూపాయల ఆర్థిక భరోసాఇస్తోంది. గత ఏడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందచేయగా నేడు మత్స్యకార కుటుంబాలకు సిఎం చంద్రబాబు రూ.262 కోట్ల ఆర్థిక సహాయం అందించారు.

# రాష్ట్రంలో 'సర్'కు రెడీ

>> ప్రచురిస్తారు. ఈ జాబితాలు స్థానిక సంస్థల కార్యాలయాల నోటీస్ బోర్డులపై, అలాగే ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ), జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్) వెబ్ సైట్లలో ప్రదర్శిస్తారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం, క్లెయిమ్లు మరియు అభ్యంతరాల కాలంలో ఎన్యూమరేషన్ ఫారమ్ నందు వివరాలు అన్ని పూర్తి చేసి, బిఎల్‌ఒకి మరియు ఆన్లైన్ ద్వారా సమర్పించిన ఫారములపై విచారించి తగు నిర్ణయాలను తీసుకుంటారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు ఉన్న వ్యక్తికి సముచిత విచారణ జరపకుండా మరియు న్యాయసమ్మతమైన అవకాశం ఇవ్వకుండా, ఎన్నికల నమోదు అధికారి ఆ పేరును తొలగించరని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్యూమరేషన్ సమయంలో 18 సం.ల వయస్సు ఉన్నవారు కొత్తగా ఓటు నమోదు కోసం ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని లేదా ఫారం6లో వివరాలు పూర్తి చేసి తగు డాక్యుమెంట్లు జతపరచి బిఎల్‌ఒకి లేదా సంబంధిత తహశీల్దారు వారి కార్యాలయములో ఇవ్వవచ్చని ఎన్నికల సంఘం తెలిపింది. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి పోలింగు కేంద్రానికి బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని ఎన్నికల సంఘం కోరింది. ప్రతి పోలింగు కేంద్రంలో బూత్ లెవెల్ ఏజెంట్లు, బిఎల్‌ఒలు పూర్తి సమన్వయముతో పనిచేసి ప్రత్యేక సమగ్ర సవరణ అత్యంత పారదర్శకంగా నిర్వహించడానికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## వారం - వర్జ్యం

20-05-2026, అధికజ్యేష్ఠ బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
చవితి ఉ.11.10
ఆరుద్ర ఉ.6.12, పునర్వసు తె.4.13
వర్జ్యం : సా.5.12-సా.6.40
దు. ఉ.11.38-మ.12.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** లౌక్యం లోపిస్తుంది. ఇందువలన నష్ట మేర్పడక పోయినా సమాజంలో మీ పై కొంత దుష్ప్రచారం జరుగుతుంది.బంధువుల కలయిక.

**వృషభం:** నిర్వహించలేక పారిపోతారని ఇతరుల అంచనాలు తలక్రిందులు చే-స్తారు. విశ్రాంతికి సమయం ఉండదు.

**మిథునం:** ఇష్టం లేకపోయినా, నమ్మకం లేకపోయినా కొందరిని తాత్కాలికంగా నమ్మాల్సిన స్థితి తప్పదు.వస్త్రలాభం.

**కర్కాటకం :** ఉద్యోగంలో ఇబ్బందులు కలిగించే వర్గం మళ్ళీ పుంజుకుంటారు. ఆర్థికపరమైన అంశాలు అనుకూలంగా ఉంటాయి.

**సింహం:** కుటుంబపరమైన విషయాలు నిర్లక్ష్యం చేశారని విమర్శలు చేస్తారు. స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలు సానుకూల పడతాయి.

**కన్య :** నిర్మాణ సంబంధమైన విషయాలలో లోపాలు కనిపెడతారు. సంఘంలో గౌరవం పెరుగుతాయి. నూతన విద్యావకాశాలు.

**తుల :** అధిక మొత్తములో ధనం ఖర్చయినా ఎందుకు లెక్కలు చూపడం లేదో మీకు అర్థమవుతుంది. కొత్తమిత్రులు పరిచయం.

**వృశ్చికం:** మీ వ్యక్తిగత విషయాలను ఆసరగా తీసుకొని మీకు అన్నివిధాలుగా నష్టం తెస్తున్నారని గుర్తిస్తారు.

**ధనుస్సు:** సంతాన పురోగతి బాగుంటుంది. వాళ్ళకు మంచి అవకాశాలు వస్తాయి. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**మకరం:** సాంకేతిక కారణాల వల్ల ముఖ్యమైన విషయాలు వాయిదా పడతాయి. ఇది మీ అభివృద్ధికి పరోక్షంగా కారణం అవుతుంది.

**కుంభం:** మీరు ఊహించిన వ్యయం అధికం అవుతుంది. బ్యాంకు ఋణాలు సాధించు కుంటారు. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం :** మీకు రావలసిన ధనం, బిల్లులు, పెట్టుబడులు సమయానికి ఆదుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గ్రామసభ రసాభాస

>> చెప్పి 11 గంటల వరకు కూడా అధికారులు రాకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.భూ సమీకరణ చేసి 10సంవత్సరాలు గడిచిన ఇంతవరకు గ్రామ కంఠాల సమస్య తీర్చలేదని సిఆర్డిఎ తీరుపై మండిపడ్డారు.ఎండ తీవ్రత ఉక్కపోతగా ఉన్నప్పటికీ టెంట్లో గంటలు తరబడి రైతులు వేచి యున్నా కమిషనర్ రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అధికారులకు మాత్రం ఫ్యాన్లు కూలర్లు ఏర్పాటు చేసి రైతులకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోవడంపై మండి పడ్డారు.రాష్ట్రానికి రాజధాని లేదంటూ సిఎం చంద్రబాబు రైతులకు విజ్ఞప్తి చేయడంతో 33వేల ఎకరాలు రైతులు అందజేసినట్లు తెలిపారు.అమరావతిని అభివృద్ధి చేసే భాగంలో సిఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కష్టపడుతూ సమయపాలన పాటిస్తుంటే అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా పనిచేయడం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు.దేవుడు కరుణించినా పూజారి కరుణించని సామెతగా రైతుల పరిస్థితి ఉందని విమర్శించారు.రాజధాని సీడ్ యాక్సెస్ రోడ్లలో భాగంగా ఇల్లు కోల్పోయిన వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారం అంచనాల విషయంలో కూడా అధికారులు సక్రమంగా స్పందించడం లేదని ఈ విషయాన్ని పలుమార్లు పలువురు సిఆర్డిఎ కమిషనర్లకు విన్నవించినా పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. రైతుల విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయాలను ప్రజాప్రతినిధులు గమనించాలని అవసరమైతే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.



## వైకాపా పాలనలోనే దళితులపై అఘాయిత్యాలు

- ఎంపి దగ్గుమళ్ళ, టిడిపి నేత షణ్ముగరెడ్డి, ఎమ్మెల్యేలు విఎం థామస్, డాక్టర్ కలికిరి మురళీమోహన్

**చిత్తూరు, మే 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్న సమయంలో దళితులపై తీవ్ర ఆఘాయిత్యాలు జరిగాయని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి, ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ విఎం థామస్, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు విలేకరుల తో మాట్లాడుతూ రాష్ట్రంలో 2014 నుండి 2019 సంవత్సరం వరకు అధికారంలో వున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సామాజిక వర్గాలపై అమానవీయ ఘటనలు, హత్యలు, దౌర్జన్యాలు యధేచ్ఛగా చేసిందన్నారు. వైకాపా ఎమ్మెల్సీ తోట అనంతబాబు తన మాజీ డ్రైవర్ అయిన దళిత యువకుడు వీధి సుబ్రమణ్యంను దారుణంగా హత్య చేసి ఇంటి వద్దకు డోర్ డెలవరీ చేశారని ఆరోపించారు. అలాగే కరోనా సమయంలో విశాఖపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో మాస్కులు, రక్షణ పరికరాలు కొరతగా వుందని ప్రశ్నించినందుకు దళిత వైద్యుడు డాక్టర్ సుధాకర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసి ఆపై రోడ్డుపై హింసించిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందన్నారు. గతంలో వైకాపా అధినేత జగన్‌పై జరిగిన కోడికత్తి దాడి కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావుపై ఎలాంటి స్పష్టమైన విచారణ పూర్తి కాకుండానే ఏళ్ళ తరబడి జైలులో వుంచి మానసిక క్షోభకు వైకాపా ప్రభుత్వం గురిచేసింద న్నారు. ఐదేళ్ళ వైకాపా పాలనలో వేల సంఖ్యలో దళితులపై దాడులు, ఎస్సీ మహిళలపై అత్యాచారాలు జరిగాయన్నారు. ఇకనైనా వైకాపా నాయకులు తీరు మార్చుకోకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

# ప్రభుత్వంపై విషప్రచారం సిగ్గుచేటు

- మంత్రి అచ్చెన్నాయుడు



**కావలి (నెల్లూరు), మే 19 ప్రభాతవార్త:** మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ప్రభుత్వంపై విషప్రచారం చేయడం సిగ్గుచేటని కుక్కతోక వంకర వైసిపి నేతల బుద్ధి చిందవందర అని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. ప్రజలకు మంచి జరుగుతుంటే జీర్ణించుకోలేక అబద్ధాలు, విషప్రచారాలతో రాష్ట్రంలో గందరగోళం సృష్టించేందుకు వైసిపి నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తుమ్మలపెంటలో మత్స్యకార భరోసా కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. మత్స్యకార శాఖలో కోట్లాది రూపాయలు సంక్షేమ నిధులు నేరుగా జమ అవుతున్నా వాస్తవా లను వక్రీకరించి ప్రభు త్వంపై బురద జల్లడం వైసిపికి అలవాటై పోయిందన్నారు. మత్స్య కారుల సంక్షేమంపై అసత్యాలు ప్రచారం చేసి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్న వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గత ఐదేళ్లలో వారికి కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిన వారు ఇప్పుడు మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అర్హత కలిగిన ప్రతి మత్స్య కారుడికి కూడా అన్యాయం జరగకుండా పూర్తి పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. 2019లో వేట నిషేధ భృతిని రూ.10వేలకు పెంచాం ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.20లకు పెంచి మత్స్యకార కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. అబద్ధాలు, అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే రోజులు పోయాయని గణాంకాలు పారదర్శకత ప్రత్యేక లబ్ధితో కూటమి ప్రభుత్వం మత్స్యకారుల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకువస్తోందన్నారు. ఎవరైనా విషప్రచారం చేస్తే ప్రజల ముందే అసలు నిజాలు బయటపెడుతామని ఆయన హెచ్చరించారు.

# సంక్షేమ ప్రదాత సిఎం చంద్రబాబు: కావలి ఎమ్మెల్యే దగుమాటి



**కావలి (నెల్లూరు), మే 19, ప్రభాతవార్త:** సంక్షేమ ప్రధాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన నాయకత్వంలో కావలి నియోజకవర్గం అతివేగంగా అభివృద్ధి చెందుతున్నదని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా కావలి రూరల్ మండలం తుమ్మలపెంట గ్రామంలో మత్స్యకారులకు భరోసా కల్పించేందుకు మత్స్యకార సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో నెలకొన్న రాక్షసపాలనకు ముగింపు పలికి, ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి సిఎం చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షమందికి పైగా మత్స్యకార సేవ ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం అభినందనీయమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రామాయపట్నం పోర్ట్, బీపీసిఎల్ రిఫైనరీ, దగదర్తి ఎయిర్‌పోర్ట్, ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు, ఇఫ్కో కిసాన్ సెజ్ వంటి భారీ ప్రాజెక్టులు కావలి పరిసర ప్రాంతాల రూపురేఖలను పూర్తిగా మార్చనున్నాయని తెలిపారు. బిపిసిఎల్ రిఫైనరీ రావడం వల్ల కావలి ప్రాంతం జాతీయ స్థాయి పారిశ్రామిక మ్యాప్‌లో ప్రత్యేక స్థానం సంపాదించుకుటుందన్నారు. కావలి నియోజకవర్గంలోని 24మత్స్యకార గ్రామాల మత్స్యకారులు తమ గ్రామం నుంచి నేరుగా సముద్రంలోకి వెళ్ళేందుకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మట్టిరోడ్లు నిర్మించాలని, ఇందుకు రూ.6.19కోట్లు అవసరమవుతాయని మంజూరు చేయాలని సిఎంకు విన్నవించారు. తీర ప్రాంతంలో రూ.6.20కోట్లతో బకింగ్‌హోమ్ కెనాల్ పూడిక తీసి అభివృద్ధి చేస్తే మత్స్యకారులు, రైతులు, స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలాగే కొండేటి డ్రైయిన్‌ను రీషెడ్యూల్ చేసి సమగ్ర అభివృద్ధి చేయాలని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళారు. విజ్ఞప్తులపై సిఎం సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేశారు.



## కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో ఎయిమ్స్ డైరక్టర్ భేటీ

**శ్రీకాకుళం, మే 19 ప్రభాతవార్త:** ఎయిమ్స్ డైరక్టర్, నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ ఎం.శ్రీనివాస్ మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో భేటీ అయ్యారు. ఇద్దరి మధ్య శ్రీకాకుళం జిల్లాలో ఆరోగ్య సమస్యలు, పరిష్కార మార్గాల గురించి చర్చ నడిచింది. ప్రధానంగా ఉద్దానం కిడ్నీ సమస్యపై అందుబాటులో ఉన్న సాంకేతిక ఆధారాలు, నూతన పరిష్కారాలపై విస్తృతంగా చర్చించారు. కూటమి సర్కారు అందిస్తున్న తోడ్పాటు, పలాస కిడ్నీ ఆసుపత్రిలో ఇటీవల ప్రారంభించిన అధునాతన సేవలను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలియపరిచారు. ప్రజారోగ్య సంరక్షణ కోసం కలసి పని చేయాలని ఒక నిర్ణయానికి వచ్చారు. త్వరలోనే క్షేత్ర స్థాయిలో పర్యటన జరపాలని, మరిన్ని సూచనలు చెయ్యాలని ఎయిమ్స్ డైరక్టర్ శ్రీనివాస్‌ను కేంద్ర మంత్రి కోరారు.

## మహానాడులో 20 తీర్మానాలు

### తెలంగాణ నుంచి 4 ప్రత్యేక ప్రతిపాదనలు

### తీర్మానాల కమిటీ సమావేశంలో నిర్ణయం

**విజయవాడ, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రెండేళ్ళ టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజల్లో తీసుకుని వెళ్ళాలని మహానాడు తీర్మానాల కమిటీ నిర్ణయించింది. తెలుగుదేశం పార్టీ రెండు రోజుల మహానాడులో దాదాపు 20 తీర్మానాలు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మహానాడు తీర్మానాల కమిటీ సమావేశం అయ్యింది. యనమల రామకృష్ణుడు నేతృత్వంలో 17సభ్యులతో కూడిన తీర్మానాల కమిటీ భేటీ అయ్యింది. ఉమ్మడి తీర్మానాలుగా ఎన్టీఆర్ జన్మదినం, పార్టీ సంస్థాగత, యువతకు ప్రోత్సాహం వంటి అంశాలపై చర్చించారు. సూపర్ సిక్స్ పథకాల అమలు, కేంద్ర మద్దతు, పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో తాజా పరిస్థితులు, ఆర్థిక భారం, ప్రతిపక్ష విధ్వంస విధానాలు, అభివృద్ధికి అడ్డుపడుతున్న తీరు వంటి తీర్మానాలపై మహానాడులో చర్చించాలని నిర్ణయించారు. చివరిగా రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. తెలంగాణ నుంచి నాలుగు తీర్మానాలు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. కమిటీ రేపు మరోసారి భేటీకానుంది. ఎల్లుండి జరిగే పొలిట్ బ్యూరో సమావేశం లోపు అధిష్టానానికి ఖరారు చేసిన తీర్మానం అంశాలను కమిటీ అందచేయనుంది.



# తిరుమలేశా ఎవరిది నిజం! ఎవరిదో అబద్ధం!!

- యథేచ్ఛగా ఆరోపణలతో మండిపడుతున్న భక్తజనం

**తిరుమల, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ పుణ్యక్షేత్రం తిరుమలను కేంద్రంగా చేసుకుని అటు వైసిపి నేతలు ఇటు కూటమి పార్టీల నేతలు పరస్పరం గుప్పిస్తున్న ఆరోపణలు, విమర్శల్లో ఎంతవరకు ఎవరిదీ నిజం ఉందని, ఎవరిదో అబద్ధమనేది భక్తులు మండిపడుతున్నారు. మరీ పనిగట్టుకుని గత ఏడాది కాలంగా తిరుమల తిరుపతి దేవస్థానంపై, బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడుపై వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఎంతవరకు వాస్తవాలు ఉన్నాయనేది మాత్రం వెల్లడి కావడం లేదు. అదే సమయంలో గత వైసిపి బోర్డు పెద్దల నిర్వాకంపై కొందరు కూటమి పార్టీల నేతలు గుప్పిస్తున్న విమర్శల్లో వాస్తవాలు ఏమనేది తెల్చుకోలేక అయోమయంలో అటు టిటిడి ఉద్యోగులు ఇటు భక్తులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే 2019-24 మధ్యకాలంలో సుమారు రూ.300 కోట్ల మేరకు ఆర్థిక లావాదేవీలతో కల్తీనెయ్యి సరఫరా జరిగిందనేది సిబిఐ సిట్, ఏకసభ్య కమిటీ తేల్చేసిన ఆధారాలు. మరీ ఈ ఆధారాలతో కల్తీనెయ్యి టెండర్లు నిబంధ నలు సడలించడం, ఆ తరువాత తక్కువ ధరకే నెయ్యి కొనుగోలు చేయడం వెనుక సూత్రధారులెవరనేది దాదాపు తేల్చేసినా బయటకు వెల్లడించకపోవడంలో ఆంతర్య మేమి టనేది అంతుచిక్కని రహస్యమే. ఈ తతంగంలో కర్త, కర్మ, క్రియ లెవరనేది తేల్చడానికి తాజాగా త్రిసభ్య కమిటీని ప్రభు త్వం నియమించింది. ఈ కమిటీ నేటికీ తిరుమలకు చేరుకో లేదు. కల్తీనెయ్యి బాగోతంలో రచ్చ సాగుతున్నా మరోవైపు గతంలోనే తులాభారం కానుకల లెక్కల్లో కూడా అక్రమాలకు పాల్పడి భారీ మొత్తంలో నిధులు స్వాహా చేశారనేది గుప్పు మన్న ఆరోపణలు. ఇందుకు సంబంధించి ఏకంగా టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. టిటిడి విజిలెన్స్ అధికారులకు ఆధారాల కాగితాలు అందించారనేది సమాచా రం. మరీ తులాభారం లెక్కల్లో ఎంతమేరకు అక్ర మాలు జరిగాయనేది తేల్చలేకపోతున్నారు. ఇక దేశవ్యాప్తంగా హిందూ సనాతన ధర్మాన్ని మరింతగా వ్యాప్తి చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానమ్ నిర్వహిస్తున్న శ్రీవాణి ట్రస్ట్‌పై కూటమి ప్రభుత్వం తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసింది. అయితే ఆ ట్రస్ట్‌ను రద్దుచేస్తామని ప్రకటించినా ఇప్పటివరకు కనీసం తీసుకున్న చర్యలు కూడా శూన్యమే. ఈ ట్రస్ట్ ద్వారా దాతలు విరాళాల రూపంలో ఇస్తున్న నగదుతో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార ప్రాంతాలు, వెనుకబడిన కాలనీల్లో ఆలయాల నిర్మాణం, పురాతన ఆలయాల మరమ్మతులు, ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ఈ నిధులు ఖర్చు చేయాలనేది ప్రధాన ఉద్దేశ్యంగా అమలుచేశారు. గత వైసిపి బోర్డు కాలంలోనే దాదాపు రూ.1,800 కోట్లకు పైగా ఆదాయం చేకూరింది. ఆ నిధులను పక్కదారి పట్టించి గత ప్రభుత్వానికి మళ్ళించారనే దుమారం రేగింది. 2018 ఆగస్టులో శ్రీవాణి ట్రస్ట్‌ను ప్రారంభించాలని అప్పటి టిటిడి ధర్మకర్తల మండలి శ్రీకారం చుట్టినా 2019 మే నెలలో ప్రభుత్వం మారడంతో తదుపరి రాష్ట్రంలో ఏర్పాటైన వైసిపి ప్రభుత్వం శ్రీవాణి ట్రస్ట్‌ను 2019 అక్టోబర్‌లో పూర్తిస్థాయిలో అమలుచేశారు. ఈ ట్రస్ట్ క్రింద రూ.10 వేలు విరాళంగా, రూ.500లు విఐపి బ్రేక్ దర్శనం టిక్కెట్ క్రింద నగదు వసూలు చేస్తున్నారు. 2019 అక్టోబర్‌లో ప్రారంభమైన శ్రీవాణి ట్రస్ట్‌కు తొలి ఏడాదిలో రూ.26.25 కోట్లు ఆదాయం చేకూరింది. 2020కి రూ.70.21 కోట్లు, 2021లో రూ.176 కోట్లు, 2022లో రూ.282.64 కోట్లు, 2023లో వెయ్యి కోట్ల రూపాయలు విరాళాలందాయి. 2024లో వెయ్యి కోట్ల రూపాయల వరకు ఆదాయం చేకూరిందనేది టిటిడి వర్గాల సమాచారం. ఈ నిధులతో తెలుగు రాష్ట్రాల్లోనేగాక దేశవ్యాప్తంగా సమరస సేవా ఫౌండేషన్ సహకారంతో 2,273నూతన ఆలయాలు నిర్మాణానికి నిధులు కేటాయించారు. 176 పురాతన ఆలయాలు పునరుద్ధరణ చేపట్టారు. 150 ఆలయాలకు నెలకు రూ.5 వేలు లెక్కన దూపదీప నైవేద్యాలకు నిధులు కేటాయిస్తున్నారు. ఇప్పుడు ఈ మొత్తాన్ని రూ.10వేలకు పెంపుదలచేస్తూ ఇటీవల టిటిడి బోర్డు నిర్ణయించింది. ఇప్పుడు ఏకంగా శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించుకుంటున్నారనే ప్రధాన ఆరోపణలు గత టిటిడి ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి చేయడం సంచలనంగా మారింది. అంతేగాక సేవా టిక్కెట్లను దళారులకు అమ్ముకుంటున్నారనేది మరో సంచలనంగా మారిన ఆరోపణలు. ఇవన్నీ ఎంతవరకు వాస్తవమనేది శ్రీవారి భక్తులకు టిటిడి బోర్డు పెద్దలు గానీ, టిటిడి అధికారులు గానీ వెల్లడించాల్సిన అవసరం ఉంది.

# తిరుమల సమాచారం



## స్వామివారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి

**తిరుమల, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరచుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, సంతోషంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు కర్ణాటక డి.సిఎం శివకుమార్ తెలిపారు. కర్ణాటక ప్రజలకు స్వామివారి ఆశీస్సులుండాలని ప్రార్థించారు. మంగళవారం ఉదయం కుటుంబంతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. నైవేద్య విరామ సమయంలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కర్ణాటక రాజకీయాలు, కల్యాణ మండపం వివరాలు అడిగినా రాజకీయాలు మాట్లాడబోనని తెలిపారు.

## తిరుమలలో జోరువాన

**తిరుమల, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుండి వాతావరణంలో మార్పుతో మధ్యాహ్నం చల్లటిగాలులు వీచి జోరువాన అతలాకుతలం చేసింది. కురిసిన వానకు ఆలయం పరిసరాలు, ఘాట్‌రోడ్లు జలమయంగా మారాయి. బలమైన చలిగాలులు వీస్తున్నాయి. ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు వానలో తడుస్తూనే గదులకు చేరుకోవాల్సి వచ్చింది. చిన్నపిల్లలు, వృద్ధులు గదుల నుండి బయటకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

## రేపటి నుండి టిటిడిలో వస్త్రాల ఇ-వేలం

**తిరుమల, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు హుండీలో సమర్పించిన వస్త్రాలతోబాటు టిటిడి అనుబంధ ఆలయా లలో భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలను 21నుండి జూన్ 2వరకు ఇ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈ వేలంలో కొత్తవి, ఉపయో గించినవి, పాక్షి కంగా దెబ్బతిన్నవి కలిపి మొత్తం 505 లాట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో పాలిస్టర్, నైలాన్, కాటన్ చీరలు, క్లాత్ బిట్స్, బ్లౌజ్ పీస్‌లు, ఉత్తరీయాలు, టర్కీ టవళ్లు, లుంగీలు, శాలువాలు, బెడ్‌షీట్లు, దిండు కవర్లు, పంజాబీ డ్రెస్ మెటీరియల్స్, జంకాళం కార్పెట్లు, దుప్పట్లు, కర్టన్లు, పరదాలు, శిరోవస్త్రాలు, గొడుగులు, హుండీ గల్లేబులు. ఈర్వాడాలు ఉన్నాయి. ఇతర వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయాన్ని గానీ, 0877-2264429 నంబరులో సంప్రదించవచ్చు.



నారాయణగిరి ఉద్యానవనాలు దాటిన వెలుపల క్యూలైన్

# ఏడుకొండలస్వామీ.. నీ దరికి ఎన్ని క్యూలో..!

### తప్పని కిలోమీటర్లు దూరం అవస్థలు

**తిరుమల, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండలస్వామీ... ఎక్కడున్నావయ్యా... ఎన్నిమెట్లెక్కినా కానరావేమయ్యా అనేలా తిరుమలకు వస్తున్న సామాన్యభక్తులకు చాంతాండంత క్యూలైన్ల కష్టాలు తప్పడంలేదు. వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లు నిండితే ఎక్కడ నుండి భక్తులను వెలుపల క్యూలైన్లలో అనుమతిస్తారనేది ఇప్పటికీ కూడా సామాన్యభక్తులకు అయోమయమే. తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడు సంతోషంగా స్వామివారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమవ్వాలని అటు సిఎం చంద్రబాబు నాయుడు ఇటు టిటిడి బోర్డు పెద్దలు అనుకుంటున్నా ఆచరణలో మాత్రం అమలు చేయడంలో విఫలమవుతున్నారు. సాధారణ రోజుల్లోనే 50వేల మంది భక్తులు దాటితే ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారిపోతుంది. అసలే వేసవి సెలవులు.. ఆపై దేశవ్యాప్తంగా పరీక్షలు రాసి ఫలితాలు వచ్చిన యువతీయువకులు మొక్కులు చెల్లించుకునేందుకు తిరుమలకు వస్తున్నారు. రోజుకు 90వేల మంది నుండి లక్షమంది వరకు భక్తులు తరలి వస్తున్నారు. వారాంతం రోజులు శుక్ర, శని, ఆదివారాల్లోనేగాక సాధారణ రోజుల్లోనూ భక్తుల క్యూలైన్లను తిరుమలలో బాటగంగమ్మ ఆలయానికి సమీపం వరకు వ్యాపింపజేశారు. ఇష్టదైవమ్ క్షణకాల దర్శనం కోసం దేశం నలుమూలల నుండి భక్తులు తరలివస్తున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తే ఆలయం వెలుపల కిలోమీటర్లు దూరం క్యూలైన్లు బారులు తీరి భక్తులు గంటల తరబడి నిరీక్షిస్తుండటం పరిపాటిగా మారింది. ఈ విధానం మార్చాలని భక్తులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నా టిటిడి పెద్దల నుండి, అధికారుల్లో ఆలోచన మాత్రం రావడంలేదు. ఎంతమందికి దర్శనాలు చేయించామనే గణాంకాలు తప్ప ఎంత త్వరగా క్యూలైన్లలో అనుమతించి, ఎంత దగ్గరగా అనుమతించామనేది మాత్రం మచ్చుకైనా అధికారుల్లో ఆలోచన లేకపోవడం విచారకరం. ఆలయానికి చేరుకునే క్యూలైన్లు చేరువచేయాలని పదేళ్ళ క్రిందటే కార్యాచరణ సిద్ధం చేశారు. అందుకు తగ్గట్లు క్యూలైన్లు, కాంప్లెక్స్‌లు నిర్మించారు. అయితే ఇప్పటికీ ఆ విధానం అమలుకావడం లేదు. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం రోజువారీగా సాధారణ రోజుల్లోనే లక్షమంది వరకు భక్తులు కొండపైకి వస్తే వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62 కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కో కంపార్టుమెంట్‌లో 400మంది లెక్కన 25వేల మంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఆ తరువాత వచ్చిన సామాన్యభక్తులు ఏటిసి, నారాయణగిరి ఉద్యానవనాల వరకు విస్తరించిన క్యూలైన్లలో నుండి ఆలయంలోనికి చేరుకోవాల్సి ఉంది. 60వేల మంది భక్తులు దాటితే ఇక క్యూలైన్లు చాంతాండంత దూరం వ్యాపిస్తాయి. ఇక్కడ ఎండకు, వానకు సామాన్య భక్తుల కష్టాలు వర్ణనాతీతం. సర్వదర్శనానికి రద్దీరోజుల్లో, వారాంతం రోజుల్లో ఏకంగా 20నుండి 25గంటలు నిరీక్షించాల్సిన పరిస్థితులు ఉండటం విశేషం. సుదూర ప్రాంతాల నుండి తిరుమలకు వచ్చిన భక్తులకు క్యూలైన్లలోనే దేవుడు కనిపిస్తుంటాడు. ఈ విధానంలో మార్పు తీసుకు వచ్చి సామాన్య భక్తులకు క్యూలైన్లు చేరువచేయడం ప్రస్తుతం టిటిడి అధికారుల ముందు ఉన్న తక్షణ కర్తవ్యం. సామాన్య భక్తులకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్‌ను వినియోగించుకుంటే కొంతవరకు నిరీక్షణ కష్టాలు తప్పుతాయి. వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ కూడా నిర్మాణం చేయాలనే ఆలోచన ప్రతిపాదనలకే పరిమితమైపోయింది. అసలే వేసవి సెలవులు... ఆపై దేశంలోని అన్ని ప్రాంతాల నుండి ఏడుకొండల స్వామి దర్శనానికి తరలివస్తున్నారు. వైకుంఠమ్ కంపార్టుమెంట్లు నిండితే సామాన్యభక్తులు ఎక్కడ నుండి క్యూలైన్లు ఉంటాయనేది అర్థంకాని ప్రశ్నగా మారింది. ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్లు లేని భక్తులు నేరుగా తిరుమలకు వస్తే గతంలో వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్‌వద్ద క్యూలైన్లలో నుండి భక్తులు ఆలయంలోనికి చేరుకునే విధానం ఉండేది. ఇప్పుడు సామాన్యభక్తులు ఈ దరిదాపుల్లోకి కూడా అనుమతించడం లేదు. కొండపై కిలోమీటర్లు బారులు తీరిన క్యూలైన్లు సామాన్య భక్తుల ఓపికను పరీక్షించేలా టిటిడి అధికారులు వ్యవహరిస్తున్నారు.



**వెంకన్న సర్వదర్శనానికి 18గంటలు:** శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం లక్షల మంది భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిటలాడుతోంది. వేసవిసెలవులు కలసి రావడంతో మంగళవారం ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. వైకుంఠం-1, 2 క్యూకాంప్లెక్స్‌లు నిండి పోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు చేరాయి. సాధారణ సర్వదర్శనం కోసం 18గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో ఆరేడు గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. వేసవి సెలవులు.. ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం వరకు 42వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 25వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. ఈ రద్దీ జూన్ 20 వరకు కొనసాగే అవకాశం ఉంది.



## తామరపూలతో తాతయ్యగుంట గంగమ్మ దర్శనం

**తిరుపతి, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి గ్రామ దేవతగా పూజలందు కుంటున్న తాతయ్యగుంట గంగమ్మ జాతర తరువాత తొలి మంగళవారం బంగారు వజ్ర కిరీటం, తామర పుష్పాలతో ప్రత్యేక అలంకరణలో దర్శనమి చ్చారు. ఆలయం మొత్తం తామర పువ్వులతో సర్వాంగసుందరంగా అలంక రించి భక్తులకు దర్శనం చేయించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశా రు. రానున్న నాలుగు మంగళవారాలు గంగమ్మ పలురకాలుగా దర్శనమివ్వ నున్నారు. అమ్మవారిని చిన్నారులు, పెద్దలు గంగమ్మను దర్శించుకున్నారు.

## వైభవంగా మరు పొంగళ్ళు



**తిరుపతి, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నగర ప్రజల ఆరాధ్య దైవమైన తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో నిర్వహించిన గంగమ్మ జాతర అనంతరం మరు పొంగళ్ళు కార్యక్రమం భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగింది. జాతర అనంతరం ఐదు మంగళవారాల పాటు మరుపొంగళ్ళు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతున్న నేపథ్యంలో తొలి మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ పురాణ పురుషుల వేషధారణలతో భక్తి పరవశంగా ఊరేగింపులో పాల్గొన్నారు. నేరేళ్లమ్మ ఆలయం నుండి ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక ప్రదర్శన గంగమ్మ ఆలయం వరకు సాగి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ పాలకమండలి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

## అమ్మవారిని దర్శించుకున్న మంత్రి అనగాని



**తిరుమల, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గత వారంరోజులు తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర ఉత్సవాలకు హాజరు కావాల్సి ఉండేదని రాలేక పోవడం వల్ల మంగళవారం తోలివారం అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ మహేష్ యాదవ్ నేతృత్వంలో ఆలయం అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతోందని, ఇంకా అభివృద్ధికి కావలసిన పూర్తి సహాయ సహకారాలను ప్రభుత్వం నుండి అందజేస్తామన్నారు. అమ్మవారి జాతర ఉత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో అంగరంగ వైభవంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బాగా నిర్వహించడం జరిగిందని అభినందించారు. మంగళవారం ఉదయం తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంవద్దకు విచ్చేసిన మంత్రి అనగానికి ఆలయ ఛైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, పాలకమండలి సభ్యులు, ఆలయ ఇఒ ఎ.జయకుమార్ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకుని అమ్మవారి ప్రత్యేక అలంకరణలో మంత్రి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. మంత్రి అనగానితో తిరుపతి పార్లమెంటు జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్షి ్మ, తుడా ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహా యాదవ్, రాష్ట్రమీడియా కోఆర్టినేటర్ బి.శ్రీధర్‌వర్మ ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యప్రసాద్‌కు గంగమ్మ తల్లి చిత్రపటాన్ని బహుకరించారు.

## 30న నాగలాపురంలో వేద నారాయణస్వామి దివ్య కంచి గరుడసేవ

**తిరుమల, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న చిత్తూరు జిల్లా నాగలాపురంలోని వేద నారాయణ స్వామి కంచి గరుడసేవ ఈనెల 29న నాగలాపురం ఆలయంలో వైభవంగా జరగనుంది. భక్తుల ను భక్తి పారవశ్యంలో ముంచెత్తే ఈ వైదిక కార్యక్రమం భక్తితో సాగనుంది. కంచిలోని వరదరాజ స్వామి ఆలయంలో నిర్వహించే మహా గరుడసేవను పురస్కరించుకొని నాగలాపురంలోని వేద నారాయణ స్వామి ఆలయంలో ఈ గరుడసేవను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

ఈ సందర్భంగా 29న ఉదయం ఉదయం 6.30 గంటల నుండి 8.30 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన వేద నారాయణ స్వామి గరుడ వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో దివ్య విహారం చేస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామివారి దివ్య మంగళ విహారాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని వేద నారాయణ స్వామి ఆలయ అధికారులు కోరారు.

## ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ఆస్పత్రులకు రూ.919.13 కోట్లు

**విజయవాడ, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ఆస్పత్రులకు రూ.919.13 కోట్లను ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటన విడుదల చేశారు. బకాయిల చెల్లింపుల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. ట్రైపార్టీ బిల్ డిస్కౌంటింగ్ విధానంలో నిధుల విడుదల చేసినట్లు వివరించారు. 785 ప్రైవేట్ ఆస్పత్రులు బిల్ డిస్కౌంటింగ్‌కు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఆస్పత్రుల ఖాతాలకు ఇప్పటికే రూ.919.13 కోట్ల జమ చేశామని వెల్లడించారు. ఈ మేరకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈఓ చక్రధరబాబు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదిక అందజేశారు. ఆస్పత్రుల విజ్ఞప్తి మేరకు వేగంగా బకాయిలు చెల్లింపులు చేశామని అన్నారు. ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేశారని తెలిపారు. ట్రస్టు ఆస్పత్రులు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ మధ్య ఒప్పందాలు జరిగాయని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ ఆస్పత్రులకు మొత్తం రూ.5,556 కోట్ల చెల్లించా మని తెలిపారు. అదనంగా మరో రూ.919.13 కోట్ల విడుదల చేశామని అన్నారు. ఆరోగ్య సేవల బలోపేతానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.




# కూటమి ప్రభుత్వంలోనే దళితులకు న్యాయం

## • టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి

**తిరుపతి హెల్త్, మే 19 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంలోనే దళితులకు న్యాయం జరిగిందని మాజీ కేంద్రమంత్రి, టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి మండిపడ్డారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత వైసిపి పాలనలో దళితులపై 56వేల దాడులు, 250కి పైగా హత్యలు జరిగాయని అన్నారు. ఒక ఎమ్మెల్సీ తన కారు డ్రైవర్ దళితుడైన సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేయడం నుండి డాక్టర్ సుధాకర్ మరణం వరకు ఎన్నో ఆకృత్యాలు వైసిపి ప్రభుత్వం లో జరిగాయని ధ్వజమెత్తారు. ఎస్సీలకు చెందిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేయడం, ఎస్సీ కార్పొరేషన్ నిధులను వేరే వాటికి బదిలీ చేసి ఎస్సీల కడుపు కొట్టిన ఘనత కూడా జగన్ దే అన్నారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చ లేదన్నారు. అదే 2024 ఎన్నికల్లో కూటమి తరపున ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో 80శాతం నెరవేర్చారన్నారు. ఈరోజు మత్స్యకారులకు ఇచ్చిన మాట ప్రకారం లక్ష మందికి 20వేలు చొప్పున ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయం అన్నారు. తిరుపతిలో ఉన్న మాజీ టీటీడీ చైర్మన్ గత రెండేళ్లుగా పని పాట లేకుండా తిరుమలపై ఆరోపణలు చేయడమే పెట్టుకున్నారని దుయ్యబట్టారు. తిరుమలలో అన్ని రంగాలలో అవినీతి ఏదైనా జరిగిందంటే అది వైసీపీ పాలనలో నేనని, దానికి కర్త, కర్మ, క్రియ భూమన కరుణాకర్ రెడ్డి అని ఆరోపించారు. శ్రీ వాణి టికెట్లలో అవినీతి జరిగిందని ఆయన చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టీటీడీ పారదర్శకంగా ఆన్లైన్ లో టికెట్లు కేటాయిస్తే భక్తులు బుక్ చేసుకోవడం జరుగుతోందన్నారు. అవతల వారిపై ఒక వేలు చూపిస్తే మన వైపు 3 వేళ్ళు చూపిస్తాయి అనే నగ్న సత్యాన్ని భూమన కరుణాకర్‌రెడ్డి గుర్తు ఎరగాలని హితవు పలికారు. అనంతరం యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ గత ఐదేళ్ల పాలనలో అతను అన్ని వర్గాలను మోసం చేశాడని మండిపడ్డారు. కూటమి పాలనలోని టీటీడీ పాలకమండలి పారదర్శకంగా ఉంటూ తిరుమలను అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. శ్రీవాణి ట్రస్ట్ టికెట్ల రూపంలో వస్తున్న ఆదాయం మొత్తం దేశవ్యాప్తంగా 5వేల ఆలయాలను నిర్మించడానికి శ్రీకారం చుట్టిందన్నారు. నేడు ఓటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ లకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడమే కాకుండా వారి అభివృద్ధి, సంక్షేమం కోసం వేలకోట్లను కేటాయించడం జరిగిందన్నారు. ముఖ్యంగా తిరుపతి జిల్లా పార్లమెంట్ అధ్యక్షురాలిగా దళితురాలైన పనబాక లక్ష్మికి ఇవ్వడమే ఇందుకు నిదర్శనం అన్నారు. అదేవిధంగా పార్లమెంట్ కమిటీలో కానీ, రాష్ట్ర స్థాయి కమిటీలో కానీ, జాతీయస్థాయి కమిటీలో గాని ఎస్సీలకు అన్నగారిన వర్గాలకు సముచితకు స్థానం కల్పించిన పార్టీ ఏదైనా ఉందంటే అది టిడిపి అన్నారు. ఆఖరుగా ఆయన మాట్లాడుతూ ఇదేవిధంగా రాబోవు రోజుల్లో సైతం రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని వర్గాల వారికి సముచిత గౌరవం కల్పిస్తూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

# బాలుపల్లి వద్ద రెండు వాహనాలు ఢీ

## • మంటలో కాలిపోయిన వాహనాలు... తప్పిన ప్రాణాపాయం



**రైల్వేకోడూరు రూరల్, మే 19 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వేకోడూరు మండలంలోని బాలుపల్లె అటవీశాఖ తనిఖీ కేంద్రం వద్ద మంగళవారం ఉదయం రెండు వాహనాలు ఢీకొని పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. చెక్‌పోస్ట్ వద్ద వద్ద ఉదయం తిరుపతి వైపు నుంచి కడప వైపు వెళుతున్న కారు మరమ్మతులతో ఆగిపోయిన లోడు లారీ వెనుక భాగంలో ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొద్ది గంటల సమయంలో ప్రమాదం జరిగిన ప్రదేశానికి మరొక కారు వచ్చి ఇంజన్లో పొగలు రావడంతో ప్రమాదానికి గురైన కారు పక్కనే ఆపివేయడంతో కొద్దిసేపటికి ఆ కారులో మంటలు చెలరేగి లారీని ఢీకొన్న కారుకు మంటలు వ్యాపించి రెండు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. లారీ వెనుక టైర్లు కూడా కాలడంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే రెండు కార్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇప్పటివరకు కారులో ప్రయాణిస్తున్న వారి వివరాలు, గాయపడిన వారి పేర్లు తెలియాల్సి ఉందని అగ్నిమాపక అధికారి విజయ్ కుమార్ అన్నారు. బాలుపల్లె చెక్ పోస్ట్ వద్ద జరిగిన భారీ అగ్ని ప్రమాదంతో వాహనాల రాకపోకలు స్తంభించి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# సినిమా అవకాశాల పేరుతో యువతిపై అత్యాచారం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 19, ప్రభాతవార్త:** సినిమా షూటింగ్ ఆశ చూపి యువతిపై ఇద్దరు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకా రం.. జూబ్లీహిల్స్ మెట్రోస్టేషన్ సమీపంలో ఇద్దరు అనాథ యువతులు నివసిస్తూ సినిమా షూటింగ్‌లో చేస్తున్నారు. కాగా ఈ నెల 13న మెట్రో స్టేషన్ వద్ద ఉన్న యువతికి సినిమా షూటింగ్‌లో అవకాశం కల్పిస్తా నంటూ ఒక యువకుడు సికిందరాబాద్‌లోని తన గదికి తీసుకెళ్లాడు. అక్కడ స్నేహి తుడితో కలిసి రెండు రోజులపాటు లైంగిక దాడికి పాల్ప డ్డారు. అనంతరం ఆమెను ఉబెర్ వాహనం బుక్‌చేసి పంపాడు. కాగా స్నేహితురాలి వద్దకు వెళ్లిన యువతి ఒంటిపై గాయాలు ఉండటంతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తీసుకెళ్లింది. అక్కడ వైద్యులు ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# నార్డిక్ కూటమితో భారత్ బంధం మరింత పటిష్టం

## నార్వేలో ప్రధాని మోడీ భారత్ వైఖరి స్పష్టీకరణ



**ఓస్లో, మే 19:** భారత్ నార్వే సంబంధాలు అనేక అవకాశాలతో నిండి ఉన్నాయని ప్రపంచ శాంతిని రెండు దేశాలు కాంక్షిస్తున్నామని ప్రధాని మోడీ అన్నారు. నార్వే పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ మాట్లాడుతూ భారతదేశంతో సంబంధాలు, వాణిజ్యం, ఆవిష్కరణల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఉగ్రవాదం విషయంలో తాను రాజీపడబోనని మోడీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన, బహుపాక్షికవాదం పట్ల మన పరస్పర నిబద్ధత మనల్ని సహజ భాగస్వాములుగా చేస్తుందన్నారు. అదే సమయం లో సాంకేతికత, సుస్థిర అభివృద్ధి విభిన్న రంగాల్లో మన ఉమ్మడి ప్రాధాన్యతలు కలిసి పని చేయడానికి అపారమైన అవకాశాలను అందిస్తున్నాయని గుర్తుచేసారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నార్డిక్ దేశాలతో మన సంబంధాలను వేగవంతం చేయడానికి, బలోపేతం చేయడానికి ఎనిమిది సంవత్సరాల క్రితం ఈ ఫార్మాట్‌ను రూపొందించామని అన్నారు. కొన్నేళ్లుగా రెండు దేశాలేకాకుండా నార్డిక్ దేశాల సంబంధాల్లో గణనీయమైన పురోగతి సాధించామని, పదేళ్లలో మన ద్వైపాక్షిక వాణిజ్యం దాదాపు నాలుగు రెట్లు పెరిగిందన్నారు. భారతదేశ వేగవంతమైన వృద్ధిలో నార్డిక్ దేశాల పెట్టుబడి నిధులు కూడా ముఖ్యమైన భాగస్వాములుగా మారుతున్నాయని, గడచిన దశాబ్దంలో భారతదేశంలోకి నార్డిక్ దేశాల పెట్టుబడులు దాదాపు 200 శాతం పెరిగాయని మోడీ తెలిపారు. నార్వే, ఐస్‌లాండ్, ఇతర ఈఎఫ్‌టీఏ దేశాలతో కలిసి అక్టోబర్ 2025 నుంచి వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని అమలు చేశాం. అంతేకాక కొన్ని నెలల క్రితమే భారత్‌యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పం దంపై సంతకం చేశాం. ఇందులో డెన్మార్క్, ఫిన్లాండ్, స్వీడన్ కూడా భాగస్వా ములుగా ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక వాణిజ్య ఒప్పందాలతో, భారత్‌నార్డిక్ దేశాల మధ్య సంబంధాలలో ఒక కొత్త స్వర్ణయుగాన్ని ప్రారంభించ బోతున్నా మని చెప్పుకొచ్చారు. ప్రపంచ ఉద్రిక్తత లు, సంఘర్షణలు నెలకొన్న ఈ యుగంలో భారతదేశంనార్డిక్ దేశాలు నియమాల ఆధారిత ప్రపంచ వ్యవస్థను బలోపేతం చేయడం కొనసాగిస్తాయి. అది ఉక్రెయిన్ అయినా పశ్చిమాసియా అయినా సంఘర్షణలకు త్వరితగతిన ముగింపు పలికి శాంతిని నెలకొల్పే ప్రయత్నాలకు మేము మద్దతు ఇవ్వడం నిరంతరం కొనసాగిస్తాం. బహుళపక్ష సంస్థల సంస్కరణలు అవసరమని, అత్యవసరమని మేము అంగీకరిస్తున్నాము. ఉగ్రవాదం విషయంలో కూడా మాకు స్పష్టమైన, స్థిరమైన వైఖరి ఉంది. రాజీ లేదు. ద్వంద్వ ప్రమాణాలు లేవు. ఈ రోజు నేను సంబంద్ అనే పదాన్ని చాలాసార్లు ఉపయోగించాను. అనేక నార్డిక్ భాషలలో సంబంద్ అనే పదానికి అనుబంధం, సంబంధం, బంధం అని అర్థం. హిందీలో కూడా సంబంధ్‌కు అదే అర్థం ఉంది. ఇది కేవలం పదాల సారూప్యత మాత్రమే కాదు. ఇది మన ఆలోచనల సాన్నిహిత్యాన్ని ప్రతిబింబిస్తుందని మోడీ పేర్కొన్నారు.

# జాతీయ రహదారుల లీజు.. రూ.35వేల కోట్ల సమీకరణ లక్ష్యం



## హైవే అథారిటీస్, కేంద్రం కొత్త నిర్ణయం

**న్యూఢిల్లీ, మే 19:** దేశంలో రవాణా వ్యవస్థను ప్రపంచ స్థాయికి చేర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహ దారుల ద్వారా నిధులు సమీకరించి, వాటితో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 28 ప్రధాన హైవేలను ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా రూ.35వేల కోట్లు సమీకరించాలని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రభుత్వ ఆస్తులను విక్రయించకుండా నిర్ణీత కాలానికి ప్రైవేట్ సంస్థలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించి, దాని ద్వారా నిధులు పొందడాన్నే అసెట్ మోనెటైజేషన్ అం టారు. ఈ విధానంలో భాగంగా సుమారు 1,800 కిలో మీటర్ల పొడవైన 28 హైవేలను టోల్ ఆపరేట్‌ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) లేదా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ ఇన్విట్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తారు. ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వానికి ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించి, ఆ రహదారులపై టోల్ వసూలు చేసుకునే హక్కును పొందుతాయి. ఈ నిధులను ప్రభుత్వం కొత్త ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణానికి వినియోగిస్తుంది. ప్రస్తుతం ఎన్‌హెచ్ఏఐ రూపొం దించిన జాబితాలో హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎక్కువ హైవేలు ఉన్నాయి. ఈ మార్గాల్లో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో పెట్టుబడులు పెట్టేందుకు ప్రైవేట్ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారు.

విదేశీ పెన్షన్ ఫండ్‌లు, సావరీన్ వెల్త్ ఫండ్‌లు కూడా భారత రోడ్డు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా నిబంధనలను సరళీకరించడం ఈ ప్రక్రియకు మరింత ఊతమిస్తోంది. నాలుగు రాష్ట్రాల్లోని 260 కిలోమీటర్ల రోడ్ల ద్వారానే ప్రభుత్వం రూ.9వేల కోట్లు సమీకరించడం ఈ రంగంలో ఉన్న సామర్థ్యాన్ని తెలియజేస్తోంది. ఈ భారీ ప్రణాళిక వల్ల సామాన్యులకు రెండు రకాలుగా ప్రయోజనం చేకూర నుంది. ఒకటి, ప్రభుత్వానికి నిధులు అందుబాటులోకి రావడం వల్ల కొత్త రహదారులు వేగంగా పూర్తవుతాయి. ఇది ప్రయాణ సమయాన్ని తగ్గించి, రవాణా ఖర్చులను అదుపులో ఉంచుతుంది. రెండవది, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌ఇన్విట్‌ల ద్వారా సాధారణ ప్రజలు కూడా ఈ హైవే ప్రాజెక్టులలో పెట్టుబడి పెట్టే అవకాశం లభిస్తుంది. స్టాక్ మార్కెట్ ద్వారా ఈ ట్రస్టులలో ఇన్వెస్ట్ చేస్తే, టోల్ ద్వారా వచ్చే ఆదాయంలో డివిడెండ్ రూపంలో వాటా పొందవచ్చు. ఇది సురక్షితమైన పెట్టుబడి మార్గంగా నిలుస్తోంది. ఈ మొత్తం ప్రణాళిక నేషనల్ మోనెటైజేషన్ పైప్‌లైన్ 2.0లో భాగంగా జరుగుతుండగా, దీని కింద ఐదేళ్లకాలంలో రహదారులనుంచే రూ.4.42 లక్షల కోట్లు సమీకరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్లపై కేసు

## గోల్‌మాల్ వెనుక విదేశాల్లోని రవి అనుచరుల పాత్రపై అనుమానాలు?

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అనేక భాషలకు చెందిన కొత్త సినిమాలను రిలీజ్ అయిన గంటల వ్యవధిలోనే ఉచితంగా చూపుతున్న ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్లపై సైబర్‌క్రైం పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. అధునాతన టెక్నాలజీని వాడి, విదేశాల నుంచి ఈ రెండు వెబ్ సైట్లను సైబర్ నేరగాళ్లు నడుపుతున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

గతంలో ఈ రెండు వెబ్‌సైట్లను నిర్వహించిన ఇమంది రవికి తాజా వ్యవ హారంలో సంబంధం లేదని పోలీసులు అంచనాకు వచ్చారు. ఇదే విషయమై రవిని సైబర్ క్రైం పోలీసులు విచారించి ఈ నిర్ణయానికి వచ్చారు. నాలుగు నెలల క్రితం రవిని సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశాక ఈ రెండు వెబ్‌సైట్లు మూతపడడం తెలిసిందే. అయితే వారం రోజులుగా ఈ వెబ్‌సైట్లు మళ్లీ ఇం టర్నెట్‌లో ప్రత్యక్షమవడం, అనేక భాషలకు చెందిన కొత్త సినిమాలు వస్తుండంతో సినీ వర్గాలు ఆందోళనకు గురై దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ఫిలిం ఛాంబర్ తరపున అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్‌క్రైం పోలీసులు కేసు నమోదు చేసి ఈ వెబ్‌సైట్లకు అందుతున్న సర్వర్లు ఎక్కడ వున్నాయని ఆరా తీయగా దీని మూలాలు విదేశాల్లో వుందని తేలింది. గతంలో వీటిని నిర్వహించిన రవి కూడా విదేశాల నుంచే కార్య కలాపాలను సాగించడం విదితమే. తాజా ఘటనలో తన ప్రమేయం లేదని రవి పోలీసులకు చెప్పగా విదేశాల్లో గతంలో ఇతనితో కలిసి ఈ గోల్‌మాల్‌లో పాలు పంచుకున్న నేరగాళ్ల పాత్రపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రవితో కలిసి పనిచేసిన విదేశీయుల వివరాలను సైబర్ క్రైం పోలీసులు సేకరిస్తున్నారు.

# తెలంగాణ హైకోర్టు మహిళా జడ్జిపై అనుచిత పోస్టులు

## విచారణకు జాయింట్ సిపి నేతృత్వంలో సిట్

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్ ఉదంతంలో హైకోర్టు మహిళా న్యాయమూర్తిని ఉద్దేశించి సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు వుంచిన విషయమై పూర్తిస్థాయిలో విచారించేందుకు నగర ఉత్తర జోన్ జాయింట్ సిపి శ్వేత నేతృత్వంలో సిట్ ఏర్పాటయ్యింది. భగీరథ్ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను మహిళా న్యాయమూర్తి ఆధ్వర్యం లోని స్పెషల్ బెంచ్ విచారించడం తెలిసిందే. శుక్రవారం అర్ధరాత్రి వరకు దీనిపై విచారణ జరగగా అంతకు ముందు, ఆ తరువాత సోషల్ మీడియాలో న్యాయమూర్తిని ఉద్దేశించి ఈ పోస్టులు వచ్చాయి. దీనిపై హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు మొదట చార్మినార్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఆ తరువాత దీనిని సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌కు బదలీ చేశారు. ఈ కేసులో ఎపికి చెందిన దామోదర్ అనే వ్యక్తిని అరెస్టు చేసిన సైబర్ క్రైం పోలీసులు విచారిస్తున్నారు. మరో 15 మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ ఏర్పాటు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. కొత్తగా ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అమలు చేయడానికి ప్రత్యేక ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, వారి కుటుంబ సభ్యులు, వారిపై ఆధారపడిన వారికి సంబంధించిన సమగ్ర సమాచా రాన్ని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 31 లోపు తప్పనిసరిగా ఐఎఫ్ఎంఐఎస్-హెచ్‌ఆర్ మాడ్యూల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశిస్తూ ఆర్థిక మంగళవారం మెమో జారీ చేసింది.

# భార్యను కత్తితో పొడిచి హత్య

## కుటుంబకలహాలే కారణమని ప్రాథమిక నిర్ధారణ

## అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన భర్త

**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 19, ప్రభాతవార్త:** భార్యను భర్త కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగి దెబోరా (26)కు 2018లో రాజు అనే వ్యక్తితో ప్రేమ వివాహం జరగగా వారికి శివకుమార్(8), రాజేష్(5) అని ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండు సంవత్సరాలుగా దెబోరా, రాజుల మధ్య గొడవలు జరుగుతూ ఉండటంతో గత సంవత్సరం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో భర్త రాజు తనను వేధిస్తున్నాడని ఫిర్యాదు చేయటంతోపాటు, విడాకుల కోసం కోర్టులో కేసు వేసింది. రాజు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ అతా పూర్‌లో నివాసం ఉంటూ ఉండగా, దెబోరా కిషన్‌బాగ్‌లో పిల్లలతో కలసి ఉంటోంది. దెబోరా కవాడిగూడలోని రత్నదీప్ భవనంలోని నాలుగో అంతస్థులో ఒక స్పా సెంటర్‌లో పనిచేస్తూ ఉన్నది. మధ్యమధ్యలో రాజు భార్య వద్దకు వచ్చి, పిల్లలను చూసే వంకతో దెబోరాకు దగ్గర కావాలని ప్రయత్నించాడు. దెబోరా అతనిని నమ్మకపోవటంతో ఆమెపై రాజు కక్ష పెంచుకున్నాడు. భార్యపై అనుమానం ఉన్న రాజు ఆమెను ఎలాగైనా హత్య చేయాలనే పథకం ప్రకారం, మంగళవారం ఉదయం స్పా సెంటర్‌కు బయలుదేరిన దెబోరాను వెంబడించాడు. ఆటోలో స్పా సెంటర్ వద్ద దిగిన దెబోరాతోపాటు, ఆమె వెనకే వచ్చిన రాజు ఆమెతోపాటు లిఫ్ట్‌లో ఎక్కి, ఆమెతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ పెరగటంతో రాజు ఆమెను కత్తితో పలుచోట్ల పొడిచి, ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, క్లూస్‌టీం సాయంతో సీసీ ఫుటేజీల ఆధారంగా ఘటన వివరాలను సేకరించారు. హత్యకు ప్రధాన కారణం కుటుంబ కలహాలేనని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. భార్యను హత్యచేసిన నిందితుడు రాజు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం అందటంతో గాంధీనగర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని, గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. దెబోరా తల్లి లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. తమ కుమార్తెను అనుమానంతో వేధించి, హత్య చేసిన రాజును కఠినంగా శిక్షించాలని దెబోరా తల్లి విజ్ఞప్తి చేశారు.

# సిఐ కాదు.. కామాంధుడు!

## మోసపోయిన యువతి ఫిర్యాదుతో కేసు నమోదు, ముందస్తు బెయిల్

### ఆరోపణలు నిర్ధారణతో డిజిపి ఆఫీస్‌కు అటాచ్



**ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త:** కాపాడాల్సిన రక్షక భటుడే.. కామంతో కాటు వేసాడు. కంచే చేను మేసిన చందంగా.. న్యాయం కోసం అని తన దగ్గరకు వచ్చిన మహిళను లోపరుచుకుని గర్భవతి చేసాడు. భర్తతో బలవంతంగా విడాకులు ఇప్పించి అన్ని విధాలుగా మహిళను వాడుకుని చివరకు మొహం చాటు వేయడం తో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. 2023లో ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌లో రాజు నాయక్ సీఐగా ఉండగా ఓ మహిళ తన భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు నుంచి ఫోన్ నంబర్ తీసుకున్న సీఐ, న్యాయం చేస్తానని నమ్మించి తరచూ ఫోన్లు, మెసేజ్‌లు చేయడం ప్రారంభించాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెను లోబర్చు కున్నాడు. ఈ క్రమంలో బాధితురాలు గర్భం దాల్చడంతో తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. అయితే, సీఐ ఆమెకు బలవంతంగా కొన్ని ట్యాబ్లెట్లు మింగించడంతో గర్భస్రావం అయిందని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఆ తర్వాత కూడా పెళ్లి విషయాన్ని దా టవేస్తుండటంతో విసిగిపోయిన ఆమె ఈ నెల 7న ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు బి.ఎన్.ఎస్ సెక్షన్ 69 ప్రకారం కేసు నమోదు చేశారు. కేసు నమోదు కావడం తో సీఐ రాజునాయక్ పరారీలోకి వెళ్లి, ఇటీవల ముందస్తు బెయిల్ పొందినట్లు సమాచారం. మరోవైపు, ఈ ఘటనపై జరిగిన అంతర్గత విచారణలో సీఐ వేధింపులకు పాల్పడినట్లు తేలడంతో ఉన్నతాధికారులు అతడిని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కాగా ఈ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర సంచలనం రేకెత్తించింది.

# కొడుకు తప్పు చేస్తే తండ్రికి సంబంధమేంటి?

## బిజెపి నేతలు పదవి తమకు వస్తుందని ఆశపడుతున్నారు

## రేవంత్ దూకుడు అడ్డుకొనేందుకు అరవింద్ యత్నం

### పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** సంజయ్‌ను పదవి నుండి దించాలని బిజెపి నేతలు డిమాండ్ చేస్తున్నారుకానీ, కొడుకు తప్పు చేస్తే తండ్రికి ఏం సంబంధం ఉంటుంది? అని పిసిసి క్రమశిక్షణ కమి టీ చైర్మన్ ప్రశ్నించారు. మంగళవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ సంజయ్ పదవిపోతే తమకి పదవి వస్తుందని పలువురు బి జెపి నేతలు ఆశపడుతున్నారనీ ఆరోపించారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో చట్టం తన పని తాను చేస్తుందనీ ఆయన తెలిపారు. మనది వెస్ట్‌బెంగాల్, బీహార్ కాదు ఇక్కడ సిఎంగా ఉన్నది రేవంత్‌రెడ్డి తానే మళ్లీ సిఎం అవుతానని ప్రకటించే శక్తి ఉన్నవాడు మీ విన్యాసాలు ఏవి కూడా ఇక్కడ పనిచేయవని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. రేవంత్ ఎత్తుకు పైఎత్తులు వేసి మళ్లీ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురాగలడని ధీమా వ్యక్తం చేశారు. సౌత్ ఇండియాలో పార్టీ బలోపే తానికి సిఎం రేవంత్ పని చేస్తున్నారని, ఆయన దూకుడు అడ్డుకోవడానికే ధర్మపురి అరవింద్ ప్రయత్నం చేస్తున్నారని రవి ఆరోపించారు. డిఎస్ జీవితకాలంలో 90 శాతం కాంగ్రెస్ పార్టీలోనే పనిచేశారని డిఎస్ కొడుకు అరవింద్ తెలంగాణ సిఎం రేవంత్‌పై ఇష్టమున్నట్టు మాట్లాడుతు న్నా రని, వైఖరి మార్చుకోవాలని హితవు చెప్పారు. సిఎం రేవంత్ ఇమేజ్ చెడగొట్టాలని చాలామంది ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన చెందారు. పిసిసి క్రమశిక్షణ కమిటీ, అనంతుల శ్యామ్‌మోహన్, ఈరవత్రి అనిల్ చైర్మన్, చరణ్ కౌశిక్‌యాదవ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు తెలంగాణ ప్రభుత్వం తీపికబురు

## 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

### ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** వానాకాలం సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు మేలు చేసేందుకు పచ్చిరొట్ట, జీలుగ, జనుము, పిల్లపెసర విత్తనాలను 50 శాతం భారి రాయితీతో అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిం చాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో మంగళవారం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారికంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా విత్తనాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి, భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట పంటలను ఎక్కువగా సాగు చేయాలన్నారు. సేంద్రీయ పద్ధతుల ద్వారా భూమిని కాపాడుకుంటూనే అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షి ంచారు. కాగా.. నిస్సారంగా మారిన నల్లబీడు భూములను తిరిగి సాగులోకి తెచ్చేందుకు, వాటి పునరుద్ధరణకు రైతులు జిప్సంను వినియోగించాలని మంత్రి తుమ్మల సూచించారు. అదేవిధంగా సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, రైతులకు అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు అన్నదాతలు దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు.

**ఆధునిక గిడ్డంగుల నిర్మాణం..**

ఆధునిక గిడ్డంగుల నిర్మాణం కోసం టీజీ ఆగ్రోస్, టీజీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సమక్షంలో ఇరు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ద్వారా 23 ఎకరాల ప్రభుత్వ భూమిలో టీజీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ సొంత నిధులతో 85 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఆధునిక గిడ్డంగులను నిర్మించనుంది. ఈ నిర్మాణ పనులను 15 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. రైతులు తమ పంట ఉత్పత్తులను సురక్షి తంగా నిల్వ చేసుకునేందుకు ఈ గిడ్డంగులు ఎంతో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల తెలిపారు. మార్కెట్ పరిస్థితులను అనుసరించి రైతులు సరైన సమయంలో తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించడంలో కూడా ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. భూముల మార్పిడి ద్వారా ప్రభుత్వ ఆస్తులు సమర్థవంతంగా వినియోగంలోకి రావడంతోపాటు రైతులకు మరిన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ మౌలిక వసతుల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు నిల్వ, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపర్చేందుకు మరిన్ని చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

20-5Pg5.qxd:20-5Pg5.qxd 1/1/02 7:24 AM Page 1



# బంగ్లాదేశ్‌కు మళ్లీ వస్తా..

## వెళ్లే తేదీ సమయం హఠాత్తుగా చెపుతా..

## మాజీ ప్రధాని షేక్ హసీనా సంచలన ప్రకటన



**న్యూఢిల్లీ, మే 19:** బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా సంచలన ప్రకటన చేశారు. 2024లో చెలరేగిన విద్యార్థి ఉద్యమం కారణంగా తన పదవిని కోల్పోయి, ప్రస్తుతం భారతదేశంలో ఆశ్రయం పొందుతున్న హసీనా తాజాగా ఒక మీడియా ఇంటర్వ్యూలో తన భవిష్యత్తు కార్యాచరణను స్పష్టం చేశారు. తనకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించినప్పటికీ, తన పార్టీ అయిన అవామీ లీగ్ పై నిషేధం విధించినప్పటికీ ఆమె ఏమాత్రం వెనక్కి తగ్గేదే లేదని ప్రకటించారు. నేను బంగ్లాదేశ్‌లో లేనంత మాత్రాన సైలెంట్‌గా ఉన్నానని అనుకోవద్దు. దేశం కోసం నేను నిరంతరం పోరాడుతూనే ఉన్నాను. అతి త్వరలోనే నేను మళ్లీ నా సొంత దేశానికి తిరిగి వెళ్తానని ధీమా వ్యక్తం చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా తాను దేశానికి తిరిగి వెళ్లే నిర్దిష్ట తేదీ, సమయాన్ని ఇప్పుడే వెల్లడించలేనని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం, భావప్రకటన స్వేచ్ఛ, రాజకీయ హక్కులు, చట్టబద్ధమైన పాలన పునరుద్ధరించబడటమే తన ప్రాథమిక లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. తన పార్టీ అవామీ లీగ్‌పై విధించిన నిషేధంపై ఆమె ఘాటుగా స్పందించారు. అవామీ లీగ్ అనేది ప్రజల గుండెల్లో ఉన్న పార్టీ. కేవలం ఒక ప్రభుత్వ కాగితపు ఆర్డర్‌తో దానిని క్లోజ్ చేయడం ఎవరి తరం కాదు. అదే నిజమైతే అసలు బంగ్లాదేశ్ అనే దేశమే పుట్టేది కాదని గుర్తుచేశారు. గతంలో తనపై 19 సార్లు హత్యాప్రయత్నాలు జరిగాయని, అయినా తాను ఎన్నడూ భయపడలేదని, ఇప్పటికీ లక్షలాది మంది మద్దతుదారులు పార్టీ కోసం నిలబడే ఉన్నారని చెప్పారు. గతంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా వ్యవహరించిన ముహమ్మద్ యూనస్‌పై ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యూనస్ ప్రభుత్వం అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలపై పగబట్టి రాజకీయ నరమేధం సృష్టించిందని ఆరోపించారు. ఇప్పటివరకు తమ పార్టీకి చెందిన సుమారు 600 మందిని దారుణంగా హత్య చేశారని, 1.5 లక్షల మందికి పైగా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొనగానే నాయకులంతా మళ్లీ తిరిగి వస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# పెను ఆర్థిక తుఫాను వస్తోంది!

## - పశ్చిమాసియా ఘర్షణలతో చమురు, ఎరువులకు తీవ్ర కొరత - సామాన్య ప్రజలను కాపాడటంలో మోడీ విఫలం - పొదుపు పాటించాలని చెబుతూ ప్రధాని విదేశీ టూర్లు ఏంటి?

## - లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మండిపాటు



**లక్నో, మే 19:** పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో భారతదేశం ఒక పెద్ద ఆర్థిక సంక్షోభం వైపు పయనిస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ హెచ్చరించారు. ఆర్థిక తుఫాను రాబోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దాని ప్రభావం నుండి సామాన్య ప్రజలను కాపాడ టంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విఫలమవుతున్నారని ఆయన ఆరోపించారు. రాయ్‌బరేలీ పర్యటనలో భాగంగా మంగళవారం బచ్రావన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, ఇరాన్, అమెరికాల మధ్య నెలకొన్న ఈ సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా చమురు, ఎరువులు, డీజిల్ కొరతకు దారితీయవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. "ఇరాన్, అమెరికాల మధ్య యుద్ధం చెలరేగింది. ఈ ఘర్షణ సమయంలో, ప్రపంచ చమురులో అధిక భాగం ప్రయాణించే వ్యూహాత్మక ప్రదేశమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ స్వాధీనం చేసుకుంది. తమ పట్టును వదులుకోబోమని ప్రకటించింది. ఫలితంగా, ఇప్పుడు ప్రపంచ మంతా చమురు, ఎరువులు, డీజిల్ తీవ్ర కొరతను వేగంగా ఎదుర్కోవడం ప్రారంభించింది" అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొనసాగిస్తున్న ఐదు దేశాల పర్యటనపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. "బంగారం కొనవద్దని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని, విదేశాలకు వెళ్లవద్దని మోడీ పౌరులను కోరతారు, కానీ ఆ వెంటనే ఆయన విదేశీ పర్యటనకు బయలుదేరుతారు" అని విమర్శలు గుప్పించారు. "విచారకరమైన విషయం ఏమిటంటే, మన జీవితంలో ఎన్నడూ చూడని తీవ్రమైన ఆర్థిక తుఫాను రాబోతోంది, దానిని ఎవరూ ఆపలేరు," అని గాంధీ అన్నారు. ఈ ఆర్థిక ప్రభావం అంబానీ, అదానీ వంటి పారిశ్రామికవేత్తల కంటే ఎక్కువగా రైతులు, కార్మికులు, యువత, చిన్న వ్యాపారులు, చిన్న పరిశ్రమలపై పడుతుందని అన్నారు. "నష్టపోయేది అంబానీ లేదా అదానీ కాదు. నాలుగు వైపులా భద్రత ఉన్న వారి రాజభవనాల్లోనే వారు ఉంటారు. నష్టపోయేది భారతదేశపు రైతులు, కార్మికులు, యువత, ఉపాధి కల్పించే చిన్న వ్యాపారులు, చిన్న పరిశ్రమలే," అని ఆయన అన్నారు. "తాను కొంతకాలంగా 'ఆర్థిక తుఫాను' గురించి హెచ్చరిస్తున్నానని, ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు విపరీతంగా పెరుగుతాయని చెప్పినట్లు పెట్రోల్ ధరలు పెంచారు. ద్రవ్యోల్బణం ఆకాశాన్ని అంటుతుంది. అయినా, రాహుల్ గాంధీకి అవగాహన లేదని అంటారు. ఈ రోజు కూడా మేం వారికి చెబుతూనే ఉన్నాం. చర్యలు తీసుకోండి. ప్రజలను రక్షించండి. రైతులను రక్షించండి. కానీ వారు ఏమీ చేయరు. కొన్నిసార్లు నార్వేకి, తర్వాత జపాన్‌కి, ఆపై మరెక్కడికో వెళ్ళిపోతారు. ఎందుకు?" అని రాహుల్‌గాంధీ నిలదీశారు. కార్మికులను, చిన్న వ్యాపారులను రక్షి ంచడంలో కేంద్రం విఫలమైందని గాంధీ ఆరోపించారు. ప్రభుత్వం పెద్ద పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని దుయ్య బట్టారు. "కార్మికులను, చిన్న వ్యాపారులను ఆదుకోవడం ప్రారంభించాలని తాము రోజూ నరేంద్ర మోడీని కోరుతూనే ఉన్నాము. కేంద్రం అలా చేయడంలో విఫలమైతే, దేశం అపారమైన నష్టాన్ని చవిచూడబోతోంది రాహుల్‌గాంధీ ఆందోళనవ్యక్తం చేశారు.

# ట్రంప్, నెతన్యాహులను హత్యచేస్తే రూ.580 కోట్ల రివార్డు

## ప్రత్యేక చట్టంచేసేందుకు ఇరాన్ ఐఆర్జీసి కసరత్తులు



**టెహ్రాన్, మే 19:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మునుపెన్నడూ లేనంత ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహులను టార్గెట్ చేస్తూ ఇరాన్ పార్లమెంట్ (మజ్లిస్) ఒక సంచలన చట్టాన్ని తీసుకువస్తోంది. ట్రంప్, నెతన్యాహులను అంతమొందించిన వారికి రూ.580 కోట్ల భారీ రివార్డు ప్రకటించేలా ఒక ప్రత్యేక బిల్లుపై ఇరాన్ ఎంపీలు కసరత్తులుచేస్తున్నారు. ఈ విషయాన్ని ఇరాన్ జాతీయ భద్రతా కమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం అజీజీ అధికారికంగా ధృవీకరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా - ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన భారీ వైమానిక దాడుల్లో ఆ దేశ అత్యున్నత నాయకుడు అయతోల్లా అలీ ఖమేనీ మరణించారు. ఈ దారుణ ఉదంతానికి ప్రతీకారం తీర్చుకునేందుకే తాజాగా ఇరాన్ నాయకత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ వార్తా సంస్థ ది టెలిగ్రాఫ్ నివేదిక ప్రకారం ఇరాన్ ఎంపీలు ప్రస్తుతం ఇస్లామిక్ రిపబ్లిక్ సైనిక, భద్రతా దళాల పరస్పర ప్రతీకార చర్య అనే పేరుతో ఒక ప్రత్యేక బిల్లును రెడీ చేస్తున్నారు. ఈ చట్టం ప్రకారం డొనాల్డ్ ట్రంప్‌ను హతమార్చిన ఏ వ్యక్తికైనా అధికారికంగా 50 మిలియన్ యూరోలు అంటే మన కరెన్సీలో సుమారు రూ.580 కోట్లు బహుమతిగా అందజేస్తారు. అలీ ఖమేనీ మరణానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, యూఎస్ సెంట్రల్ కమాండ్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్‌లే పూర్తి బాధ్యులని ఇబ్రహీం అజీజీ స్పష్టం చేశారు. వీరంతా కచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఇటీవల ఇరాన్ జాతీయ భద్రతా కమిటీ వైస్ ఛైర్మన్ మహ్మూద్ నబవియాన్ మాట్లాడుతూ.. ట్రంప్, నెతన్యాహులను నరకానికి పంపే వారికి భారీ బహుమతి ప్రకటించేందుకు పార్లమెంట్ అతి త్వరలోనే ఓటింగ్ నిర్వహించనుందని తెలిపారు. ఒకవేళ భవిష్యత్తులో ఇరాన్ లేదా తమ నాయకత్వంపై అమెరికా, ఇజ్రాయెల్ మళ్లీ దాడికి దిగితే, దాని పర్యవసానాలు కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాబోవని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యూహాత్మకంగా మద్దతు ఇస్తున్న ప్రాంతీయ అరబ్ దేశాలు, వారి ప్రభుత్వాలు కూడా ఈ తీవ్రమైన ఎదురుదాడిని ఎదుర్కోవలసి ఉంటుందని ఆయన బాహాటంగానే హెచ్చరించారు. ఇరాన్ నుంచి ట్రంప్‌కు ఇలాంటి బెదిరింపులు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఇరాన్ టాప్ కమాండర్ ఖాసిం సులేమానీ, అలీ ఖమేనీ మరణాల తర్వాత ట్రంప్‌ను అంతమొందించేందుకు ఇరాన్‌లో వరుస ప్రచారాలు జరుగుతున్నాయి. గతంలో ట్రంప్ హత్య కోసం ప్రభుత్వం మద్దతు ఉన్న గ్రూపులు ఈ క్యాంపెయిన్ ద్వారా 27 మిలియన్ డాలర్లకు పైగా సేకరించినట్లు సమాచారం. ట్రంప్, నెతన్యాహుల చావు కోసం గతంలోనే 50 మిలియన్ డాలర్ల బహుమతిని ప్రకటించింది.

# ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు

## వచ్చే యేడాది జూన్ 14వరకూ పొడిగించిన యుఐడిఎఐ

**న్యూఢిల్లీ, మే 19:** ఆధార్ కార్డుదారులకు యూఐడీఏఐ సడలింపులు ఇచ్చింది. ఆన్‌లైన్‌లో ఉచితంగా ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు విధించిన గడువును మరో పూర్తి ఏడాది పాటు పొడిగించింది. వాస్తవానికి ఈ అవకాశం త్వరలో ముగియనుండగా, పౌరుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఐడీఏఐ తెలిపింది. తాజా ఉత్తర్వుల ప్రకారం 2027 జూన్ 14 వరకు పోర్టల్ ద్వారా డాక్యుమెంట్లను ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. ఈ నెల 13న విడుదల చేసిన అధికారిక మెమోరాండం ప్రకారం యూఐడీఏఐ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ సదుపాయాన్ని మరో ఏడాది, అంటే 2026 జూన్ 15 నుంచి 2027 జూన్ 14 వరకు పొడిగించాలని నిర్ణయించాం. దీని ప్రకారం ఆధార్ పోర్టల్‌లో డాక్యుమెంట్ అప్‌డేట్ సౌకర్యం 2027 జూన్ 14 వరకు ఉచితంగా కొనసాగుతుందని ఆ ప్రకటనలో స్పష్టంగా పేర్కొన్నారు. పౌరులు తమ వివరాలను కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవడాన్ని ప్రోత్సహించడమే ఈ పొడిగింపు ఉద్దేశమని తెలిపింది. కొత్త యాప్ రాకతో పాత యాప్‌కు స్వస్తి డాక్యుమెంట్ అప్‌డేట్‌తో పాటు యూఐడీఏఐ మొబైల్ యాప్‌లో కూడా కీలక మార్పులు చేసింది. పాత యాప్‌ను త్వరలో నిలిపివేయనున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా ప్రకటించింది. దాని స్థానంలో వినియోగదారుల కోసం మెరుగైన ఫీచర్లతో కొత్త ఆధార్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సురక్షితమైన క్యూఆర్ కోడ్ ఆధారిత ఆధార్ షేరింగ్, మెరుగైన ప్రైవసీ నియంత్రణలు, ఇతర ఆధార్ సేవలను సులభంగా పొందేందుకు ఈ కొత్త యాప్ వీలు కల్పిస్తుంది. కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ కొత్త ఆధార్ యాప్‌కు ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తోంది. కేవలం మూడు నెలల్లోనే ఈ యాప్‌ను 2.1 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇప్పటివరకు ఈ యాప్ ద్వారా 28 లక్షల మంది తమ మొబైల్ నంబర్లను, దాదాపు 6 లక్షల మంది తమ చిరునామాలను అప్‌డేట్ చేసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కొత్త యాప్ ఆండ్రాయిడ్, యాపిల్ ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉంది.

# సెప్టెంబరు 12,13 తేదీల్లో పుతిన్ భారత్ పర్యటన



**న్యూఢిల్లీ, మే 19:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ లో పర్యటించనున్నారు. భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ రానున్నట్లు ఆ దేశ అధ్యక్ష భవనం క్రెమ్లిన్ మంగళవారం అధికారికంగా ధృవీకరించింది. భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక, రక్షణ రంగ బంధం బలపడుతున్న తరుణంలో పుతిన్ పర్యటన ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత డిసెంబర్‌లో జరిగిన 23వ భారత్‌రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ ఢిల్లీకి వచ్చారు. ఆ సమయంలో మోదీతో కలిసి ద్వైపాక్షిక సంబంధాల విస్తరణపై చర్చలు జరిపారు. ఆ పర్యటన జరిగిన ఏడాదిలోపే పుతిన్ రెండోసారి భారత్‌కు వస్తుండటం గమనార్హం. రష్యా ఉక్రెయిన్ యుద్ధం 2022లో ప్రారంభమైన తర్వాత పుతిన్ గతేడాది డిసెంబర్‌లోనే మొదటిసారి భారత్‌లో అడుగుపెట్టారు. దానికి ముందు ఆయన 2021లో ఢిల్లీని సందర్శించారు. భారత్‌రష్యా మధ్య ఏటా ఒకసారి ఇరు దేశాల అధినేతలు భేటీ అయ్యే సంప్రదాయం ఉంది. ఒక ఏడాది భారత్‌లో జరిగితే, మరో ఏడాది రష్యాలో జరుగుతుంది. ఢిల్లీలో ఈ ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ సదస్సులో ప్రపంచ భద్రతా సవాళ్ల వంటి కీలక అంశాలపై చర్చించనున్నారు.

# రష్యా చమురు దిగుమతులకు అమెరికా తాత్కాలిక లైసెన్స్



**వాషింగ్టన్,మే 19:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లను కుదిపేస్తున్న వేళ అమెరికా భారత్ సహా అధికంగా చమురు దిగుమతులపై ఆధారపడిన దేశాలకు తాత్కాలిక ఊరట కల్పిస్తూ ఓ తాజా లైసెన్స్‌ను జారీ చేసింది. అయితే భారత్ ఈ లైసెన్సులపట్ల స్పష్టమైన వైఖరితో ఉంది. భారత ప్రయోజనాల ఆధారంగానే తమ దిగుమతులు ఉంటాయని ఎవరిపైనా ఆధారపడే ప్రసక్తి ఉండదని స్పష్టంచేసింది. అయితే యుఎస్ ఆంక్షల కారణంగా సముద్రంలో చిక్కుకుపోయిన రష్యా ముడి చమురు కార్గోలను స్వీకరించేందుకు 30 రోజుల పాటు అగ్రరాజ్యం అనుమతి ఇచ్చింది. హార్మూజ్ జలసంధి వద్ద నెలకొన్న ఆందోళనలతో ముడి చమురు ధరలు అధిక స్థాయిలో ఉన్న తరుణంలో ఈ చర్య కీలకంగా మారింది. యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన ఈ తాత్కాలిక లైసెన్స్, ఇప్పటికే నౌకల్లో లోడ్ చేసి సముద్ర మార్గంలో ఉన్న రష్యా ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులను అందుకునేందుకు మాత్రమే వర్తిస్తుంది. దీని ద్వారా కొత్తగా రష్యా నుంచి చమురు దిగుమతులు చేసుకోవడానికి గానీ, కొత్త వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి గానీ అవకాశం లేదు. ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్న దేశాలకు మద్దతుగా, సరఫరాలో అంతరాయాలను నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ సోషల్‌మీడియా హ్యాండిల్‌లో తెలిపారు. భౌతిక క్రూడ్ మార్కెట్‌ను స్థిరీకరించడం, ఇంధన అవసరాలు అధికంగా ఉన్న దేశాలకు చమురు చేరేలా చూడటం కూడా ఈ లైసెన్స్ ఉద్దేశమని ఆయన వివరించారు. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం భారత్‌కు ముఖ్యమే ఎందుకంటే తన మొత్తం చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపై ఆధారపడే భారత్, ప్రపంచ ఇంధన సరఫరా గొలుసులో ఏ చిన్న మార్పు జరిగినా తీవ్రంగా ప్రభావితమవుతుంది.

# విజయ్ సర్కార్ ఎప్పుడైనా కూలిపోతుంది

## త్వరలోనే తమిళనాడులో మళ్లీఎన్నికలు: స్టాలిన్



**చెన్నై, మే 19:** తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ జిల్లా కార్యదర్శులతో సమావేశమైన స్టాలిన్, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తన అంచనాలను వివరించారు. ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీలో టీవీకేకు 107, దాని మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు 5 సీట్లు ఉన్నాయి. డీఎంకే మిత్రపక్షాలైన వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్‌కు చెందిన 8 మంది ఎమ్మెల్యేలు బయటి నుంచి ప్రభుత్వానికి మద్దతిస్తున్నారు. వీటికి తోడు, గత వారం జరిగిన విశ్వాస పరీక్షలో ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసిన 25 మంది అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేల మద్దతు కూడా విజయ్ ప్రభుత్వానికి ఉంది. ఈ సమీకరణాలు ఎంతకాలం నిలుస్తాయనే దానిపై డీఎంకే వర్గాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. బయటి నుంచి మద్దతిస్తున్న పార్టీలు వైదొలిగినా, రెబల్ ఎమ్మెల్యేలపై స్పీకర్ లేదా కోర్టు అనర్హత వేటు వేసినా ప్రభుత్వానికి రాజకీయ అస్థిరత తప్పదని ఆ పార్టీ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే స్టాలిన్ తన పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ ఓటమి తాత్కాలికమే. ప్రస్తుత ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు. సిద్ధంగా ఉండండి. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. మనం తిరిగి పుంజుకుని మళ్లీ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఓటమికి తానే పూర్తి బాధ్యత వహిస్తున్నానని, కొలత్తూరులో తన ఓటమిని కూడా అంగీకరిస్తున్నానని తెలిపారు. తమిళనాట సూర్యుడు (డీఎంకే గుర్తు) అస్తమించడని ఆయన వ్యాఖ్యానించారు. ఓటమికి గల కారణాలను విశ్లేషించేందుకు, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించేందుకు 36 మంది సభ్యులతో ఒక కమిటీని కూడా స్టాలిన్ ఏర్పాటు చేశారు.

# మద్రాస్ హైకోర్టుకు 19మంది జడ్జిలు

## - 10మంది న్యాయవాదులు, 9 మంది న్యాయాధికారులు

## - సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు

**న్యూఢిల్లీ, మే 19:** మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులుగా 19 మందిని నియమించాలని సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. కొలీజియం సిఫార్సు చేసిన 19 పేర్లలో 10 మంది న్యాయవాదులు, 9 మంది న్యాయాధికారులు ఉన్నారు. న్యాయవాదులు పి. మురుగన్, ఎం.డి. సుమతి, ఎస్. అల్లి, సి. తిరుమగళ్ చంద్రశేఖర్, ధర్మలింగం లింగేశ్వరన్, కార్తికేయన్ బాలదండాయుధం, నటరాజన్ రమేష్, జి.కె. ముత్తుకుమార్, రామకృష్ణన్ రాజేష్ వివేకానందన్, శంకరనారాయణన్ రవీకుమార్, నాగరాజన్ దిలీప్ కుమార్, ఎల్లప్పన్ మనోహరన్‌ల మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులుగా కొలీజియం సిఫార్సు చేసింది. అలాగే, న్యాయాధికారులు కృష్ణస్వామి గోవిందరాజన్, రజనీష్ పాతియిల్, కె. అప్పదురై అలియాస్ కందవేల్ అప్పదురై, రామస్వామి అనిత, షణ్ముగం కార్తికేయన్, బాలుస్వామి మురుగేశన్, ఎన్. గుణశేఖరన్ న్యాయమూ ర్తులుగా పదోన్నతి కల్పించడానికి సిఫార్సు చేశారు. నవంబర్ 4, 2025, నవంబర్ 21, 2025, డిసెంబర్ 7, 2025, డిసెంబర్ 10, 2025 తేదీలలో వచ్చిన నాలుగు ప్రతిపాదనలను సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలించి ఈ మేరకు సిఫార్సులు చేసింది.

# గల్ఫ్‌దేశాల విజ్ఞప్తితో ఇరాన్‌పై దాడిని నిలిపివేసాం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్,మే 19:** ఇరాన్‌పై జరపాల్సిన సైనిక దాడిని చివరి నిమిషంలో వాయిదా వేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. గల్ఫ్ దేశాల నేతలు చేసిన విజ్ఞప్తి మేరకు దౌత్యపరమైన చర్చలకు మరింత సమయం ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ మంగళవారం ఇరాన్‌పై చాలా పెద్ద దాడికి మేం సిద్ధమయ్యాం. కానీ సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ వంటి దేశాల నేతలు నన్ను సంప్రదించారు. ఇరాన్‌తో ఒప్పందం కుదిరేందుకు చర్చలు చాలా దగ్గరగా ఉన్నాయని, రెండు మూడు రోజుల సమయం ఇవ్వాలని కోరారు. దీంతో దాడిని కొంతకాలం పాటు వాయిదా వేశానని వివరించారు. ఈ వాయిదా శాశ్వతంగా ఉండాలని ఆశిస్తున్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు. ఇరాన్ చేతికి అణ్వాయుధం వెళ్లకుండా నిరోధించగలిగితే, అదే మాకు సంతృప్తినిస్తుంది. వారిపై బాంబుల వర్షం కురిపించకుండానే ఈ పని పూర్తయితే నేను చాలా సంతోషిస్తానుఅని ట్రంప్ స్పష్టం చేశారు. దౌత్య ప్రయత్నాలు విఫలమైతే సైనిక చర్యకు తాము సిద్ధంగానే ఉన్నామని హెచ్చరించారు. దాడి వాయిదా విషయాన్ని ఇజ్రాయెల్, ఇతర మిత్రదేశాలకు ఇప్పటికే తెలియజేశామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ తమ సైనిక చర్యలతో ఇరాన్ సైన్యాన్ని, మొదటి స్థాయి నాయకత్వాన్ని ఇప్పటికే పూర్తిగా నాశనం చేశామని సంచలన వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే పూర్తిస్థాయి దాడికి సిద్ధంగా ఉండాలని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌ను ట్రంప్ ఆదేశించినట్లు తెలిసింది.

# సైనిక సామర్థ్యం పెంపుకోసం అమెరికాతో ఒప్పందాలు

## అపాచీ హెలికాప్టర్లు, హోవిట్జర్ల నిర్వహణకు భారీ నిధులు

**న్యూఢిల్లీ,మే 19:** భారత్‌అమెరికా రక్షణ సంబంధాలు మరింతగా బలపడినట్లు తాజా ఒప్పందం స్పష్టంచేస్తోంది. భారత సైనిక సామర్థ్యాన్ని పెంచే దిశగా అమెరికా మద్దతు ఇచ్చింది. అపాచీ హెలికాప్టర్లు, ఎం777 హోవిట్జర్ల నిర్వహణ మద్దతు కోసం సుమారు 428.2 మిలియన్ డాలర్ల విలువైన రెండు సైనిక ఒప్పందాలకు అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు మే 18న అమెరికా కాంగ్రెస్‌కు వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ ఒప్పందాల్లో మొదటిది ఎం777ఎ2 అల్ట్రాలైట్ హోవిట్జర్ల దీర్ఘకాలిక నిర్వహణకు సంబంధించింది. దీని విలువ 230 మిలియన్ డాలర్లు. ఈ ప్యాకేజీలో విడిభాగాలు, మరమ్మతులు, శిక్షణ, సాంకేతిక సాయం, ఫీల్డ్ సర్వీస్ వంటివి ఉంటాయి. ఈ ఒప్పందానికి బీఏఈ సిస్టమ్స్ ప్రధాన కాంట్రాక్టర్‌గా వ్యవహరించనుంది. రెండో ఒప్పందం ఏహెచ్64ని అపాచీ హెలికాప్టర్ల నిర్వహణకు సంబంధించినది. దీని విలువ 198.2 మిలియన్ డాలర్లు. ఇంజినీరింగ్, సాంకేతిక, లాజిస్టిక్స్ మద్దతు, సిబ్బందికి శిక్షణ వంటి సేవలు అందిస్తారు. బోయింగ్, లఖీడ్‌మార్టిన్ సంస్థలు ఈ ఒప్పందానికి ప్రధాన కాంట్రాక్టర్లుగా ఉన్నాయి. ఈ ఒప్పందాలు ఇండోపసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాల్లో రాజకీయ స్థిరత్వం, శాంతి, ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించడానికి దోహదపడతాయని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది.

# సంక్షిప్తంగా..

## భారత్‌లో లేని ఎయిర్‌బేస్‌లపై పాకిస్థాన్ దాడి చేసిందట!

**ఇస్లామాబాద్, మే 19:** గతేడాది భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా తాము 'బునియాన్ ఉల్ మర్సూస్' ఆపరేషన్‌ను చేపట్టామని పాకిస్థాన్ అధికారి ఒకరు వెల్లడించారు. ఆ సమయంలో భారత్‌లోని రాజౌరీ, మామూన్ ఎయిర్ బేస్‌లను తమ క్షిపణులు తాకినట్లుగా గొప్పలు చెప్పారు. అయితే అక్కడ అసలు ఎయిర్ బేస్‌లే లేవనే విషయాన్ని మాత్రం గ్రహించలేకపోయారు. రాజౌరీ జమ్మూకాశ్మీర్‌లోని ఓ జిల్లా. అక్కడ ఎటువంటి భారత వైమానిక దళ ఎయిర్‌బేస్ లేదు. మామూన్ పంజాబ్‌లోని పఠాన్‌కోట్ సమీపంలో ఉన్న ఓ కంటోన్మెంట్ ప్రాంతం.

ఈ విషయం కూడా తెలుసుకోకుండా వాటి పేర్లు ప్రస్తావించడంతో సోషల్ మీడియాలో నెటిజన్లు ఆయనను ట్రోల్ చేస్తున్నారు. ఆపరేషన్ సమయంలో తమకు భారత్‌లోని రాజౌరీ, మామూన్ ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని స్థానిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాక్ అధికారి పేర్కొన్నారు.

## పంజాబీ గాయని ఇందర్‌కౌర్ హత్య



**మోగా(పంజాబ్), మే 19:** ప్రముఖ పంజాబీ గాయని ఇందర్ కౌర్ దారుణ హత్యకు గురైంది. పెళ్లికి అంగీకరించలేదని ఓ మృగాడు అత్యంత దారుణంగా చంపేసి మృతదేహాన్ని కాలువలో పడేసిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఇందర్ కౌర్ ప్రముఖ పంజాబ్ గాయని. మోగాలోని భలూర్ గ్రామానికి చెందిన సుఖ్వీందర్ సింగ్ అనే వ్యక్తి బలవంతంగా పెళ్లి చేసుకవడానికి తీవ్ర ఒత్తిడి తెస్తున్నాడు. కానీ అందుకు ఇందర్ కౌర్ నిరాకరిస్తూ వస్తోంది. దీంతో సుఖ్వీందర్ సింగ్ పగ పెంచుకున్నాడు. ఈ నెల 13న రాత్రి 8:30 గంటలకు కారులో సరుకులు తేవడానికి ఇందర్ కౌర్ బయటకు వెళ్లింది. రాత్రి పొద్దుపోయే వరకు ఇంటికి రాకపోవడంతో భయాందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## గోట్ చిత్రం నంబర్‌ప్లేట్‌ను సిఎం విజయ్‌కు బహూకరించిన దర్శకుడు




**చెన్నై, మే 19:** తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రముఖ నటుడు విజయ్‌ను దర్శకుడు వెంకట్ ప్రభు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ గోట్ చిత్రంలో విజయ్ పాత్ర నడిపిన కారుకు ఉపయోగించిన టిఎన్07 సీఎం2026 అనే ఐకానిక్ నంబర్ ప్లేట్‌ను ఆయనకు బహూకరించారు. ఈ ఘటనతో 2024లో విడుదలైన ఆ చిత్రంలోని ఓ సన్నివేశం మరోసారి వార్తల్లోకి వచ్చింది. గోట్ చిత్రంలో విజయ్ టిఎన్07 సీఎం 2026 నంబర్ ప్లేట్ ఉన్న కారులో కనిపిస్తారు.

అప్పట్లో ఈ సన్నివేశంపై పెద్దగా చర్చ జరగకపోయినా, విజయ్ రాజకీయ రంగ ప్రవేశం చేసి, ముఖ్యమంత్రి కావడంతో ఇప్పుడు ఈ నంబర్ ప్లేట్ ఒక జోస్యంలా మారిపోయింది.

## ప్రభాకరన్ వర్ధంతి రోజున టివికె విజయ్ నివాళి

**చెన్నై, మే 19:** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత జోసెఫ్ విజయ్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎల్‌టీటీఈ వ్యవస్థాపకుడు వేలుపిళ్లై ప్రభాకరన్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ఈ మేరకు విజయ్ తన ఎక్స్ ఖాతాలో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. శ్రీలంక సైన్యం చేతిలో ప్రభాకరన్ మరణించిన ముల్లివైకల్ ఘటనను విజయ్ గుర్తుచేసుకున్నారు. ముల్లివైకల్ చేదు జ్ఞాపకాలను మేం ఎప్పటికీ గుండెల్లో మోస్తూనే ఉంటాం అని పేర్కొన్నారు. శ్రీలంకలో తమిళ హక్కుల కోసం ఎప్పుడూ అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. 1991లో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో ప్రభాకరన్ ప్రధాన నిందితుడు. ఈ కారణంగానే భారతదేశంలో ఎల్‌టీటీఈ సంస్థపై నిషేధం కొనసాగుతోంది.

## జస్టిస్ యశ్వంత్ వర్మపై విచారణ - లోక్‌సభ స్పీకర్‌కు నివేదిక అందజేత

**న్యూఢిల్లీ, మే 19:** హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణలపై నియమించిన విచారణ కమిటీ, తన నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. ఈ నివేదికను పార్లమెంట్ హౌస్‌లో, న్యాయమూర్తుల విచారణ కమిటీకి నేతృత్వం వహిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ లాంఛనంగా అందజేశారు. కమిటీ సభ్యులు బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాది బి.వి. ఆచార్య కూడా ఆయనతో పాటు ఉన్నారు. కమిటీ కార్యదర్శి గణపతి భట్, కన్సల్టెంట్ న్యాయవాదులు కరణ్ ఉమేష్ సాల్వీ, సమీక్ష దువా కూడా హాజరయ్యారు. విచారణ పెండింగ్‌లో ఉండగానే జస్టిస్ వర్మ ఈ ఏడాది ఏప్రిల్‌లో రాజీనామా చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ వర్మను తొలగించాలని కోరుతూ 146 మంది లోక్‌సభ సభ్యులు సంతకం చేసిన అభిశంసన తీర్మానాన్ని అనుసరించింది.

20-5Pg6exHMNWJQE.qxd:20-5Pg6exHMNWJQE.qxd 1/1/02 6:44 AM Page 1



## పంచగ్రామాల భూ సమస్య పరిష్కరించండి

**● ముఖ్యమంత్రి సిపిఎం నేత బి.వి.రాఘవులు లేఖ**



**విజయవాడ, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ జిల్లా పంచగ్రామాల భూ సమస్య పరిష్కార చర్యలు చేపట్టాలని సిపిఐ(యం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఐ(యం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు లేఖ రాశారు. దీనికి సంబంధించిన ప్రకటనను సీపీఎం రాష్ట్ర కార్యాలయం నుంచి మంగళవారం విజయవాడలో విడుదల చేశారు. గత మూడు దశాబ్దాలుగా విశాఖ జిల్లా పంచగ్రామాల భూసమస్య పరిష్కారం కాకపోవడంతో సుమారు 2 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ ప్రభుత్వం 2014లో విశాఖలో జరిపిన మొట్టమొదటి కేబినెట్ సమావేశంలో ఈ సమస్య వంద రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నేటికి 12 సంవత్సరాలు పూర్తయ్యాయి. అయినా ఇంకా పరిష్కారం కాలేదు. తక్షణం ఈ సమస్యను పరిష్కరించే చర్యలు చేపట్టాలని, ఈలోగా నిర్మాణాలను, రిపేర్లను అనుమతించాలని, క్రయ విక్రయాలను, రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని కోరుతున్నాను అని బివి.రాఘవులు లేఖలో పేర్కొన్నారు.

## పెదపేట దళితవాడపై నిర్బంధం తొలగించండి

**● సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి**

**విజయవాడ, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** పెదపేట దళితవాడపై నిర్బంధం తొలగించాలని సిపిఐ(యం) కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి డిమాండ్ చేసారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంగళవారం లేఖ రాశారు. దీనికి సంబంధించిన ప్రకటనను విడుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం పెదపేట దళిత వాడను ఈనెల 16వ తేదీన మాపార్టీ స్థానిక కార్యకర్తలతో కలిసి సందర్శించాను. బలహీనులుగా అణచివేతకు గురయ్యే దళితులకు రక్షణ కల్పించి వారు గౌరవంగా జీవించేందుకు మన రాజ్యాంగం అనేక హక్కులను కల్పించింది. వాటిని అమలు చేసి, దళితులకు పేదలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఈ విషయాలు మీకు తెలుసు. కానీ ఆ గ్రామంలో శ్రీరామనవమి రోజున గొంతేనమ్మ గుడిలో బలవంతంగా శంకుస్థాపన చేసి స్థానిక దళితవాడపై దాడిచేశారు. దళితవాడ మీదకు దాడికి వచ్చిన వారిని వదిలేసి ప్రశ్నించిన వారిని, అవమానాన్ని ప్రతిఘటించిన వారిని అక్రమంగా అరెస్టు చేశారు. పోలీసు కస్టడీలో యువకులను లాఠీలతో కొట్టారు. తీవ్రంగా హింసించారు. పోలీసు కస్టడీలో యువకులను హింసించిన అధికారులపై విచారించి చర్య తీసుకోవాలి. సుప్రీంకోర్టు నిన్న పెదపేట దళితవాడలో యధాతధ స్థితిని కొనసాగించాలని ఆదేశాలిచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాలను జిల్లా కలెక్టర్ అమలు చేయాలి. పెదపేట దళితులపై నిర్బంధాన్ని ఆపండి. ప్రాథమిక హక్కులను కాపాడండి. పోలీసు కస్టడీలో యువకులను హింసించిన అధికారులపై విచారించి చర్య తీసుకోవాలి అని డి.రమాదేవి లేఖలో పేర్కొన్నారు.

## పాదయాత్రలు చేసినంతమాత్రాన ప్రజల మన్నన అందరికి లభించదు

**● ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**



**విజయవాడ, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** పాదయాత్రలు చేస్తే ప్రజలు మన్నన అందరికి లభించిందని, జగన్‌లాంటి వారిని జనం విశ్వసించరని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. మంగళవారం పెద్ద సంఖ్యలో వివిధ పార్టీల, కీలకం వైసిపి కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వీరందరి కండువా కప్పి షర్మిల పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆంధ్ర రత్న భవనం(విజయవాడ) వేదికగా షర్మిల మీడియాతో మాట్లాడారు. నేటికి వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై ప్రజలకు అపారమైన అభిమానం, ప్రేమ ఉన్నాయని వ్యాఖ్యానించారు. భూతద్దం పెట్టి వెతికినా వైఎస్ లాంటి వారు పుట్టరని అన్నారు. వైఎస్ పేరు చెప్పుకుని జగన్ ఒక్క ఛాన్స్ అంటూ పాదయాత్ర చేశారని షర్మిల అన్నారు. ఆయన సీఎం అయ్యాక స్విచ్‌లు నొక్కడం తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం స్విచ్‌లు నొక్కితే మళ్లీ మళ్లీ సీఎంలు అవరనేది కొంతమంది తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ మధ్య నాయకులు సీఎం అవగానే ఎంపీ, ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. వైఎస్సార్ రెండో సారి సీఎం అయ్యాక ప్రజల వద్దకు వెళ్లాలని నిర్ణయించారని, ఈ క్రమంలో రచ్చబండకు వెళ్తుండగా చనిపోయారని ప్రస్తావించారు. తండ్రి ఆశయాలను సాధిస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్న వారు ఆ తర్వాత ఆయన ఆశయాలనే నాశనం చేశారని షర్మిల దుయ్యబట్టారు. నిన్న సిగ్గులేకుండా వైసీపీ నేతలు ధర్నాలు చేశారని సెటైర్లు గుప్పించారు. వాళ్ల ప్రభుత్వంలో భారాలు మోపిన విషయాలు మరిచారా? అని ప్రశ్నించారు. జగన్ సీఎం అయ్యాక కూడా ప్రధాని మోదీ చెప్పినట్లుగా తల ఆడించారని విమర్శించారు. బీజేపీతో జగన్ అక్రమ పొత్తు పెట్టుకున్నారని షర్మిల ఎద్దేవా చేశారు.

## తుడా చైర్మన్ దివాకర్ రెడ్డికి ఎస్‌వియు డాక్టరేట్

**తిరుపతి, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తుడ ఛైర్మన్, టిటిడి బోర్డు సభ్యుడు సి.దివాకర్‌రెడ్డికి తిరుపతి ఎస్వీయూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్ర విభాగంపై ఆయన పరిశోధన చేశారు. ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన ఆచార్య జి. సవరయ్య పర్యవేక్షణలో, కో రీసెర్చ్ సూపర్‌వైజర్ ఆచార్య ఆర్.సునీత మార్గదర్శకత్వంలో దివాకర్ రెడ్డి తన పరిశోధనను పూర్తి చేశారు. 'కౌలు రైతుల ఆర్థిక పరిస్థితులు: చిత్తూరు జిల్లాలో ఒక కేస్ స్టడీ' ప్రాధాన్యత కలిగిన అంశంపై సుదీర్ఘ పరిశోధన చేసి, రూపొందించిన పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు కంట్రోలర్ వివరించారు. పరిశోధనలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో సుమారు 312 మంది కౌలు రైతుల కుటుంబాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను దివాకర్ రెడ్డి నిశితంగా విశ్లేషించారు. దివాకర్ రెడ్డికి పిహెచ్‌డి డిగ్రీ ప్రధానం చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ బి.రాజమాణిక్యం తెలిపారు.

# గన్నవరంలో సీ-డాక్ కేంద్రం ఏర్పాటు

**● మంత్రి లోకేష్‌తో ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ చర్చలు**

**గన్నవరం, మే 19 ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏఐ, వీఎల్ఎస్ఐ వంటి ఆధునిక సాంకేతిక విభాగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు గన్నవరంలో సీ-డాక్ కేంద్రం (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్) ఏర్పాటును వేగవంతం చేయాలని కోరుతూ రాష్ట్ర ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌కు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విజ్ఞప్తి చేసారు. మంగళవారం ఉండవల్లిలో నారా లోకేష్‌ను ప్రత్యేకంగా కలిసిన యార్లగడ్డ సీ-డాక్ కేంద్రం ఏర్పాటు పై చర్చలు జరిపారు. ఈసందర్భంగా గన్నవరంలో సీ-డాక్ బృందం పర్యటించిన కేంద్రం ఏర్పాటు కోసం తనతో చర్చలు జరిపిన సంగతిని లోకేష్‌కు వివరించారు. ఈకేంద్రం సత్వరమే ఏర్పాటు చేసేలా కేంద్రమంత్రి అశ్వనీవైష్ణవ్‌తో మాట్లాడాలని కోరారు. దేశంలోనే 13వ సీ-డాక్ కేంద్రం గన్నవరంలో ఏర్పాటు కానుండగా, ఈప్రాజెక్టు కోసం రాష్ట్రప్రభుత్వంపై ఏవిధమైన భారం పడదని, కేంద్రప్రభుత్వం నుండి రూ.200 కోట్ల నిధులు మంజూరవుతాయని వివరించారు. ఈకేంద్రం ఏర్పాటు అయితే ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని సత్వరమే స్పందించి కేంద్రమంత్రితో మాట్లాడాలని యార్లగడ్డ కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ కేంద్రమంత్రితో ప్రత్యేకంగా మాట్లాడి ప్రాజెక్టు మంజూరు ప్రక్రియను వేగవంతం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.



# దేవాలయాల్లో బయోగ్యాస్, పైప్డ్ గ్యాస్ ప్లాంట్లు

**● దేవాదాయశాఖ ఎక్స్ అఫీషియో సభ్యుడు హరి జవహర్‌లాల్ ● సమాజానికి దేవాలయాలు భారం కాకూడదని సూచన**



**ఇంద్రకీలాద్రి, మే 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రాష్ట్రంలోని దేవాలయాల్లో బయోగ్యాస్, పైప్డ్ గ్యాస్ ప్లాంట్లు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ ఎక్స్ అఫీషియో డా ఎం హరిజవహర్‌లాల్ ఆదేశాలిచ్చారు. మంగళవారం విజయవాడలోని దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలకు చెందిన 22 మంది ఇఓలతో సమావేశం నిర్వహించి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో జీరో వేస్ట్ డిస్పోజల్ పాలసీ అమలు చేయాలన్నారు. భక్తులకు ఆన్‌లైన్‌సేవలను విరివిగా అందుబాటులో వుంచాలన్నారు. సమాజానికి దేవాలయాలు భారం కాకూడదు, దేవాలయాలే సమాజ భారాన్ని మోసేలా వుండాలన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా దేవాలయాల చెత్తను వేస్ట్ డంపింగ్ యార్డులకు పంపకుండా జీరో వేస్ట్ డిస్పోజల్ పాలసీ అమలు చేయాలన్నారు. పారిశుద్ధ్యంలో మెరుగైన విధానలు అవలంభించాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం సక్సెస్ మంత్రను అమలు చేయాలన్నారు. భూగర్భ జలాల పెంపుకోసం రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ అమలు చేయాలన్నారు. నీటిశుద్ధికోసం సూయజ్, సట్లేజ్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి నీటిని శుద్ధి చేయాలన్నారు. సోలార్ విద్యుత్తును గరిష్ఠంగా వినియోగించాలన్నారు. దేవాలయాల్లోని సేవకుల ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాల వ్యాప్తతో పాటు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్రచారం నిర్వహించాలన్నారు. పర్యావరణ అనుకూల హరిత ఆలయాలుగా ఏపిలో దేవాలయాలను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కమీషనర్ రామచంద్రమోహన్, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, శ్రీశైలం, అన్నవరం, సింహాచలం, ద్వారకా తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం దేవాలయాల అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు ఆయనకు వివరించారు.



## జలధార పనులు వేగవంతం చేయాలి : ఎన్‌టిఆర్ కలెక్టర్

**విజయవాడ, మే 19 ప్రభాతవార్త:** జిల్లాలో జలధార పనులు వేగవంతం చేసి చెరువుల్లో పూడికతీత, గట్లు బలపరచటం, కాలువల పూడికతీత పనులు వేగవంతం చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడలోని కలెక్టరేట్‌లో జిల్లాలో జలధార పనులు జరుగుతున్న తీరుపై జలవనరులశాఖ, డ్వామా అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసంద్భంగా జలధార పనుల పురోగతిపై ఆరా తీసిన కలెక్టర్ చెరువుల అభివృద్ధితోపాటు గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భజలాల పెంపు కోసం జలధార కార్యక్రమాన్ని ప్రాధాన్యంగా తీసుకుని పనులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 766 పనులు మంజూరు కాగా 578 పనులు ప్రారంభమై పురోగతిలో ఉన్నాయని, వీటిని త్వరితగతిన పూర్తిచేసి మిగిలిన పనులు పూర్తిచేయాలని సూచించారు.

### టిమ్ ఎన్‌టిఆర్ కృషితో మ్యూజియం డే విజయవంతం

ఎన్‌టిఆర్‌జిల్లాలోని వివధ ప్రభుత్వశాఖల అధికారుల సమిష్టి కృషితో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలను విజయవాడలో విజయవంతం చేసామని ఇందులో పాల్గొన్న ప్రతిఒక్కరిని అభినందిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. సోమవారం బాపు మ్యూజియంలో నిర్వహించిన కార్యక్రమాల పట్ల ప్రజల నుండి విశేషస్పందన లభించినట్లు కలెక్టర్ పెర్కొన్నారు. భవిష్యత్‌లోనూ ఇటువంటి చారిత్రక, వారసత్వ పరిరక్షణకు ఇటువంటి కార్యాక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ప్రకటించారు.

## హైకోర్టు న్యాయవాది అంజన్‌రెడ్డిపై మంత్రి సత్యకుమార్ వర్గీయులు దాడి

**అనంతపురం, మే 19 ప్రభాతవార్త బ్యూరో:** హైకోర్టు న్యాయవాది అంజన్‌రెడ్డిపై మంత్రి సత్యకుమార్ వర్గీయులు దాడి చేశారు. గత ఎన్నికల్లో తమకు అనుకూలంగా పనిచేయలేదని కారణంతో పాటు మంత్రి సత్యకుమార్‌పై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని కారణంతో దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. నీతో మాట్లాడాలంటూ ధర్మవరం ఆస్పత్రిలో సిసి కెమెరాలు లేని ప్రాంతానికి తీసుకెళ్లి అంజిరెడ్డి పై దాడి చేశారు. అడ్వకేట్ అంజన్ రెడ్డి పై దాడికి పాల్పడిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి వర్గీయులు తెలిపారు. ధర్మవరం మండలం, తిప్పేపల్లి గ్రామానికి చెందిన అడ్వకేట్ అంజన్ రెడ్డి స్థానిక ఆసుపత్రికి వెళ్లి, సూపరింటెండెంట్‌తో మాట్లాడుతుండగా, మంత్రి అనుచర వర్గం ఉద్దేశపూర్వకంగా గొడవకు దిగారని అంజిరెడ్డి బంధువులు చెబుతున్నారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపి, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బాధితుడికి పూర్తి రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా అంజన్ రెడ్డి పై దాడి విషయం తెలిసిన వెంటనే శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ కూడా స్పందించి న్యాయవాది అంజిరెడ్డి తో ఫోన్లో మాట్లాడినట్లు, ఇందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించినట్లు తెలిసింది.



# పొదల మధ్య ఎలక్ట్రీషియన్ మృతదేహం.. హత్య? లేక ఆత్మహత్య?

**● పాల వాగు సమీపంలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభ్యం**

**● ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిఐ సుబ్బారావు, ఎస్ఐ ఉమామహేశ్వరరావు**

**వింజమూరు (నెల్లూరు), మే 19 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా వింజమూరు నైరుతి దిక్కున ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వింధ్య పరమేశ్వరి అమ్మవారి ఆలయ మార్గంలో తీవ్ర కలకలం రేగింది. పాల వాగు సమీపంలోని పొదల మధ్య ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడిఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే కలిగిరి సీఐ పి.సుబ్బారావు, వింజమూరు ఎస్సై ఎం.ఉమా మహేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

పొదల మధ్య మూడు రోజుల క్రితం నాటి శవం. పోలీసులు ఘటనా స్థలంలో విస్తృతంగా గాలించగా, పొదల మధ్య కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం లభ్యమైంది. ఆ వ్యక్తి సుమారు మూడు, నాలుగు రోజుల క్రితమే మృతి చెంది ఉండటాన్ని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు.

మృతదేహం వద్ద ఉన్న ఆధార్ కార్డు, బైక్ నంబర్ ఆధారంగా.. మృతుడు కలిగిరి మండలం వీర్నకొల్లు గ్రామానికి చెందిన మేదరమెట్ల వెంకటేశ్వర్లు కుమారుడు మేదరమెట్ల శ్రీకాంత్(32)గా గుర్తించారు. ఇంటికొస్తాడనుకుంటే.. అనంత లోకాలకు మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం వృత్తి రీత్యా ఎలక్ట్రీషియన్ అయిన శ్రీకాంత్ శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎక్కడైనా కరెంటు పని చేసుకుంటూ ఉండి ఉంటాడని శని, ఆదివారాలు కుటుంబ సభ్యులు భావించారు. అయితే ఎంతకీ రాకపోవడంతో సోమవారం కలిగిరి పోలీసు స్టేషన్‌లో శ్రీకాంత్ కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశారు.

అంతలోనే వింజమూరు కొండ దారిలో పాల వాగు సమీపంలో శవమై తేలడంతో ఆ కుటుంబంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి.

**మిస్టరీగా మారిన మృతి:** శ్రీకాంత్‌కు ఎవరితోనూ గొడవలు లేవని, ఎలాంటి దురుసు ప్రవర్తన లేని పద్ధతి గల యువకుడని తండ్రి కన్నీరుమున్నీరుగా విలపించారు. అసలు వింజమూరు కొండ ప్రాంతానికి శ్రీకాంత్ ఎందుకు వచ్చాడు..? ఇది ఆత్మహత్యా లేక ఎవరైనా ఇక్కడికి రప్పించి అంతమొందించారా..? అనే కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తల్లిదండ్రులు, బంధువుల సమక్షంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. వింజమూరు పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జయరాజు, కానిస్టేబుల్ సుభాన్‌లు ఉన్నారు.

## తిరుమలలో విషాదం

**నిర్మాణ భవనంపై నుండి పడి కార్మికుడి మృతి**

**తిరుమల, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల పాపవినాశనం మార్గంలోని అవధూత దత్తపీఠం ప్రాంగణంలో ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న భవనంపై నుండి క్రిందపడి కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. తిరుమలలోని దత్తపీఠం భవనంపై నాల్గవ అంతస్థులో నీళ్ళట్యాంక్ ఏర్పాటుచేస్తున్నారు. ఇందుకుగాను కాంట్రాక్టర్ కొందరు కూలీలను రప్పించుకున్నాడు. వారిలో తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు వానియంబాడికి చెందిన మణికంఠన్ (35) ఉన్నాడు. భవనంపై ఉన్న వాటర్ ట్యాంక్‌ను మరమ్మతు (రిపేర్) చేస్తున్న సమయంలో మణికంఠన్ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు. భవనం పైనుంచి పడటంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న తోటి కార్మికులు, పీఠం సిబ్బంది వెంటనే స్పందించి బాధితుడిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మణికంఠన్ ప్రాణాలు కోల్పో యాడు, మృతునికుటుంబం కూడా తిరుమలలోనే కార్మికులుగా ఉన్నారు. దీంతో తిరుమల కొండపై మంగళవారం విచారకరమైన ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న తిరుమల 2టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు ప్రారంభించారు.

## టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు విడుదల

**విజయవాడ, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. మే 25 నుంచి జూన్ 4వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. మే 25 నుంచి జూన్ 4వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల హాల్‌టికెట్లను స్కూల్ లాగిన్‌లలో పొందవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డా.కేవీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మనమిత్ర వాట్సప్ నంబర్ 95523 00009 ద్వారా నేరుగా ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఎగ్జామ్ హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అంతే కాకుండా, తమ అధికారిక వెబ్‌సైట్‌లోనూ హాల్‌టికట్లను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ మార్చి 2026 రోల్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## మోడల్ స్కూల్స్‌లో కాంట్రాక్ట్ సిబ్బంది సేవలు పొడిగింపు

**విజయవాడ, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి మోడల్ స్కూల్స్‌లో కాంట్రాక్ట్ సిబ్బంది సేవలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పొడిగించింది. 123 మంది ఫిజికల్ డైరెక్టర్లు, 120 మంది కంప్యూటర్ టీచర్ల సేవలను పునరుద్ధరించింది. 2026 జూన్ 1వ తేదీ నుంచి 2027 ఏప్రిల్ 30వ తేదీ వరకు 11 నెలల పాటు సేవలకు అనుమతి ఇచ్చింది. అకడమిక్ ఇయర్ 2026- 27 కోసం కాంట్రాక్ట్ సిబ్బందికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒక నెల విరామంతో సేవల కొనసాగింపునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జీఓ ఆర్టీ నంబర్51ను స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ విడుదల చేసింది. ఈ మేరకు ఫైనాన్స్ శాఖ అనుమతితో ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## ఆచార్య రాచపాళెంకు అడిగోపుల సాహిత్య ప్రతిభా పురస్కారం



**అనంతపురం, మే 19 ప్రభాతవార్త బ్యూరో:** ప్రసిద్ధ అభ్యుదయకవి అడిగోపుల వెంకటరత్నం పేరు మీద ఆయన కుటుంబ సభ్యులు నెలకొల్పిన "అడిగోపుల సాహిత్య ప్రతిభా పురస్కారం 2026" కు సుప్రసిద్ధ అభ్యుదయ సాహిత్య విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు అవార్డు వ్యవస్థాపకులు, అడిగోపుల కుటుంబ సభ్యులు వెల్లడించారు. జులై నెల రెండవ వారంలో తిరుపతిలో జరగనున్న ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని రాచపాలెంకు అందజేయనున్నట్లు ఆస్ట్రేలియా నుంచి "తెలుగుసందడి" సాహిత్య, సాంస్కృతిక వ్యవహారాల సంచాలకుడు అడిగోపుల శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ, తెలుగు; పిహెచ్.డి (197077) చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, యోగివేమన విశ్వవిద్యాలయాలలో 38 ఏళ్ళు తెలుగు అధ్యాపకుడుగా పని చేశారు. 102 విమర్శ, పరిశోధన, కవిత్వ, సంపాదక పుస్తకాలు ప్రచురించారు. 45 మంది పరిశోధకులకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు.

# రూ.1 కోటి విలువైన 500 మొబైల్ ఫోన్లు రికవరీ

**● ఇతర రాష్ట్రాల నుండి మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి స్వాధీనం**



**తిరుపతి, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా పోలీసులు 'మొబైల్ రికవరీ మేళా' కార్యక్రమంలో 14వ దశలో భాగంగా సుమారు కోటి రూపాయలు విలువైన 500 మొబైల్ ఫోన్లను సిఇఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేశారు. ఆ మొబైల్ ఫోన్లన్నీటినీ బాధితులకు అందజేశారు. ఇప్పటివరకు నిర్వహించిన 13 దశల్లో మొత్తం 10.52 కోట్లు విలువైన 4,785 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించడం జరిగిందని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు వెల్లడించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎస్పీ సుబ్బరాయుడు వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో కీలక భాగంగా మారిందన్నారు. అలాంటి ఫోన్ పోగొట్టుకున్నప్పుడు ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఇంటి నుంచే సిఇఐఆర్ సేవల ద్వారా ఫిర్యాదు నమోదు చేసి తమ మొబైల్ ఫోన్లను తిరిగి పొందే అవకాశం కల్పించామని తెలిపారు. తిరుపతి జిల్లా పోలీసులు ఆంధ్రప్రదేశ్‌తో బాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాల నుండి కూడా మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు సిఇఐఆర్ సేవలను పొందేందుకు 9490617873 వాట్సాప్ నంబర్‌కు హై అని మెసేజ్ పంపడం ద్వారా సిఇఐఆర్ లింక్‌ను సులభంగా పొందవచ్చని తెలిపారు. ఈ నంబర్ ద్వారా సిఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడానికి అవసరమైన పూర్తి మార్గదర్శకం మరియు సాంకేతిక సహాయం అందించబడుతుందని వివరించారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్ల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్ పోగొట్టుకున్న వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా ఫోన్ రికవరీ అవకాశాలు పెరుగుతాయి. సైబర్ మోసాలు డిజిటల్ నేరాల నుండి రక్షణ పొందేందుకు ప్రతి ఒక్కరూ బలమైన పాస్‌వర్డ్లు ఉపయోగించడంతో పాటు వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దు. ప్రజల ఆస్తుల రక్షణకు తిరుపతి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తారు. కేంద్ర ప్రభుత్వ సేవ అయిన సిఇఐఆర్ పోర్టల్ (హెచ్‌టిటిపిఎస్://డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సిఇఐఆర్.జివోవి.ఇన్) ద్వారా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన సందర్భంలో ఆన్లైన్లో ఫిర్యాదు నమోదు చేయవచ్చు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్‌లు రికవరీలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ సిబ్బందికి ప్రశంస పత్రాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి వెంకటరావు, సైబర్ సెల్ సిఐ వినోద్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

# నీలం సంజీవరెడ్డి పదవులకే వన్నె తెచ్చారు!

**● అనంతలో ఘనంగా నీలం 113వ జయంతి వేడుకలు**

**అనంతపురం, మే 19 ప్రభాతవార్త బ్యూరో:** గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి ఎన్నో పదవులు అనుభవించాడని, దేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలల చాటిచెప్పిన వ్యక్తి నీలం సంజీవరెడ్డి అని ఎడిసిసి మాజీ ఛైర్మన్ తరిమెల కోనా రెడ్డి కొనియాడారు. మాజీ రాష్ట్రపతి దివంగత నీలం సంజీవరెడ్డి 113వ జయంతి సందర్భంగా అనంతపురం నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎపిఐడిసి మాజీ ఛైర్మన్ నల్లపరెడ్డి, అగ్రికల్చర్ అడ్వైజరీ మాజీ ఛైర్మన్ వెన్నపూస రామచంద్రారెడ్డి, తదితర నీలం సంజీవరెడ్డి అభిమానులు సంజీవరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో సాగునీటి సౌకర్యాలకు ఎంతో కృషి చేశారని, రాజకీయ పదవులకు వన్నె తెచ్చిన వ్యక్తి నీలం సంజీవరెడ్డి అని తరిమెల కోనా రెడ్డి, నల్లపురెడ్డి, రామచంద్రారెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. పార్టీలో పిసిసి, ఎఐసిసి పదవులను అధిరోహించి రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా, రాష్ట్రపతిగా పనిచేసి మచ్చలేని నాయకుడిగా తెలుగు ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన నేత నీలం అంటూ పొగడ్తలతో ముంచెత్తారు.

రైతు బిడ్డ రాష్ట్రపతి కావడం సాధారణమైన విషయం కానప్పటికీ ఆ పదవిని ఏకగ్రీవంగా చేజిక్కించుకోవడం తెలుగుజాతికే గర్వకారణమన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయడంలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో రాణించడంతో గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఆయన ఎదిగిన తీరు నేటి యువతకు ఆదర్శప్రాయమని తెలిపారు. నేటి యువతీ యువకులు నీలం సంజీవరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అదేవిధంగా గార్లదిన్నె మండలం కల్లూరులో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి విగ్రహం వద్ద ఘనంగా సంజీవరెడ్డి జయంతి వేడుకలు జరిగాయి. సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి అభిమానుల మధ్య కేక్ కూడా కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కూడా ఎడిసి బ్యాంకు మాజీ అధ్యక్షుడు కోనారెడ్డి, ఎపిఐడిసి మాజీ ఛైర్మన్ నల్లపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విశాఖపట్నం అనకాపల్లి అల్లూరి సీతారామరాజు
వార్త
బుధవారం 20, మే 2026




## గాజువాక గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం

గాజువాక, మే 19,ప్రభాతవార్త:

స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో 14 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చదవడం, రాయడం కథలు చెప్పే అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం పిల్లల్లో ఆలోచనా శక్తిని పెంచేందుకు 'మెదడుకు మేత' కార్యక్రమంతో పాటు, వినోదాన్ని పంచే వైకుంఠపాళి ఆటను ఆడించారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారిణి బి. సూర్యకళ పర్యవేక్షించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. చివరగా జాతీయగీత ఆలపనతో కార్యక్రమం ముగిసింది.

## నూతన పోలీస్ స్టేషన్ భవనాల ప్రారంభం




8లో




## మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సాయం

### కూటమి ప్రభుత్వ నిర్ణయంపై మాధవ్ హర్షం






8లో

## ఏయూలో వివక్ష ఆరోపణలను ఖండించిన అధికారులు

8లో

## ఘనంగా ముగిసిన మొదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం





- భక్తుల కోలాహలం నడుమ సాగిన ఊరేగింపు
- జాతరలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పిఓ, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు

8లో

## భూ వివాదాల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

### జె.సి జి.విద్యాధరి



8లో

## జిల్లాలో మత్స్యకారుల ఖాతాల్లో రూ.27.19 కోట్లు జమవచ్చే




8లో

## మూడేళ్లలో విశాఖలో భారీ అభివృద్ధి పనులు

### కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



విశాఖపట్నం, మే19, ప్రభాతవార్త:

రాబోయే 3 ఏళ్లలో 5 వేల కోట్ల రూపాయలతో విశాఖ ఎకనామిక రీజియన్ లో పలు అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు జిల్లా కలక్టరు యం.అభిషిక్త్ కిషోర్ వెల్లడించారు. మంగళవారం మత్స్యకారుల సేవలో కార్యక్రమం అనంతరం కలక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ సిటి ఎకనామిక్ రీజియన్ పేరున దేశంలో నాలుగు నగరాలను భారత ప్రభుత్వం ఎంపిక చేయగా

తరువాయి 8వ పేజీలో

## 'సౌత్'లో ఎమ్మెల్యే వంశీతో కలిసి.. జీవీఎంసీ కమిషనర్ విస్తృత పర్యటన



వార్త 8లో



8లో

## జగన్ హయాంలో అంతా.. రాక్షస పాలన, రౌడీయిజమే..

## జగన్ రెడ్డి దళితుల పాలిట దుర్మార్గుడు

గోపాలపట్నం, మే 19, ప్రభాతవార్త:

దళితుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించే జగన్ రెడ్డి ఎన్నికల సమయంలో బూటకపు ప్రేమను కురిపిస్తుంటాడని రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు పి.గణబాబు విమర్శించారు. గడిచిన వైకాపా ప్రభుత్వ హయాంలో వందలాది మంది దళితులు నిష్కారణంగా హత్యలకు గురయ్యారని ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గణబాబు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా సుమారు 200 మందికి పైగా దళితులు హత్యకు గురికాబడ్డారన్నారు.

తరువాయి 8వ పేజీలో



ప్రభుత్వ విప్ గణబాబు

శ్రద్ధాంజలి



జననం: 1-6-1945 మరణం: 4-5-2026
పెద్దకర్మ:
తేది: 20-05-2026 నక్కపల్లి వెంకటనగర్ కాలనీలో

ఆప్యాయత అనురాగానికి ప్రతీకగా జీవించి, ఉపాధ్యాయుడుగా ఉత్తమ సేవలందించిన స్వర్గీయ శ్రీ దాసరి చక్రరావు, M.A., BEd. గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : శ్రీమతి సుబ్బలక్ష్మి

కుమారుడు, కోడలు : వెంకట రామకృష్ణ, శ్రీమతి జ్యోతి.
అల్లుడు : దేవవరపు వెంకటరమణ (వార్త రమణ).
కుమార్తె : శ్రీమతి దుర్గా భవానీ.
మనుమలు : వినీల C.A., సాయిచరణ్, IT, కెనడా.
సుష్మకావ్య, M.Sc.

సోదరులు : కొండలరావు, తమ్మాజిరావు, అప్పారావు.
బావమరుదులు : రెడ్డి అప్పారావు (బాబ్జి), గంగాధర్.
తోడల్లుడు కుమారుడు, కోడలు : ముత్తింటి రవికుమార్, శ్రీమతి అరుణ.

బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు

## మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సాయం ....

### కూటమి ప్రభుత్వ నిర్ణయంపై మాధవ్ హర్షం

విశాఖపట్నం, మే19, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మత్స్యకార కుటుంబాలకు అండగా నిలుస్తూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న రూ.20 వేల ఆర్థిక సహాయంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్ హర్షం వ్యక్తం చేశారు. చేపల వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు 'మత్స్యకార భరోసా' పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.20 వేల చొప్పున నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఉన్న రూ.10 వేల సాయాన్ని రెట్టింపు చేసి రూ.20 వేలుగా పెంచడం మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు అమలయ్యే వేట నిషేధ సమయంలో రాష్ట్రంలోని 1.30 లక్షలకు పైగా మత్స్యకార కుటుంబాలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద రూ.10 లక్షల వరకు భీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అలాగే 230 బోట్ల తయారీకి 60 శాతం సబ్సిడీతో ఆర్థిక సహాయం అందిస్తూ మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి మత్స్యకారుల అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తున్నాయని మాధవ్ పేర్కొన్నారు.తీర ప్రాంతాల అభివృద్ధి, ఫిషింగ్ హార్బర్ల విస్తరణ, జెట్టీల ఆధునీకరణ, కోల్డ్ స్టోరేజ్ సదుపాయాల పెంపు వంటి అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మాధవ్ వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలతో మత్స్యకార కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

## జిల్లాలో మత్స్యకారుల ఖాతాలో 27.19 కోట్లు జమ

విశాఖపట్నం, మే19, ప్రభాతవార్త:

మత్స్యకారుల వేట నిషేధిత భృతి కింద జిల్లాలో13,597 మందికి 27 కోట్ల రూపాయలు ప్రభుత్వం వారి ఖాతాలలో జమ చేసిందని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ వెల్లడించారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన మత్స్యకారుల సేవ కార్యక్రమంలో పాల్గొనగా జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ జి .విద్యాధరి, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ యాదవ్, కలెక్టరేట్ నుంచి వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేట నిషేధభృతి కింద మత్స్యకారులకు జిల్లాలో 27 కోట్ల 19 లక్షల 40 వేలు మెగా చెక్కును అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే ప్రభుత్వం వేట నిషేధ భృతి కింద కుటుంబానికి 20వేల వంతున విడుదల చేసింది అన్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది 1500 మంది లబ్ధిదారులను చేర్చినట్లు ఆయన తెలిపారు. ఇంతకు ముందు మెకానైస్డ్ బోట్లలో పనిచేసే సిబ్బంది 6గురికి మాత్రమే జీవన భృతి వర్తించగా ప్రస్తుతం 8 నుండి 10 మంది వరకు ఈ పథకంలో చేరుస్తున్నామన్నారు. ఇంకెవరైనా మిగిలి ఉంటే వారిని కూడా గుర్తించి ఈ పథకంలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు లక్ష్మణరావు, మత్స్యకార బోట్ల ఓనర్లు, మత్స్యకారులు పాల్గొన్నారు.

## మూడేళ్లలో విశాఖలో భారీ అభివృద్ధి పనులు

7వ తరువాయి ..

దానిలో విశాఖపట్నం నగరానికి చోటు దక్కిందని ఆయన అన్నారు. నీతి అయోగ్ సూచనల మేరకు రీజియన్ లో 49 ప్రాజెక్టులతో పాటు స్థానిక అవసరాలకు అనుకూలంగా మరిన్ని ప్రాజెక్టులు చేపడతా మన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఏర్పాటు వల్ల విశాఖ రీజియన్ లో అభివృద్ధి అవకాశాలు విస్తరి స్తున్న నేపథ్యంలో ఋషికొండ, ఎండాడ తదితర ప్రాంతాలలో పోటెన్సియల్ పెరుగుతుందన్నారు. ఈ నిధులతో నగర ప్రజల ఆశయమును అనుగుణంగా విశాఖ సమగ్ర అభివృద్ధి దిశగా సాగుతుందని కలక్టర్ పేర్కొన్నారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ క్రింద జివిఎంసికి 200 కోట్లతో ఒక ప్రాజెక్టు, విఎంఆర్డిఏకు 100 కోట్లతో మరొక ప్రాజెక్టు మంజూరు కానున్నాయని అభిషిక్త్ కిషోర్ తెలిపారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన ఐూ= లు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు ఆయన వెల్లడించారు. సముద్ర తీర ప్రాంతంలో చాల చోట్ల రిటైనింగ్ వాల్స్ దెబ్బ తిన్నాయని వాటిని పునర్నిర్మాణం చేయడంతో పాటు ఋషికొండ వరకు రిటైనింగ్ వాల్స్ ఎక్కడ అవసరమో అక్కడ పలు రక్షనాత్మక నిర్మాణాలు చేపడ తామని అన్నారు. అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద జివిఎంసికి 3 ప్రాజెక్టుల కోసం 1500 కోట్లు నిధులు మంజూరైనట్లు కలక్టర్ విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

## భూ వివాదాల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

విశాఖపట్నం, మే19, ప్రభాతవార్త:

భూ వివాదాల పరిష్కారంలో తహసిల్దార్లు, సర్వేయర్లు బాధ్యాతా యుతంగా వ్యవహరించాలని జాయింట్ కలక్టర్ జి.విద్యాదరి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జిల్లాలో తహసల్దార్లు, డి.టిలు, సర్వేయర్లతో రీ సర్వే ఆర్ అండ్ ఆర్ ప్రజా ఫిర్యాదులు పరిష్కారం తరితర అంశాలలో వ్యవహరించాల్సిన తీరుపై జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలక్టర్ మాట్లాడుతూ రీ సర్వే, ఫీల్డ్ సర్వో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి పరిష్కారమైనట్లుగా వారికి తెలియజేయాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారములో అర్జీ దారులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఆర్ అండ్ ఆర్ లో మ్యుటేషన్లు జరిగితే ఆ రైతుకు తెలియజేయాలని, తిరస్కరిస్తే అందుకు కారణాలను కూడా రైతులకు తెలియజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఉప సంచాలకులు సర్వే కే.రమణ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే రామకృష్ణ, డిప్యూటి కలక్టర్ గోవింద్, కో ఆర్డినేషన్ పర్యవేక్షకులు శ్యాం రామప్రసాద్ , తహసిల్దారు పాల్గొన్నారు.

## ఏయూలో వివక్ష ఆరోపణలను ఖండించిన అధికారులు

విశాఖపట్నం, మే19, ప్రభాతవార్త:

ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చైర్ లో డాక్టరల్ ఫెలోగా పనిచేస్తున్న యాదాల ప్రవీణ్ కుమార్‌పై విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బంది ఎటువంటి వివక్ష చూపలేదని ఏయూ అధికారులు స్పష్టం చేశారు. గత కొన్నిరోజులుగా వివిధ పత్రికలలో వస్తున్న వార్త కథనాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయన్నారు. మార్చి నెల వరకు ప్రవీణ్ కుమార్‌కు ఇవ్వవలసిన వేతనం అందించడం జరిగిందన్నారు. విశ్వవిద్యాలయంలో ఏప్రియల్ నెలకు సంబంధించిన వేతనాలు బోధన, బోధనేతర సిబ్బందికి ఇవ్వడంలో కొంత ఆలస్యం అయిందని, వీటిని కూడా ఇటీవల అందించామన్నారు. నిధుల విడుదలలో జరిగిన జాప్యం కారణంగా ఇది జరిగిందన్నారు. జూలై నుండి గ్రాంట్స్ పెండింగ్‌లో ఉన్నప్పటికీ, యూనివర్సిటీ ఇప్పటివరకు తన సొంత నిధుల నుంచి డబ్బులు ప్రవీణ్ కుమార్‌కు చెల్లించింది. విశ్వవిద్యాలయంలో పలు పరిశోధన కేంద్రాలు ఉన్నాయని, అక్కడ పనిచేసే సిబ్బందిని అందరినీ సమానంగా చూడటం జరుగుతుందన్నారు. తాము పరిశోధన కేంద్రం ఉద్యోగులుగా నిర్ణయాలు తీసుకుంటామని, వృత్తిగత కారణాలతో నిర్ణయాలు తీసుకుని, అమలు చేయడం జరగదన్నారు. సదరు అధ్యయన కేంద్రానికి రావలసిన నిధుల సకాలంలో రానప్పటికీ ఏయూ అంతర్గత నిధుల నుంచి వేతనాలు అందించడం జరిగిందన్నారు. ఈ నెల 18,19వ తేదీలలో కొన్ని పత్రికల్లో "ఏయూలో దళిత పరిశోధకుడికి వేధింపులు" అంటూ ప్రచురితమైన వార్తా కథనాలు పూర్తిగా ఏకపక్ష సమాచారం ఆధారంగా, వాస్తవాలను వక్రీకరించే విధంగా ప్రచురించబడినదని స్పష్టమవుతోందన్నారు. సంబంధిత పరిశోధకుడు చేసిన ఆరోపణలను విశ్వవిద్యాలయం ఖండిస్తోందన్నారు. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం ప్రకారం ఎటువంటి కులవివక్ష, వేధింపులు లేదా వివక్షాత్మక చర్యలకు ఆధారం పాల్పలేదని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, సమానత్వం, సామాజిక న్యాయ పరిరక్షణ విషయంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తోందని తెలియజేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయంలో గ్రీవెన్స్ రెడ్రెసల్ వ్యవస్థ, యాంటీ ర్యాగింగ్ మరియు విద్యార్థి సంక్షేమ కమిటీలు సమర్థంగా పనిచేస్తున్నాయి. ఎవరైనా విద్యార్థికి అన్యాయం జరిగినట్లయితే, సంబంధిత కమిటీల ద్వారా నిష్పక్షపాతంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకునే వ్యవస్థ అమలులో ఉందని అన్నారు. ప్రస్తుతం ప్రచురితమైన కొన్ని వ్యాఖ్యలు మరియు ఆరోపణలు విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ఉంటుంటేనే పాటు, విద్యార్థులు మరియు ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రమాదం కలిగిస్తున్నాయి. పూర్తి స్థాయి వాస్తవ నిర్ధారణ జరుగక ముందే ఇటువంటి కథనాలు ప్రచురించడం బాధ్యతారాహిత్యంగా భావిస్తున్నాం. ఈ విషయంపై అవసరమైతే అంతర్గత విచారణ నిర్వహించి, నిజానిజాలను వెల్లడించేందుకు విశ్వవిద్యాలయం సిద్ధంగా ఉన్నారు. అలాగే మీడియా సంస్థలు ధృవీకరించిన సమాచారం ఆధారంగానే వార్తలు ప్రచురించాలని మనవి చేస్తున్నాను.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం, మే19, ప్రభాతవార్త:



ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించే ఉద్దేశంతో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాగునీరు, డ్రైనేజ్, రోడ్లు, విద్యుత్, పెన్షన్ తదితర సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను ఓర్పుతో విన్న ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జగన్ రెడ్డి దళితుల పాలిట దుర్మార్గుడు

## : ప్రభుత్వ విప్ గణబాబు

గోపాలపట్నం, మే 19, ప్రభాతవార్త:



దళితుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించే జగన్ రెడ్డి ఎన్నికల సమయంలో బూటకపు ప్రేమను కురిపిస్తుంటాడని రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు పి.గణబాబు విమర్శించారు. గడిచిన వైకాపా ప్రభుత్వ హయాంలో వందలాది మంది దళితులు నిష్కారణంగా హత్యలకు గురయ్యారని ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గణబాబు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా సుమారు 200 మందికి పైగా దళితులు హత్యకు గురికాబడ్డారన్నారు. ముఖ్యంగా విశాఖపట్నంకు చెందిన డాక్టర్ సుధాకర్ మాస్కులు అడిగినందుకు పిచ్చోడిగా ముద్రించి తద్వారా మానసిక శోభకు గురిచేసి మృత్యువాత పడేలా చేసిన విషయం గమనార్హం అన్నారు. అలాగే ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని అయితే పోస్టుమార్టం లో 32 కత్తిగాట్లకు గురైన సంగతి తేటతెల్లమైందన్నారు. టిడిపి 2014-19 కాలంలో 8211 కేసులు నమోదు కాగా వైకాపా ప్రభుత్వ హయాంలో 56981 కేసులు నమోదైనది గుర్తించాల్సి ఉందన్నారు. ఎస్సీ ఎస్టీలకు చెందిన సబ్ ప్లాన్ నిధులు 33 వేల కోట్ల రూపాయలను దారి మళ్ళించారని అందువల్ల దళితులు లబ్ధిని కోల్పోయారన్నారు. ఇప్పటికీ తీరు మార్చుకోవటం లేదని అడపాదడపా దళిత ప్రభుత్వ ఉద్యోగుల మీద వైకాపా మూకలు ధాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇదేవిధంగా అనేకమంది మహిళలు అత్యాచారాలకు హత్యలకు గురయ్యారని వారి పట్ల కూడా న్యాయం చేసేందుకు జగన్మోహన్ రెడ్డి సానుకూలంగా వ్యవహరించకపోవడం అతని సైకో మనస్తత్వానికి అర్థం పడుతుందని విమర్శించారు. దళితుల సంక్షేమానికి అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని, ఆ విధంగా పరిపాలన చంద్రబాబు హయాంలో కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో దళిత నాయకులు ఉప్పాటి శివ, కుమార్, అనూష తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన మొదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం

### - భక్తుల కోలాహలం నడుమ సాగిన ఊరేగింపు - జాతరలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పిఓ, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు

పాడేరు, మే19, ప్రభాతవార్త:

శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తుల కోలాహలం నడుమ ఘనంగా ముగిసింది సతకంట్టు లో కొలువుదీరి ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహానికి,పాదాలకు,తల్లి ఘటానికి జిల్లా కలెక్టర్ నిశాంతి,ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు,ఉత్సవ కమిటీ అధ్యక్షులు గిడ్డి ఈశ్వరి,జేసి శ్రీ పూజ,పీఓ ఆదిత్య వర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి డప్పు వాయిద్యాల నడుమ శిరస్సుపై పెట్టుకుని బయటకు తీసుకు వచ్చి పాడేరు పట్టణంలో ఊరేగింపు ను నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ఊరేగింపు కార్యక్రమం భక్తజన సందోహాన్ని విశేషంగా ఆకట్టుకుంది.?ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ,జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, పాడేరు శాసనసభ్యులు ఆలయ కమిటీ అధ్యక్షులు మత్స్య రాస విశ్వేశ్వర రాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరిలు ముఖ్య అతిథులుగా పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి . ఉత్సవ విగ్రహం, అమ్మవారి పాదాలు, ఘట్టాలతో పురవీధులలో వివిధ కళాకారుల నృత్యాలతో, డప్పు వైద్యాలతో, కళ కారులతో ఊరేగింపు పొడవునా ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంప్రదాయ కళారూపాల ప్రదర్శనలు, నృత్యాలు భక్తులలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి. కోలాటాలు, భజనల , నయనానందకరంగా సాగింది.అమ్మవారి ఉత్సవ విగ్రహానికి,పాదాలకు,తల్లి ఘటానికి ఎత్తుకోవడానికి భక్తులు పోటీ పడ్డారు.అమ్మవారి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఘటాలను ఎత్తుకుంటూ అమ్మవారిని దర్శించుకోవడానికి డప్పు వాయిద్యాల తో ఆలయం వద్దకు భక్తులు చేరుకుని మ్రొక్కులను తీర్చుకున్నారు.భక్తులు తీసుకు వచ్చిన ఘటాలను ఆలయం వద్ద విడిచిపెట్టి భక్తులు వెళ్ళారు.దీంతో అమ్మవారి ఉత్సవాలు ముగిసాయి.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, ఆలయ కమిటీ, మరియు పోలీస్ అధికారులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### జగన్ హయాంలో అంతా..

## రాక్షస పాలన, రౌడీయిజమే..

### -వీధి సుబ్రహ్మణ్యం వర్ధంతి కార్యక్రమంలో టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షులు పట్టాభిరామ్



విశాఖపట్నం, మే 19, ప్రభాతవార్త:

జగన్ హయాంలో రాక్షస పాలన, రౌడీయిజం పెరిగిపోయాయని టీడీపీ జిల్లా అధ్యక్షులు చోడే పట్టాభిరామ్ పేర్కొన్నారు. మంగళవారం రామ్ నగర్ లో వున్న విశాఖ జిల్లా టీడీపీ కార్యాలయంలో.. వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పట్టాభిరామ్, పార్టీ నేతలు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ, ఎమ్మెల్సీ అనంతబాబు దళిత యువకుడు సుబ్రహ్మణ్యంను హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేశారని ఆరోపించారు. జగన్ పాలనలో దళితులపై అనేక దాడులు జరిగాయని, వందలాది మంది దళితులు హత్యకు గురయ్యారని విమర్శించారు. డాక్టర్ సుధాకర్ ఘటనను ప్రస్తావిస్తూ, మాస్క్ అడిగినందుకు ఆయనను మానసిక రోగిగా చిత్రీకరించి చంపేశారని ఆరోపించారు. జగన్ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని, వారిని కేవలం ఓటు బ్యాంక్‌లా ఉపయోగించుకున్నారని విమర్శించారు. వైసీపీ నాయకులను రాష్ట్రం నుంచి ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులైన రూ.32 వేల కోట్లను దారి మళ్లించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు జగన్‌ను 11 సీట్లకు పరిమితం చేసినప్పటికీ ఆయనకు ఇంకా బుద్ధి రాలేదన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు పుచ్చా విజయ్ మాట్లాడుతూ, జగన్ దళిత ద్రోహి అని విమర్శించారు. జగన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జగన్ పాలనలో దళితులపై దాడులు జరిగాయని అన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబును "మైనింగ్ దొంగ"గా అభివర్ణిస్తూ, దళిత యువకుడు సుబ్రహ్మణ్యంను అత్యంత కిరాతకంగా హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేశారని ఆరోపించారు. జగన్ పాలనలో దళితులపై జరిగిన దాడులపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇంచార్జ్, ఎన్టీఆర్ వైద్యసేవ చైర్మన్ సీతం రాజు సుధాకర్, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఈతలపాక సుజాత, బైరెడ్డి పోతన రెడ్డి, పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బుడిమూరి గోవింద్, పి. జయరాజ్ జాన్, విల్లూరు భాస్కరరావు, వలిశెట్టి తాతాజీ, పొడుగు కుమార్, బంగారు రవిశంకర్, మహమ్మద్ గౌస్, రంజిత్, మోర్త రాజారావు, జయశ్రీ, సతివాడ అప్పారావు, సింహాచలం, దువ్వాడ లక్ష్మీ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## నూతన పోలీస్ స్టేషన్ భవనాల ప్రారంభం

### - కంచరపాలెం, ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్, క్రైమ్ స్టేషన్లకు కొత్త భవనాలు
### - డీజీపీ హరీష్ కుమార్ గుప్తా



విశాఖపట్నం, మే 19 ప్రభాతవార్త

పోలీసు కమిషనరేట్ పరిధిలో నూతనంగా నిర్మించిన కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్ , క్రైమ్ పోలీస్ స్టేషన్ భవనాలను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన జ్ఞాపికగా మొక్కను నాటారు. పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, ప్రజలకు మరింత వేగవంతమైన, సమర్థవంతమైన పోలీసింగ్ అందించేందుకు ఆధునిక వసతులతో పోలీస్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, నేరాల దర్యాప్తు, సైబర్ నేరాల నియంత్రణలో ఈ కొత్త భవనాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించడం ద్వారా సేవల నాణ్యత మరింత పెరుగుతుందని ఆయన అన్నారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యం గా పని చేస్తామని అన్నారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, నగర ప్రజలకు మరింత మెరుగైన భద్రతా సేవలు అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో పోలీస్ స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాల్లో నేర నియంత్రణకు ఈ కొత్త భవనాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. భవిష్యత్తులో సైబర్ నేరాల విచారణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రెండో అంతస్తులో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పోలీస్ సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించడం ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందించగలమని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ పోలీస్ అధికారులు పాల్గొన్నారు

### 'సౌత్'లో ఎమ్మెల్యే వంశీతో కలిసి..

## జీవీఎంసీ కమిషనర్ విస్తృత పర్యటన

### -ప్రజా సమస్యల ప్రాంతాల్లో పర్యటించిన ఇరువురు -ఆయా సమస్యలకు అనుగుణంగా పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులకు కమిషనర్ ఆదేశాలు

విశాఖపట్నం, మే 19, ప్రభాతవార్త:

దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ సూచించిన పలు ప్రజా సమస్యలకు సంబంధించి దక్షిణ నియోజకవర్గంలోని పలు వార్డుల్లో పర్యటించి, గుర్తించిన సమస్యలపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జోనల్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సౌత్ జోన్ పరిధిలోని 29, 30, 31, 35, 37, 39 వార్డుల్లో బీచ్ గోకుల్ పార్క్ నుంచి నేవల్ క్యాంటీన్, జాలారిపేట, టౌన్ హాల్, లైట్ హౌస్, పోర్టు ఏరియా, కోటవీధి, పాత పోస్టాఫీస్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం పరిసరాలు, రామకృష్ణ రైతుబజార్, జగదాంబ జంక్షన్, రేజిమెంటల్ లైన్ సెమెంటరీ తదితర ప్రాంతాల్లో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పలు ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గోకుల్ పార్క్ నుంచి ఆర్కే బీచ్ వరకు రక్షణ గోడ నిర్మాణం, నేవల్ క్యాంటీన్--జాలారిపేట ప్రాంతంలో పార్కు ఏర్పాటు, బీచ్ సుందరీకరణ, మత్స్యకారుల కోసం వలలు అల్లుకునే షెడ్ల నిర్మాణం, ఎస్-ఎల్ కెనాల్ ఆధునీకరణ, కోటవీధిలో పొట్టి శ్రీరాములు కళ్యాణమండపాన్ని ఇండోర్ స్టేడియంగా మార్పు, పాత పోస్టాఫీస్ వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం ఆధునీకరణ, సీ హార్స్ జంక్షన్ వద్ద మార్కెట్ నిర్మాణం, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, రామకృష్ణ మార్కెట్‌ను రైతుబజార్‌గా అభివృద్ధి చేయడం, జగదాంబ జంక్షన్ వద్ద రేజిమెంటల్ సెమెంటరీ ఆధునీకరణ వంటి అంశాలను పరిష్కరించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో సమస్యలను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. జాలారిపేట, ఎస్ఎల్ కెనాల్ ప్రాంతాల్లో స్థానికులు వివరించిన సమస్యలను తెలుసుకున్నారు. గోకుల్ పార్క్ నుంచి ఆర్కే బీచ్ వరకు రక్షణ గోడ నిర్మాణం, కోస్టల్ బ్యాటరీ--నేవల్ క్యాంటీన్ ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు, ఫుట్‌పాత్ మరమ్మతులు, పార్కుల అభివృద్ధి, మత్స్యకారుల కోసం షెడ్లు, కమ్యూనిటీ హాల్ మరమ్మతులు, జాలారిపేట జంక్షన్ అభివృద్ధి, టౌన్ హాల్ టాయిలెట్ల మరమ్మతులు, లైట్ హౌస్ అభివృద్ధి, భవన నిర్మాణ వ్యర్థాల తొలగింపు, విక్టోరియా రాణి విగ్రహం జంక్షన్ అభివృద్ధి, క్వీన్ మేరీ స్కూల్ పునరాభివృద్ధి, పాత రిజిస్ట్రార్ కార్యాలయం అభివృద్ధి, సానిటరీ కార్యాలయం పునర్నిర్మాణం, సీ హార్స్ జంక్షన్ వద్ద మార్కెట్ నిర్మాణ ప్రతిపాదనలు, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వద్ద షాపుల నిర్మాణం, ఎస్ఎల్ కెనాల్ ఆధునీకరణ, రామకృష్ణ మార్కెట్‌కు మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై సమగ్రంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి అడ్డంకులుగా ఉన్న సంబంధిత శాఖలకు అవసరమైన లేఖలు పంపించి తగిన చర్యలు తీసుకోవాలని, పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీ లక్ష్మికి కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజినీర్ తిరుమలరావు, సహాయక వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, ఏపిడీ పద్మావతి, రెవెన్యూ ఆఫీసర్ టీఎస్ఎన్ రాజు, మాజీ కార్పొరేటర్లు అప్పలకొండ, పోతురాజు, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం, జనసేన పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై యూనియన్ ప్రతినిధులతో జీవీఎంసీ కమిషనర్ సమావేశం

విశాఖపట్నం, మే 19, ప్రభాతవార్త:







పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం వారికి కల్పించే మౌలిక సదుపాయాలు జీతభత్యాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి. నరేష్ కుమార్, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి. వెంకటరెడ్డి ఇతర ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ముందుగా యూనియన్ ప్రతినిధుల సమస్యలను తెలపాలని జీవీఎంసీ కమిషనర్ సిఐటియు ప్రతినిధులను కోరగా జీవీఎంసీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు మాట్లాడుతూ, జీవీఎంసీ కమిషనర్ పై మాకు పూర్తి నమ్మకం ఉందని, కమీషనర్ ఒప్పందాలు, మినిట్స్ అమలు చేస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా నీటి సరఫరా, వెటర్నరీ ,పార్కులలో కార్మికులు, రిటైర్డ్, అకాల మరణం పొందిన కార్మికుల కుటుంబంలోని ఒకరికి ఉద్యోగ కల్పన, లోడర్లకు వేతనాలు పెంపుదల, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం మౌలిక సదుపాయాలు మహిళా పారిశుద్ధ్య కార్మికుల రక్షణ, అలవెన్స్ లపై ఉన్న బకాయిలు, విలీన కార్మికులకు పీఎఫ్ సొమ్ము, కార్మికుల సప్లమెంటరీ జీతాలు మొదలైన సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా.., కమిషనర్ స్పందిస్తూ, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జీవీఎంసీలో అంతర్భాగంగా పనిచేయాలని ముఖ్యంగా కార్మికుల సంక్షేమానికి పనిచేయడం అభినందనీయమని కమిషనర్ తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల వలనే నగర పరిశుభ్రతతో పాటు నగరానికి మంచి గుర్తింపు వస్తుందని అటువంటి కార్మికుల హక్కుల పరిరక్షణకు జీవీఎంసీ సిద్ధంగా ఉందని, ప్రస్తుతం కౌన్సిల్ కాలం లేనందున స్పెషల్ ఆఫీసర్ పాలనలో ఉన్నందున మీరు అందించే జీవోలు, మెమోలు మాకు సపోర్టుగా ఉంటాయని తెలిపారు. అదనంగా నియమించిన కార్మికుల జీతాలు నిర్ణీత సమయంలో ఇచ్చేందుకు ప్రతి నెల 20వ తేదీ నుండి 26వ తేదీ లోపల జీతాల బిల్లులను సిద్ధం చేయాలని అధికారులకు తెలిపారు. యూనియన్ ప్రతినిధులు కార్మికుల సంక్షేమం కోసం ఇచ్చిన మినిట్స్ లో ప్రతి అంశాన్ని పరిశీలించేందుకు జీవీఎంసీ అదనపు కమిషనర్ ,ప్రధాన వైద్యాధికారి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, తాగునీటి విభాగం పర్యవేక్షక ఇంజనీర్లతో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని, కార్మికులు ప్రతి అంశం వారితో చర్చించి ప్రభుత్వం జీవో లేదా మెమో ప్రకారం అమలు చేసేందుకు ఈ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని యూనియన్ ప్రతినిధులకు తెలిపారు. మీరు మినిట్స్ లో ఇచ్చిన ప్రతి అంశం సాధ్యమైనంత వరకు అమలు చేసే చేస్తామని కమిషనర్ యూనియన్ ప్రతినిధులకు కమిషనర్ భరోసాను ఇచ్చారు. ఈ సమావేశంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి సహాయక ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ అరుణకుమారి ,పర్యవేక్షక ఇంజనీర్లు పల్లంరాజు, రాయల్ బాబు, సంపత్ కుమార్, ఏ డి హెచ్ వాసుకి, స్పోర్ట్స్ డైరెక్టర్ (ఇన్చార్జ్) ఈ.ఏ.రాజు ,అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పద్మజ, యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు ప్రధాన కార్యదర్శి యు.రాజు ఇతర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తతతో ప్రమాదాలు నివారించిన రైల్వే సిబ్బందికి భద్రతా అవార్డులు

విశాఖపట్నం, మే 19, ప్రభాతవార్త:





రైలు భద్రతా నిర్వహణలో అప్రమత్తత, విధి నిర్వహణలో నిబద్ధత కనబరిచి ప్రమాదాలను నివారించిన వాల్తేరు డివిజన్ రైల్వే ఉద్యోగులకు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా భద్రతా అవార్డులు ప్రదానం చేశారు. వివిధ రైల్వే సెక్షన్లలో విధులు నిర్వహిస్తున్న సమయంలో హాట్ యాక్సిల్స్, బోగీలలో లోపాలు, అసాధారణంగా పొగ రావడం, లెవల్ క్రాసింగ్ గేట్లు తెరిచి ఉండటం వంటి ప్రమాద సూచనలను ముందుగానే గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందించి ప్రమాదాలను అరికట్టినందుకు సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం లలిత్ బోహ్రా మాట్లాడుతూ, భారతీయ రైల్వేల్లో భద్రతకే అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ఉద్యోగులు అప్రమత్తతతో వ్యవహరించి సమయానికి లోపాలను గుర్తించడం వల్ల ప్రమాదాలు నివారించగలిగామని తెలిపారు. ఇటువంటి అవార్డులు ఉద్యోగుల్లో మరింత బాధ్యతాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ అవార్డులు అందుకున్న వారిలో ట్రైన్ మేనేజర్లు, లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, సీ అండ్ డబ్ల్యూ సిబ్బంది, టెక్నీషియన్లు, గేట్‌మెన్‌లు ఉన్నారు. రోలింగ్ స్టాక్, ట్రాక్‌సైడ్ పరికరాలు, ఓవర్ హెడ్ ఎలక్ట్రికల్ వ్యవస్థల్లో లోపాలను గుర్తించి రైల్వే భద్రతకు వారు విశేషంగా తోడ్పడ్డారు. అవార్డుల ప్రదాన కార్యక్రమంలో వాల్తేరు డివిజన్‌కు చెందిన సీనియర్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

## ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ తనిఖీ





విశాఖపట్నం, మే 19, ప్రభాతవార్త:

ఏపీఎస్ఆర్టీసీ విశాఖ రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు మంగళవారం ద్వారకా బస్ కాంప్లెక్స్‌ను తనిఖీ చేశారు. బస్సుల బయలుదేరు వేళలు, టాయిలెట్ సదుపాయాలు, మంచినీటి వసతి, ఫ్యాన్లు, బెంచీలు తదితర ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్ స్టేషన్లలో మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బస్ స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికుల మన్ననలు పొందేలా సేవలు అందించేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా ద్వారకా బస్ స్టేషన్‌లో స్వచ్ఛందంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించి ప్రయాణికులు, సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం కె. పద్మావతి, అసిస్టెంట్ మేనేజర్ ఎస్.ఎస్. నాయుడు, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

vsp11:vsp11.qxd 19-05-2026 22:34 Page 1






## తాగునీరు కల్పనకు చర్యలు ఎక్కడ? పారుగడ్డ నీరే శరణ్యమా?

### గిరిజనుల అష్టకష్టాలు వర్ణాతీతం



డుంబ్రిగూడ, మే 19, ప్రభాతవార్త: తాగునీటికై గిరిజనులు పడుతున్న అష్ట కష్టాలు వర్ణాతీతం. మండలంలోని హెడ్ క్వార్టర్ పోతంగి పంచాయతీ పరిధిలోనున్న కోసంగి పాత గ్రామం, మోడల్ కాలనీలలో తాగునీటి కై ఆయా గ్రామ గిరిజనులు కటకట లాడుతున్నారు. ఆ రెండు గ్రామాల్లో సుమారు 60 నుండి 70 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఎటువంటి తాగునీటి సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ప్రతి ఏడాది వేసవి సమి పిస్తే తాగునీరు అందక గ్రామ సమీపంలో గల పారుగడ్డలో ఇసుక గొయ్యిని తయారు చేసుకుని గో య్యిలో చేరిన చలమ నీరుని సేకరించి తాగునీరు అవసరానికి ఉపయోగించే పరిస్థితి ఏర్పడుతుందని ఆయా 2 గ్రామాల గిరి మహిళలు ఆవేదన చేస్తున్నారు. తమ గ్రామాల తాగునీటి సమస్యపై అనేకమార్లు పంచాయితీ మండల స్థాయి అధికారులకు వినతులు సమర్పిస్తున్నప్పటికీ పరిష్కార మార్గ చర్యలకు దాఖలాలు లేకపోవడం చాలా దారుణమని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ గ్రామాల్లో నెలకొంటున్న తాగునీటి సమస్యపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామ గిరి మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మెగా బాడీ బిల్డింగ్ షో



పాడేరు,మే19, ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మోద కొండమ్మ వారు 2026 జాతర పురస్కరించుకొని సుబ్బుస్ బాడీ కేర్ జిమ్ నుంచి మెగా బాడీ బిల్డింగ్ షో కార్యక్రమం సినిమా హాల్ స్టేజ్ వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు పల్సర్ బైక్ ఝాన్సీ, మాస్టర్ రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## దుచ్చరపాలెంలో వేరుశనగ విత్తనాల పంపిణీ



గూడెం కొత్తవీధి, మే 19, (ప్రభాత వార్త): మండలంలోని రింతాడ పంచాయతీ సచివాలయం 2 పరిధిలోని దుచ్చరపాలెం గ్రామంలో రైతులకు వేరుశనగ విత్తనాలను కూటమి నాయకుల ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు.రైతులు వేరుశనగ విత్తనాలను సద్వినియోగపరచుకోవాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ సింహాచలం తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మండల జనసేన పార్టీ అధ్యక్షులు కోయ్యం బాలరాజు,పీసా కమిటీ సభ్యులు గబులంగి గణేష్, భీమేశ్వర్,తెదేపా నాయకులు ఓంద్రంగి సత్యనారాయణ,జనసేన సోషల్ మీడియా ఇమాన్యుల్,సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ సింహాచలం,మాజీ వార్డ్ మెంబర్ జోగిపడాల్, రైతులు సోయితు, గుమ్మల రాంబాబు, బంగార్రాజు,సోమరాజు, వంతల గోపి,కంకిపాటి వెంకట్రావు పడాల్, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు పిసా చట్టాలపై పూర్తి అవగాహన అవసరం



గూడెం కొత్తవీధి,మే 19 (ప్రభాతవార్త): రింతాడ పంచాయతీ సచివాలయం-2లో సోమవారం పిసా గ్రామసభ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మండల పిసా పోరం కార్యదర్శి సభ్యుడు గబులంగి గణేష్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న పిసా చట్టాలు,గ్రామసభ హక్కులు,భూ బదలి చట్టాలపై ప్రతి గిరిజనుడు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామసభకు ఉన్న అధికారాలు,గిరిజన భూముల పరిరక్షణ, అడవి సంపద వినియోగం,స్థానిక వనరులపై గ్రామసభ నిర్ణయాధికారం వంటి అంశాలను వివరించారు. షెడ్యూల్ ప్రాంతాల్లో గ్రామసభకు ప్రత్యేక హక్కులు ఉన్నాయని, గ్రామ ప్రజల అనుమతి లేకుండా భూముల బదిలీలు,గనుల అనుమతులు,పెద్ద ప్రాజెక్టులు చేపట్టరాదని తెలిపారు.గ్రామ అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలు,మద్యం నియంత్రణ,సహజ వనరుల పరిరక్షణలో గ్రామసభ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అలాగే గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతి,ఆచారాలను రక్షించేందుకు పిసా చట్టం ఉపయోగపడుతుందని వివరించారు. పిసా ఉపాధ్యక్షులు సాగిన భీమేష్ పడాల్, ఉపాధ్యక్షుడు సిద్దు ఇమ్మానుయేల్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, జనసేన నాయకుడు కోటి బాబు,స్థానిక నాయకుడు జోగి దొర , తదితరులు పాల్గొన్నారు.

## అభినయ్ పై దాడి... చెలరేగిన రాజకీయ దుమారం..!

### - అల్లూరి జిల్లాలో తేదేపా,వైకాపా మధ్య సోషల్ మీడియా వేదికగా వార్




గూడెం కొత్తవీధి, మే 19 (ప్రభాత వార్త): అల్లూరి జిల్లాలో గూడెం కొత్త వీధి మండలంలోని అభినయ్‌పై జరిగిన దాడి రాజకీయ దుమారాన్ని రేపుతోంది.జీకే వీధి మండలం నీరుతోటపాలెంలో సోమవారం నటుడు, మత బోధకుడు, భరోసా పార్టీ అధ్యక్షుడైన అభినయ దర్శన్,అతని అనుచరులపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన అల్లూరి జిల్లాలో కలకలం రేపింది. బాధితుడు మత బోధకుడు కావడంతో తొలుత ఇది మత విద్వేషాలకు సంబంధించిన అంశంగా అందరూ భావించారు. అయితే బాధితులు అభినయ్. మీడియాతో మాట్లాడుతూ తనపై జరిగింది మతపరంగా కాదని రాజకీయ కుట్టలో భాగంగా దాడి చేశారని వెల్లడించారు. ఒక ఎమ్మెల్యే పేరు చెప్పి తనను బెదిరింపులకు దిగారని పేర్కొన్నారు. దీంతో దాడి ఘటన రాజకీయం వైపు మళ్ళింది. ఈ ఘటన పాడేరు ఎమ్మెల్యే చేయించారని టీడీపీ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. దీనికి దీటుగా టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తుందని, ఫేక్ అంటూ వైసీపీ తమ సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. ఇలా తెలుగుదేశం, వైకాపా నాయకులు పరస్పరం సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ రాజకీయ దుమారాన్ని రేపుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఈ అంశం తీవ్ర చర్చనీయాంశమైంది.

## మోదకొండమ్మను దర్శించుకున్న మంత్రి సంధ్యారాణి

### అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక పూజలు




పాడేరు,మే 19, ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని గిరిజన ఆరాధ్య దైవం శ్రీ మోదకొండమ్మ తల్లిని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రిగారికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆమె అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద పండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలకై ప్రార్థన. పూజా కార్యక్రమాల అనంతరం మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మీడియాతో మాట్లాడారు. గిరిజన ప్రాంత ప్రజల గుండెల్లో కొలువై ఉన్న మోదకొండమ్మ తల్లిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలు పొందేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి, మారుమూల గ్రామాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆమె పునరుద్ఘాటించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి తో పాటు జిల్లా కలెక్టర్నిషాంతి. టి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ శ్రీమోదకొండమ్మ వారిని దర్శించుకొని, అమ్మవారి ఆశీస్సులు పొందిన తర్వాత వారికి ఆలయ ప్రధాన అర్చకులు పసుపు, కుంకుమ,అక్షతలు అమ్మవారి జ్ఞాపకం అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాడేరు మాజీ శాసన సభ్యురాలు, ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు గిడ్డి ఈశ్వరి, జిల్లా అధికారులు, ఆలయ కమిటీ మెంబర్లు, స్థానిక కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## భక్తులకు మజ్జిగ, ప్రసాదం పంపిణీ




పాడేరు,మే19, ప్రభాతవార్త: మోద కొండమ్మ మావారి జాతర మహోత్సంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యాయి.అన్నసమారాధన కార్యక్రమంలో పాడేరు హిల్స్ అండ్ వనిత మొదమంబ వారి ఆధ్వర్యంలో మొదకొండమ్మ వారి పండుగకి విచ్చేసిన భక్తులకు మజ్జిగ అండ్ ప్రసాదం పంపిణీ జరిగింది. కార్యక్రమంలో అవష ఆఫీసర్ శ్రీనాథ్. శ్రీను అండ్ శ్రీనాధు. లిఖిత్, చరణ్, రాజా, చినరాజు పాల్గొన్నారు.

## భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ



పాడేరు,మే19, ప్రభాతవార్త: మోదకొండమ్మ అమ్మవారి 2026 జాతర పురస్కరించుకొని చివరి రోజున తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు చేతులమీదుగా ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం సినిమా హాల్ సెంటర్ వద్ద ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో అమరావతి గణేష్, నాయుడు, రామారావు, తెలుగు మహిళ కనకరత్నం, ఫాలో మీ బృందం, వాసవి రాము, వర్మ సత్తిబాబు, వర్తక వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎవరో చేసిన దాడికి నా మీద నిందలా?

### పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు

పాడేరు,మే19, ప్రభాతవార్త: పాస్టర్ అభినయ్ మీద నిన్న జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన పాడేరు శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఈ కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు కాపాడంలో పూర్తిగా విఫలమైంది, ప్రశాంతంగా ఉండే ఆదివాసి పల్లెల్లో ఇలాంటి హత్య రాజకీయాలు ఎప్పుడు లేదు, ఆ పాస్టర్ ఎవరనేది కూడా నాకు తెలియదు ఈరోజు పేపర్లో సోషల్ మీడియాలో వచ్చిన తర్వాతే అతను పేరు అభినవ్ పాస్టర్ అన్ని తెలిసింది అలాంటిది ఆయన మీద ఎవరో దుండగులు దాడి చేస్తే అది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మీద స్థానికంగ ఉన్న ఎమ్మెల్యే మీద సంబంధం ఉందని చెప్పడం ప్రభుత్వా తప్పుడు ప్రచారం చేయడానికి సిగ్గుగా లేదా అని మండిపడ్డారు. శాంతిభద్రతాలు కాపాడడంలో విఫలమైన ఈ ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు, వారి చేతకానితనానికి ఇదొక నిదర్శనం , రాష్ట్రంలో ఎక్కడ ఒక చిన్న సంఘటన జరిగిన కూడా అది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మీద అలాగే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మీద నాయకుల మీద రుద్దే కార్యక్రమం ఈ రాష్ట్రంలో జరుగుతుంది ,నిన్న +.ఎ.వీధిలో జరిగినటువంటి సంఘటన స్థానికంగా ఉన్నటువంటి శాసన సభ్యులు మీదకు నెట్టి ఆ నిందను సోషల్ మీడియాలో ప్రచారం చేయడమే బాధాకరం నిజాలు తెలుసుకొని నిజంగా దాడి చేసిన వాళ్ళని పట్టుకొని శిక్షించడం మానేసి సోషల్ మీడియాలో పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తుంది ఈ కూటమి ప్రభుత్వం వెంటనే దాడిలో ఎవరు పాల్గొన్న వారిని పట్టుకుని ప్రజల ముందు పెట్టి నిజాలు బయట చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం అలాగే సోషల్ మీడియాలో నిన్న నుంచి నా మీద ఎవరైతే తప్పుడు ప్రచారం చేస్తున్నారో వాళ్లను కూడా తప్పుడు ప్రచారం చేసినందుకు వారిని కూడా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## అనుపు ఉత్సవాల్లో ఆకట్టుకున్న ప్రదర్శనలు



పాడేరు,మే19, ప్రభాతవార్త: మోద కొండమ్మ అనుపు ఉత్సవాల్లో నేలవేషాలు, సాంస్కృతిక కళా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచాయి. అలాగే శ్రీ శక్తి వేషాలు, కేరళ మేళతాళాలు, నృత్యాలు,కాంతార వేషధారణ నృత్యాలు,పూణే దప్పువాయిద్యాలు, తాల్ మెన్ల ప్రదర్శన, గరగల నృత్య ప్రదర్శన, పాండా వేషధారణ, తదితర కళానృత్య ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.




## యండపల్లివలసలో వీధి సుబ్రహ్మణ్యం సంతాప సభ

### నివాళులర్పించిన చైర్మన్ దొన్ను దొర



అరకు రూరల్, మే 19, ప్రభాతవార్త : యండపల్లివలసలో మంగళవారం డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం సంతాప సభ ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్,తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో జరిగింది. దీనిలో భాగంగా డ్రైవర్ వీధి సుబ్రమణ్యంకు ఘన నివాళులు అర్పించారు అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి. వైసిపి ఎమ్మెల్సీ అనంత బాబును కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు వద్ద వీధి సుబ్రహ్మణ్యం డ్రైవర్ గా పనిచేస్తూ హత్యకు గురైన సంగతి విధేతమే. చైర్మన్ దొన్నుదొర మాట్లాడుతూ దళిత ద్రోహి అనంత బాబును కఠినంగా శిక్షించాలని అన్నారు. గత వైసిపి పాలనలో ఎమ్మెల్సీ అనంతబాబు దుర్మార్గపు చర్యకు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం బలి అయ్యారన్నారు. సుబ్రహ్మణ్యంను దారుణంగా హత్య చేసి డెడ్ బాడీని ఇంటి వద్ద పారవేయడం అత్యంత దారుణం అన్నారు. వైసీపీ నాయకుడు వైసీపీ పాలనలో ఎటువంటి నేరన్నైనా చేసి తప్పించుకోవచ్చునే దురాచనాలతో ఉండడం క్షమించాని దన్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేశాదానడానికి ఈ సంఘటనే ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చునని చెప్పారు. అదేవిధంగా గత వైసిపి ప్రభుత్వ పాలనలో ఎస్సీ. ఎస్టీలను చిత్ర హింసలకు గురి చేశారన్నారు. ఎస్సీ. ఎస్టీలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అనగదొక్కే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. కరోనా సమయంలో మాస్కులు అడిగిన డాక్టర్. సుధాకర్ ను చిత్రహింసలు చేసి ఆయన మరణానికి కూడా వైసిపి కారణమైనట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో అరకులోయ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మహదేవ్, డుంబ్రిగూడ మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరావు, నాగరాజు అరకులోయ నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి నాగరాజు, పద్మాపురం పంచాయతీ టీడీపీ సీనియర్ నాయకులు, శీలం తాతబాబు, ఎరుబంటి కన్నయ్య, వార్డు సభ్యులు శీలం కొండబాబు, సీనియర్ నాయకుడు చందు పాడి తదితరులు పాల్గొన్నారు.

## భరోసా పార్టీ అధ్యక్షుడిపై కిరాతక దాడిని ఖండించండి

### ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్



అరకులోయ, మే 19, ప్రభాత వార్త : ప్రశాంతమైన స్వచ్ఛమైన ఆదివాసీ ప్రాంతం చింతపల్లిలో భరోసా పార్థి అధ్యక్షులు అభినయన్ దర్శన్ పై గుర్తుతెలియని దుండగులు,ఉన్మాదులు అతికిరాతకంగా దారుణంగా మరణ ఆయుధాలతో కాపుగాసి దాడి చెయ్యడం దుర్మార్గమని, ఈ ఘటను ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, స్వచ్ఛమైన జీవనవిధానానికి విఘాతం కలిగించే విధంగా, ఏజెన్సీ ప్రాంతంలో ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిపై పట్టపగలు నడిరోడ్డుపై గుర్తు తెలియని దుండగులు, ఉన్మాదులు దాడి చేయడం ప్రభుత్వ వైఫల్యం. కత్తులు కర్రలతో కిరాతకంగా దాడి చెయ్యడం హేమమైన చర్యన్నారు. ఇది పథకం ప్రకారం జరిగిన హత్య యత్నమని, ఇటువంటి భౌతిక దాడుల ఏజెన్సీ ప్రాంతం లో అశాంతిని సృష్టిస్తుందని చెప్పారు. ఆదివాసీ ప్రజల్లో భయభ్రాంతులకు గురిచేస్తుందని అన్నారు. ఇటువంటి అరాచక సంస్కృతి ఏజెన్సీ ప్రాంతంలో లేదని, కొంతమంది వ్యక్తులు కావాలనే ఏజెన్సీ ప్రాంతంలో ఇటువంటి ఘటనకు కారణం అవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు, పాంగి నానిబాబు పాల్గొన్నారు.

## రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ధ్యాన శిక్షణ శిబిరం



అరకు రూరల్, మే 19, ప్రభాత వార్త : హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో అరకు లోయలో మూడు రోజుల పాటు "హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్" ధ్యాన శిక్షణ శిబిరం నిర్వహించారు. అరకులోయ పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ కళ్యాణ మండపంలో జరిగిన ఈ శిబిరంలో స్థానికులు పాల్గొని ధ్యాన సాధనపై అవగాహన పొందారు.శిబిరం ముగింపు సందర్భంగా ధ్యాన శిక్షకులు సిహెచ్ శివశంకర్ మాట్లాడుతూ; రామచంద్ర మిషన్ 1945లో ఉత్తరప్రదేశ్‌లో స్థాపించబడిందని తెలిపారు. ప్రస్తుతం సంస్థ అంతర్జాతీయ ప్రధాన కార్యాలయం హైదరాబాద్ సమీపంలోని కన్హా శాంతివనంలో ఉందని, అక్కడ ఒకేసారి లక్ష మంది ధ్యానం చేసే సౌకర్యం ఉందన్నారు. దేశంలోని అనేక ప్రధాన నగరాల్లో సంస్థకు శాఖలు ఉన్నాయని, అరకులోయ సమీపంలోని ఎండపల్లివలసలో కూడా 2025లో కార్యక్రమాలు ప్రారంభించినట్లు చెప్పారు. అరకు లోయ టౌన్‌కు చెందిన సుమారు 50 మంది ఈ మూడు రోజుల శిబిరంలో పాల్గొని ధ్యాన సాధనను నేర్చుకున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో మరిన్ని ధ్యాన శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.రామచంద్ర మిషన్ ఉచితంగా అందిస్తున్న ఈ ఆరోగ్యకరమైన ఆధ్యాత్మిక ధ్యాన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## దాబుగూడలో కామ్రేడ్ సుందరయ్య 41వ వర్ధంతి



అరకు రూరల్, మే 19, ప్రభాతవార్త: అరకులోయ మండలం దాబుగూడ గ్రామంలో కామ్రేడ్ సుందరయ్య 41 వ వర్ధంతి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు గెమ్మెలి చిన్నబాబు అధ్యక్షతన సుంకర మెట్ట పంచాయతీ దాబుగుడ లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా దాబుగుడ గ్రామస్తులకు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఉన్న ఖనిజాలు ఆదివాసుల హక్కుల చట్టాలు నిర్వీర్యం కాకుండా నిరంతరం కృషి చేస్తున్న ఎర్రజెండాతోనే ఆదివాసులకు రక్షణ ఉంటుందన్నారు . కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, పంచాయతీ నాయకులు చిట్టెం నాయక్, గురు మూర్తి, పాంగి. నాని బాబు, సిహెచ్ కెసిబో,కె.చిట్టిబాబు, దాబుగుడ గ్రామస్తులు కె.విజయ్, సన్యాసిరావు,బి.సుబ్బారావు .బి.సన్యసిరావు ,బి.ఆనంద్,కె.ఆనంద్ కుమార్,బి ప్రేమ్ కుమార్,బి.శ్రీను, బి.బాస్కరావు, డొంబు,బి.విజయలక్ష్మి,కె.శివ, బి రమేష్,బి.రూబి,బి.బుజ్జిబాబు,కె.శిరిష బి.కాజల్ ,బి.నందిని,బి.శాల్మి,బి.పూల్మ్,బి. లక్ష్మి, బి.లక్ష్మి,బి.లింగో, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో చల్లదన మహోత్సవం



అరకులోయ, మే 19, ప్రభాతవార్త : యండపల్లివలసలో వెలిసిన గంగమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం అమ్మవారి చల్లదన మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. యండపల్లివలస గ్రామంలో రెండు సంవత్సరాలకి ఒకసారి అమ్మవారి పండగ అంగరంగ వైభవంగా జరుగుతుంది. దీనిలో భాగంగా ఒక ఏడాది చల్లదనం మహోత్సవమును, మరో ఏడాది అమ్మవారి పండగను ఆలయ ఉత్సవ కమిటీలు ఘనంగా నిర్వహిస్తూ ఉంటాయి. చల్లదన మహోత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయంకు చేరుకొని చల్లదనం కింద పసుపు కుంకుమను సమర్పించారు. కాగా గ్రామంలో ఉన్న శతకం పట్టు నుండి ఘటాలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వచ్చాయి .

## జన భాగిదారి అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



అరకు రూరల్, మే 19, ప్రభాతవార్త : అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధిలోని పీఎం జన్మన్ మరియు డి.ఏ. జుగా గ్రామాలలో మే 18 నుండి 25 వరకు నిర్వహించనున్న "జన భాగిదారి అభియాన్ -- సబ్సే దూర్, సబ్సే పహలే" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ , అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఆదిత్య వర్మ ఆదేశించారు.

## ఘనంగా ముగిసిన మోదకొండమ్మ జాతర

### భక్తుల కోలాహలం నడుమ సాగిన ఊరేగింపు




జాతరలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పిఓ, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు.

పాడేరు,మే19, ప్రభాతవార్త: మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తుల కోలాహలం నడుమ ఘనంగా ముగిసింది.సతకంట్టులో కొలువుదీరి ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహానికి,పాదాలకు,తల్లి ఘటానికి జిల్లా కలెక్టర్ నిశాంతి,ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు,ఉత్సవ కమిటీ అధ్యక్షులు గిడ్డి ఈశ్వరి,జేసి శ్రీ పూజ,పీఓ ఆదిత్య వర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి డప్పు వాయిద్యాల నడుమ శిరస్సుపై పెట్టుకుని బయటకు తీసుకు వచ్చి పాడేరు పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ఊరేగింపు కార్యక్రమం భక్తజన సందోహాన్ని విశేషంగా ఆకట్టుకుంది.?ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ,జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, పాడేరు శాసనసభ్యులు ఆలయ కమిటీ అధ్యక్షులు మత్స్య రాస విశ్వేశ్వర రాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరిలు ముఖ్య అతిథులుగా పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి . ఉత్సవ విగ్రహం, అమ్మవారి పాదాలు, ఘట్టాలతో పురవీధులలో వివిధ కళాకారుల నృత్యాలతో, డప్పు వైద్యాలతో, కళ కారులతో ఊరేగింపు పొడవునా ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంప్రదాయ కళారూపాల ప్రదర్శనలు, నృత్యాలు భక్తులలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి. కోలాటాలు, భజనల , నయనానందకరంగా సాగింది.అమ్మవారి ఉత్సవ విగ్రహానికి,పాదాలకు,తల్లి ఘటానికి ఎత్తుకోవడానికి భక్తులు పోటీ పడ్డారు.అమ్మవారి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఘటాలను ఎత్తుకుంటూ అమ్మవారిని దర్శించుకోవడానికి డప్పు వాయిద్యాల తో ఆలయం వద్దకు భక్తులు చేరుకుని మొక్కులను తీర్చుకున్నారు.భక్తులు తీసుకు వచ్చిన ఘటాలను ఆలయం వద్ద విడిచిపెట్టి భక్తులు వెళ్ళారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, ఆలయ కమిటీ, మరియు పోలీస్ అధికారులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.




## స్పోర్ట్స్ ఆథారిటి హాస్టల్‌కు ఎంపికైన నక్కపల్లి హాకీ క్రీడాకారులు



(నక్కపల్లి రూరల్/ అడ్డురోడ్డు, ప్రభాతవార్త)

స్పోర్ట్స్ ఆథారిటి ఆఫ్ ఇండియా హాస్టల్‌లకు నక్కపల్లి హాకీ క్రీడాకారులు ముగ్గురు విద్యార్థులు ఎంపికయినట్టు హాకీ శాప్ కోచ్ గాజుల రాంబాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శాప్, హాకీ టర్ఫ్ క్రీడా ప్రాంగణంలో తర్ఫీదు పొందుతున్న మనబాల దిలీప్ కుమార్, గత నెలలో ఏప్రిల్ 25 న కేరళ రాష్ట్రం కొల్లాంలో, ఆకేటి దేవేంద్ర వెంకట్ మార్చి 24న హైదరాబాద్‌లో, నాగన బోయిన మణికంఠ పీబ్రవరి 11 న బెంగళూరులో జరిగిన ఎంపికల్లో మంచి ప్రతిభ కనబర్చడంతో ఈ ముగ్గురు క్రీడాకారులు స్పోర్ట్స్ ఆథారిటి హాస్టల్‌లకు ఎంపిక అయ్యారని ఈ సందర్భంగా తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను హోం మంత్రి వంగలపూడి అనిత,జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జిల్లా స్పోర్ట్స్ అధికారిణి పూజారి శైలజ, గ్రామ పెద్దలు, బిఎస్ హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, వెట్రన్ జాతీయ క్రీడాకారుడు గాజుల రామచంద్ర రావు,కార్యదర్శి కొల్నాటి తాతాజీ, రంజిత్, కె. నానాజీ తోపాటు తల్లిదండ్రులు అభినందించారు.

## తోట నగేష్ నివాసానికి ఐడిఎఫ్‌సి చైర్మన్ గోవిందప్ప

పాయకరావుపేట, ప్రభాతవార్త



జిల్లా మాజీ గ్రంథాల సంస్థ చైర్మన్ రాష్ట్ర జనసేన పార్టీ నాయకులు తోట నగేష్ పాయకరావుపేట బృందావనంలో ఉన్న ఇంటికి ఇండియా ఫెడరేషన్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ చైర్మన్ గోవిందప్ప (ఐడిఎఫ్సి) వచ్చారు. ఈ సందర్భంగా గోవిందప్పకు తోట నగేష్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో పలు విషయాలు మాట్లాడిన నగేష్ గోవిందప్పను ఘనంగా సత్కరించారు. పాయకరావుపేట నియోజకవర్గానికి రావడం ఎంత సంతోషంగా ఉందని స్నేహితుడు నగేష్ కలవడం మరింత ఆనందంగా ఉందని చైర్మన్ గోవిందప్ప అన్నారు.

## నిద్రమత్తు వదలండి వాహనాలు నడపండి

### కసింకోట సీఐ అల్లు స్వామి నాయుడు

కసింకోట, మే 19, ప్రభాతవార్త



నిద్రమత్తు వదిలి వాహనాలను నడపాలని కసింకోట సీఐ అల్లు స్వామి నాయుడు లారీ డ్రైవర్లకు సూచించారు. సోమవారం అర్ధరాత్రి తాళ్లపాలెం కూడలిలో లారీలను ఆపి డ్రైవర్లకు నీరు ఇచ్చి ముఖం కడిగించి బయలుదేరించారు. ఈ సందర్భంగా సిఐ స్వామి నాయుడు లారీ డ్రైవర్లతో మాట్లాడుతూ రాత్రి వేళలో అప్రమత్తంగా వాహనాలను నడపాలన్నారు. డ్రైవర్లకు నిద్ర వస్తే కొంతసేపు వాహనాలను ఆపి విశ్రాంతి తీసుకొని వాహనాలను నడపాలని సూచించారు. ఈయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

## నిత్యావసర సరుకులు రేషన్ కార్డులు వున్న అందరికీ పంపిణీ చేయాలి

నక్కపల్లి, ప్రభాతవార్త



మండలంలోని రాజయ్యపేట గ్రామంలో రేషన్ కార్డులు ఉన్న వాళ్ళందరికీ నిత్యవసర సరుకులు వేట నిషేధిత సమయంలో అందజేయాలని ఒప్పందం ప్రకారం ఔషధ పరిశ్రమ యజమాను లు చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన పార్టీ నాయకుడు పిక్కి స్వామి ఆధ్వర్యంలో పలువురు మత్స్యకారులు ఉప తాసిల్దార్ నారాయణరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం స్వీకరించిన ఉప తాసిల్దార్ నారాయణరావు పూర్తి స్థాయిలో పరిశీలించి జిల్లా అధికారుల ఆదేశాల వారికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామి తోపాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎరుపల్లి నగేష్ లతోపాటు పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ సుమారు నాలుగు సంవత్సరాల క్రితం హెటీరో కంపెనీపై ధర్నా చేయడం జరిగిందని. ఆ ధర్నాలో ఒప్పందల ప్రకారం ప్రతి సంవత్సరం ఇచ్చే నిత్యవసర సరుకులు ఇవ్వకపోవడంతో హోం మంత్రి వర్యులు వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లడం వలన కంపెనీతో, జిల్లా కలెక్టర్ మాట్లాడి గ్రామానికి రావలసిన నిత్యవసర సరుకులు వెంటనే ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. వారి మాటకు స్పందించిన వెంటనే కంపెనీ రెండు మూడు రోజుల నుంచి నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నారు అని చెప్పారు. ఈ మేరకు 2600 కార్డులు కు 2400 ఇవ్వగా మిగతా 200 రైస్ కార్డులకు ఇవ్వాలని స్వామి కోరారు. ఈ కార్యక్రమంలో చొక్కా కాశి ,కారే వెంకటేష్, పీక్కి కాశి, జామి, అప్పలరాజు, పీక్కి అప్పలరాజు, గంగిరి రాజు, వాసపల్లి గుర్రయ్య, వాసపల్లి అప్పలరాజు, కందాల నూకరాజు ,కుందేటి శ్రీను, ఎజ్జల కోటయ్య, అర్జిల్లి మాధవ, పీక్కి కోటి ,పీక్క కోర్లయ, మద్దు కనకరాజు, మద్దు జోగిరాజు, మద్దు జగన్నాథం, మద్దు తాతలు, బొగడ వెంకన్న ,మద్దు బంగారి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిరివెన్నెల శృతి వనం పార్కు నిర్మాణానికి శంకుస్థాపన

అనకాపల్లి, మే 19, ప్రభాతవార్త

అనకాపల్లిలో జన్మించి అనకాపల్లి ప్రాంతానికి ఎనలేని గౌరవాన్ని తీసుకువచ్చిన స్వర్గీయ సిరివెన్నెల సీతారామశాస్త్రి 71వ జయంతిని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక గాంధీ నగరం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఎదురుగా గల సిరివెన్నెల ప్రాగణంలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ కృషి మేరకు 39.70 లక్షలు జీవీఎంసీ నిధులతో నూతనముగా నిర్మించబోతున్న సిరివెన్నెల శృతి వనం పార్కునకు శంకుస్థాపన జరగనుంది. ముఖ్యఅతిథిగా శాసనమండలి సభ్యులు కొణిదెల నాగబాబు విచ్చేసి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 5 గంటలకు నూకాంబిక అమ్మవారి దేవస్థానం దరి, సత్యా గ్రాండ్ ఏసీ ఫంక్షన్ హాల్ నందు సిరివెన్నెల గీతాల సంగీత విభావరి, ప్రముఖ సినీ గేయ రచయిత భాస్కర భట్ల రవికుమార్‌కి సిరివెన్నెల స్మారక పురస్కారం అవార్డు ప్రధానం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య ముఖ్యఅతిథులుగా శాసనమండలి సభ్యులు కొణిదెల నాగబాబు, లావు అంజయ్య చౌదరి విచ్చేయుచున్నారు.

## నర్సీపట్నం మున్సిపాలిటీ వార్డుల విభజనపై వివరాలు ఇవ్వాలని వైసీపీ వినతి

నర్సీపట్నం,మే 19,ప్రభాతవార్త



నర్సీపట్నం మున్సిపాలిటీలో వార్డుల విభజనకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించాలని వైసీపీ నాయకులు మంగళ వారం ఆర్డీవో వివి.రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 18న వార్డుల విభజన ముసాయిదా విడుదల చేసినట్లు ప్రకటన వెలువడిందని, అయితే ప్రతి వార్డులో ఉన్న ఓటర్ల సంఖ్య, వార్డు పరిధి వంటి కీలక వివరాలు స్పష్టంగా తెలియజేయలేదని వారు పేర్కొన్నారు. వార్డుల పునర్విభజన ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించలేదని, అలాగే ఓటర్ల అభిప్రాయ సేకరణ కూడా జరగలేదని ఆరోపించారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వార్డు మ్యాపింగ్ను బహిరంగ ప్రదేశాల్లో, సచివాలయాల వద్ద ప్రదర్శించాలని, అలాగే వార్డుల స్వరూపం, ఓటర్ల సంఖ్యపై ప్రజలకు అవగాహన కల్పించాలని వారు కోరారు. అంతేకాకుండా ప్రతి వార్డులో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి పూర్తి వివరాలు వెల్లడించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ వైసీపీ అధ్యక్షుడు ఏకా శివ, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మాజీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లి దొర తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకార గ్రామాల్లో ఆనందం

నక్కపల్లి, ప్రభాతవార్త



వేట నిషేధిత సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఇచ్చే భృతిలో భాగంగా వారి వారి ఖాతాల్లోకి 20000 రూపాయలు నమోదైన సందర్భంగా మండలంలోని మత్స్యకారుల గ్రామాల్లో ఆనంద వ్యక్తం చేశారు. పెద్ద తీనార్ల ఎంపీటీసీ మెరుగు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మత్స్యకార సేవలో 20000 అకౌంట్ లో పడిన ఆనందాన్ని గ్రామాల్లో వ్యక్తపరుస్తూ మత్స్యకారులు పెద్ద తీనార్ల గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి లోకేష్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు, జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత లకు పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కప్పిశెట్టి వెంకటేష్, మండల టిడిపి అధ్యక్షులు గింజల లక్ష్మణరావుల నాయకత్వంలో కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం

నర్సీపట్నం,మే 19,ప్రభాతవార్త



నర్సీపట్నం శాఖ గ్రంథాల యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారి పీ.దమ యంతి ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం విద్యార్థులకు కొంతసేపు మాస్ రీడింగ్ చేయించారు. అనంతరం చదరంగం కొంత సేపు ఆడించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పీ.ప్రభాకర్ విద్యార్థుల ఆటతీరును గమనిస్తూ, చేసిన తప్పులను సరిదిద్దారు. ఈ వేసవి శిక్షణ కాలంలో విద్యార్థులంతా చక్కగా చదరంగం నేర్చుకోవాలని చెప్పారు. యోగా శిక్షకుడు పీ. రాజుబాబు విద్యార్థులకు ప్రాణాయామం ప్రాముఖ్యతను వివరించి, ఎలా చేయాలో చేసి చూపించి విద్యార్థుల చేత చేయించారు. ప్రాణాయామం చేయడం వలన మన ఊపిరితిత్తులను చక్కగా కాపాడుకోవచ్చునన్నారు. అలాగే ప్రభాకర్ కొంతసేపు విద్యార్థుల చేత తెలుగు కథలు చదివించి తప్పులను సరిదిద్దారు. మన మాతృభాషను తప్పులు లేకుండా చదవాలని విద్యార్థులకు సూచించారు. బలిఘట్టం ఉన్నత పాఠశాల క్రాఫ్ట్ ఉపాధ్యాయిని రాజేశ్వరి ఇంటిలో అలంకరణకు ఉపయోగపడే కాగితపు పువ్వులను చేయించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున మంచి నీరు, మజ్జిగ తాగాలని గ్రంథాలయాధికారిని విద్యార్థులకు సూచించారు.

## ట్రాఫిక్ నిబంధనలపై పండ్ల వ్యాపారులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ

ఎలమంచిలి, మే 19, ప్రభాతవార్త:



రహదారులపై ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించేందుకు మంగళ వారం స్థానిక పండ్ల వ్యాపారులతో అవగాహన సమావేశం ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ నిర్వహించారు. పండ్ల బండ్లు, దుకాణాల వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా, నిర్దేశించిన స్థలాల లోనే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. వినియోగదారులు వాహనాలను రోడ్డుపై కాకుండా పార్కింగ్ చేసేలా చూడాలని, కాలినడకన వెళ్లే వారి కోసం స్థలాన్ని ఉంచాలని కోరారు. రోడ్లపై పండ్ల వ్యర్థాలు వేయడం వల్ల ద్విచక్ర వాహనాలు జారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున పరిశుభ్రత పాటించాల న్నారు. ప్రజా రక్షణ కోసం వ్యాపారస్తులంతా ట్రాఫిక్ నిబంధనలకు సహకరించాలని ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

### ఇంటింటి ప్రచారంలో విద్యాశాఖ అధికారుల అవగాహన

బుచ్చయ్యపేట, మే 19 ప్రభాతవార్త



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులను ఉచితంగా అందిస్తున్నామని రాష్ట్ర విద్యా సమీక్ష కేంద్రం అనకాపల్లి జిల్లా పరిశీలకులు ఏసు బాబు పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఎంఈఓలు గీత, కాశీలతో కలిసి దిబిడి గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న విద్యా విధానాలు, సౌకర్యాల గురించి వివరించారు. విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నామని, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, యూనిఫార్ములు, పాఠ్యపుస్తకాలు వంటి సదుపాయాలు పూర్తిగా ఉచితంగా కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యపై నమ్మకం ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆధునిక సాగుతో అధిక లాభాలు సాధించాలి

### రైతు సదస్సులో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త ముకుందరావు పిలుపు

బుచ్చయ్యపేట, మే 19 ప్రభాతవార్త



రైతులు సంప్రదాయ వ్యవసాయ విధానాలకు తోడు ఆధునిక సాగు పద్ధతులపై ఆసక్తి చూపాలని ఆర్ఏఆర్ ఎస్ అనకాపల్లి శాస్త్రవేత్త సిహెచ్ ముకుందరావు సూచించారు. మంగళ వారం కొండపాలెంలో కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.వ్యవసాయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులతో పాటు మంచి లాభాలు పొందవచ్చున్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం అందించే పంటల సాగు, సమగ్ర పోషక నిర్వహణ, పురుగుల నియంత్రణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ విద్యార్థులు రైతులకు ఉపయోగపడే పలు ప్రాజెక్టులను వివరించి, ఆధునిక యంత్రాల వినియోగం, నీటి సంరక్షణ పద్ధతులపై సూచనలు అందించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రాజకుమార్, సత్తిబాబు, కిషోర్ పాల్గొని రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. రైతులు హాజరై సదస్సును విజయవంతం చేశారు.

## రాజయ్య పేటలో జాతీయ గ్రామీణ ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేయండి

### ఇన్చార్జి ఎంపీడీవోకు వినతి

నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త



మండలంలోని రాజయ్యపేట పంచాయతీ లో జాతీయ గ్రామీణ ఉపాధి పనుల్లో అక్రమంగా జరుగు తున్న ఆన్లైన్ నమోదు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతూ జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి బుజ్జితో పాటు పలువురు నాయకులు ఇన్చార్జి ఎండిఓ దెందుకూరు సీతా రామరాజుకు మంగళవారం వినతిపత్రం చేశారు. ఈ సందర్భంగా బుజ్జి ఇన్చార్జ్ ఎంపీడీవో సీతారామరాజు దృష్టికి జరిగిన విషయాలను తెలియజేశారు. వినతి పత్రంలో 70 గ్రూపులు ఉన్నాయి. ఆ గ్రూపుల్లో 70 మంది మేట్లు ఉన్నారు.. రాజయ్యపేట గ్రామ వీఆర్పీ అయినా మైలపల్లి సత్య నారాయణ గ్రామస్తులు కాకుండా ఇతర ప్రాంతాల ఉండే వ్యక్తులకు మేట్లు ద్వారా మస్టర్లు వేస్తున్నట్టు గ్రామస్తులు చెప్తున ద్వారా ఆన్లైన్లో జూమ్ కాల్ ద్వారా మస్టర్లు వేస్తున్నట్టు గ్రామస్తులు గ్రహించారు. గ్రామంలో ఉండే 1400 మంది గ్రామీణ శ్రామికులకు పనిలేదని చెప్పి బోయపాడులో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారికి జూమ్ కాల్ లో మస్టర్లు వేయడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు వాపోతున్నారు. ఇలా ఆన్లైన్లో మోసాలు చేసిన వారిని వెంటనే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అందజేసిన వినతిపత్రంలో డిమాండ్ చేశారు. సీతారామరాజు లను కలిసిన వారిలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొంది గురన్న, గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు(బుజ్జి), పిక్కి చిన్నారి, పిక్కి కిరణ్ ,బొందలపు అప్పలరాజు, పిక్కి కోటేశ్వరరావు, మైలిపల్లి రాము, ఏరిపల్లి అమ్మోరియా, పిక్కి రమణ, పిక్కి కాశిరావు, తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్ పనులు పరిశీలన

నక్కపల్లి,ప్రభాతవార్త




మండలంలోని పెద్ద బోధిగల్లు కాగిత గ్రామాల్లో మంగళవారం ఉదయం శానిటేషన్ పనులను ఇన్చార్జి ఎంపీడీవో దెందుకూరు సీతారామ రాజు పరిశీలించారు. గ్రామాల్లో పచ్చదనం –పరిశుభ్రతకు నిదర్శనం గా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఆ విధంగా కనిపించాలంటే ఇళ్ల మధ్య చెత్త ఉండకుండా చెత్త సంపద కేంద్రానికి తరలించే విధంగా చర్యలు చేపట్టాలని ఇంటింటికి తెలియజేశారు. ఇళ్లల్లో పాడైన ప్లాస్టిక్ సామాన్లను విక్రయించే కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునిషా బేగం తో పాటు కార్యదర్శి చిన్నమనాయుడు తదితరులు ఉన్నారు.



## జాబ్ మేళాకు స్పందన

నక్కపల్లి,ప్రభాతవార్త




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పాయకరావుపేట నియోజక వర్గ పరిధిలోని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో నక్కపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్య క్రమానికి విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళా ను నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు సుమారు 15 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనగ, 2000 ఖాళీలు ఉన్నాయి అని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత వినయోగించుకోవాలని తెలిపారు. ఈ జాబ్ మేళాకు 105 మంది నిరుద్యోగ యువత పాల్గొన 55 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వి. శ్రీలక్ష్మి, నక్కపల్లి మండలం టీడీపీ పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, అనకాపల్లి జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ పి. శ్రీనివాసరావు, వివిధ కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## జలధార-జలహారతి కార్యక్రమంలో భాగస్వాములు కండి

### ఇంచార్జ్ ఎంపీడీవో దెందుకూరి

నక్కపల్లి /అడ్డురోడ్డు, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార– జలహారతి కార్యక్ర మంలో భాగంగా జల వనరుల శాఖ పరిధిలోనున్న గొలుసుకట్టు చెరువులు వాటి ఫీడర్ కాలువ 1200 మీటర్ల పొడవున పూడిక తీసి వాటికి మరల పూర్వ వైభవాన్ని తీసుకురావాలనే మంచి ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టి వాటి కింద ఉన్న కాలువలను పూర్తిస్థాయిలో పూడిక తీసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని నక్కపల్లి మండలం ఇంచార్జ్ ఎంపీడీవో దెందుకూరి సీతారామరాజు ఉపాధి కూలీలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నక్కపల్లి మండలం లోని కాగిత గ్రామానికి చెందిన రాయపు రాజు చెరువు ఈ చెరువు యొక్క విస్తీర్ణం 49 ఎకరాల 50 సెంట్లు గా కలదు ఈ చెరువు కింద ఉన్న ఆయికట్టు భూమి 120 ఎకరాలు ఈ చెరువు సుమారు 9 లక్షల రూపాయల వ్యయంతో మూడువేల క్యూబిక్ మీటర్ల పూడిక మట్టిని తొలగించడం జరుగుతుందని ఈ మట్టితో గట్లను పటిష్ట పరచడం జరుగుతుందని ఇది భవిష్యత్తులో ఆయకట్టు రైతులకు ఎంత ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఆయకట్టు చివరి భూమి వరకు కూడా నీరు అందుతుందని, నీటి నిల్వ సామర్థ్యం పెరిగి పంట పొలాలకు ఉపయోగంగా ఉంటుందని, గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ వారి లెక్కల ప్రకారం నక్కపల్లి మండలం యొక్క గ్రౌండ్ వాటర్ లెవెల్ 6 మీటర్లుగా ఉందని ఈ గొలుసు కొట్టు చెరువులు పూడిక తీయడం వలన పంట పొలాలకు నిరంతడమే కాక భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని ఆయన కూలీలకు వివరించారు. రైతులకు ఈ జలధార –జలహారతి పథకం మంచి వరం లాంటిదని రైతులు అందరూ ఈ పథకాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. పనులు చేసేటప్పుడు వృద్ధులతో సహా ప్రతి ఒక్కరు చాలా బాధ్యత తీసుకోవాలని ఉదయాన్నే ఐదు గంటలకు వచ్చి ఎండ ముదరకముందే పనులు పూర్తి చేసుకొని ఇళ్లకు చేరుకోవాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చెరువుల అభివృద్ధిలో భాగంగా దాతలు సహకారం కోరుతున్నామని, దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధి వేతనదారులు, ఉపాధి సిబ్బంది ,ఏపీఓ భాగ్యలత పాల్గొన్నారు.

## సుందరయ్య కాలనీలో ఉచిత వైద్య శిబిరం

గాజువాక,మే 19,ప్రభాతవార్త



71వ వార్డు సుందరయ్య కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో 'ప్రధానమంత్రి ముక్తభారత్ అభియాన్ 2.0' కింద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర పరిశీలకులు, వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 75 మంది స్థానికులకు బీపీ, హార్ట్ ఎక్స్–రే, టీబీ, హెచ్ఐవీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పప్పు రాజారావు మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ప్రతి వార్డులోనూ ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అధునాతన టెక్నాలజీతో ప్రారంభ దశలోనే టీబీ, గుండె జబ్బులను గుర్తించి నివారించవచ్చని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభించే ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీబీ ల్యాబ్ సూపర్వైజర్ ఎం. శ్రీనివాస్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోరికన చంద్రరావు, వానపల్లి జగ్గారావు, ఎ.ఈశ్వరరావు, భూలోకేశ్వరి, లావణ్య, త్రివేణి, వి.గున్నమ్మ, కాండ్రేగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలు

### -క్రీడా విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే గణబాబు

గాజువాక,మే 19,ప్రభాతవార్త



జీవీఎంసీ 62వ వార్డు అల్లూరి సీతారామరాజు కాలనీలో శ్రీశ్రీశ్రీ పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్స వాలు మూడు రోజుల పాటు వైభవంగా జరిగాయి. గ్రామ కమిటీ, యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుండి 19 వరకు జరిగిన ఈ ఉత్సవాల్లో భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పండగ సందర్భంగా యువతకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ శాసనసభ్యులు పి.జి.వి.ఆర్ నాయుడు (గణబాబు) విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా యువతను ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే మైదానంలో కాసేపు క్రికెట్ ఆడి సందడి చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు మజ్జి మాలి నాయుడు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు చెక్..

### గుడ్డ సంచుల వినియోగానికి ప్రాధాన్యం

విశాఖపట్నం, మే 19, ప్రభాతవార్త



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, గుడ్డ సంచుల వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని జీవీఎంసీ సిఎంఓహెచ్ డాక్టర్ ఈ.ఎన్.వి. నరేష్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎంవీపీ రైతుబజార్‌లో నిర్వహించిన "క్లాత్ బ్యాగ్ వినియోగిద్దాం" అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని వినియోగదారులు, వ్యాపారులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2025–26లో విశాఖ నగరం ప్రథమ స్థానం సాధించేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. ప్లాస్టిక్ రహిత విశాఖ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓహెచ్ బి. ప్రసాదరావు, శానిటరీ సూపర్వైజర్ సత్యనారాయణ, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

20skl13:20skl13.qxd 19-05-2026 21:57 Page 1



## ఘనంగా గోదావరి పోలమ్మ తల్లి పండుగ



సంతబొమ్మాళి, మే 19 ప్రభాతవార్త : కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తులు పాలిట కొంగు బంగారమై వెలసిన శ్రీ గోదావరి పోలమ్మ తల్లి పండగ మండల కేంద్రం సంతబొమ్మాళిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఇదే నెలలో ఒక రోజు జరిపే ఈ పండగ భక్తులు అత్యంత భక్తి శ్రద్దలతో జరిపిస్తారు. గోదావరి పోలమ్మ తల్లి ఆలయంలో భక్తులు ఉదయం నుంచి అమ్మవారికి ముర్రాటలు సమర్పించి వారి మొక్కలు తీర్చుకున్నారు. అలాగే సాయంత్రం వేళ గ్రామ దేవతను పుర వీధులలో గుగ్గిళంతో డప్పులు, తప్పెటగుళ్ళు, కోయి డాన్సులు మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తరలి వెళ్లి అమ్మవారి ఆలయం సన్నిధికి చేరుకున్నారు. ఈ ఊరేగింపులో అమ్మవారిని మహిళలు ముర్రటలతో పాదాలు కడిగి కొంగు పరచి దారి పొడవునా చల్లదనం అందించారు. ఈ పండగలో అమ్మవారు వెంట చిన్న పెద్ద తారతమ్యం లేకుండా గ్రామస్తులు అంతా సంఘటింగా తరలి వెళ్లడం విశేషం. ఇలా ఊరేగింపు అనంతరం గోదావరి పోలమ్మ ఆలయం వద్ద భక్తులు ముర్రటాలతో అమ్మవారి మొక్కలు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పెద్దలు, యువతి యువకులు, మహిళలు ఎక్కువ మంది పాల్గొన్నారు.

## దోమతెరల వాడకంపై అవగాహన



సీతంపేట, మే 19 ప్రభాతవార్త : సీతంపేట మన్యంలో దోమతెరలు వాడకంపై మలేరియా జోనల్ అధికారి డాక్టర్ బి.ప్రభావతి అవగాహన కల్పించారు. మంగళవారం సీతంపేట మండలంలో మలేరియా జ్వరాలు ఏ మేరకు ఉన్నాయి వాటిని నియంత్రణకు ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను ఆమె పరిశీలించారు. దీనిలో భాగంగా ఏరియా ఆసుపత్రి, దోనుభాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని చిన్న పిల్లల పురుషుల మహిళల వార్డులను సందర్శించి మలేరియా కేసుల గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. మలేరియా జ్వరాలకు సంబంధించి పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బి.తిరుపతిరావు. కె.విజయపార్వతి. డాక్టర్ శివ శంకర్, ఎల్.శ్రీకాంత్, సబ్ యూనిట్ అధికారి జె.మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## టిహెచ్‌సీ కిట్లతో గంజాయి తాగే వారి ఆటకట్టు




సీతంపేట, మే 19 ప్రభాతవార్త : గంజాయి తాగే వారిని నివారించడానికి పోలీస్ శాఖ తీసుకువచ్చిన వినూత్నమైన టిహెచ్‌సి కిట్ల ద్వారా గంజాయి తాగే వారి గుర్తించి వారిపై కేసులను నమోదు చేయడం జరుగుతుందని సీతంపేట ఎస్సై వై.అమ్మన్నారావు తెలిపారు. గంజాయి తాగుతున్న అనుమానిత వ్యక్తులను ఈ కిట్‌లో మనిషి మూత్రం రెండు చుక్కలు వేస్తే ఆ వ్యక్తి గంజాయి తాగాడో లేదో అనే విషయాన్ని సులువుగా గుర్తించవచ్చన్నారు. ఎరుపు రంగు గీత పైభాగం వైపు వస్తే నెగటివ్ అని, కింది భాగం వైపు వెళ్తే పాజిటివ్ అని గుర్తిస్తామన్నారు. ఇకనుంచి ప్రతిరోజు గంజాయి తాగే వారిని గుర్తించేందుకు తనిఖీలు చేపడతామన్నారు. ఎవరైనా గంజాయి తాగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## నాణ్యమైన వస్తువులే కొనుగోలు చేయాలి : ఐటీడీఏ ఏపీవో



సీతంపేట, మే 19 ప్రభాతవార్త : నాణ్యమైన వస్తువులే కొనుగోలు చేయాలని ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు స్పష్టం చేశారు. మంగళవారం ఐటిడిఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులు నాణ్యత ప్రమాణాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రజలు కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై ఐఎస్ఐ మార్కు ఉందా లేదా అని పరిశీలించుకుని కొనుగోలు చేయాలని అన్నారు. అదే విధంగా ఐఎస్ఐ మార్కు ఉన్న వస్తువులని చెబుతూ నకిలీ వస్తువులు అమ్మిన వారిపై ఫిర్యాదు చేయాలని అన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ టి.అర్జున్, డి సి ఐ ఎస్ ఇన్‌చార్జ్ పి.నాగమణి, వెలుగు డిపిఎం ఆర్.వి.రమణ, లావణ్య, ఊర్మిళ, తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు తీర్మానాల రూపకల్పన కీలక సమావేశంలో కూన



ఆమదాలవలస, మే 19 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ మహానాడుకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా పలు తీర్మానాల రూపకల్పనపై కీలక సమావేశం మంగళవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. మాజీమంత్రి యనమల రామకృష్ణుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పలువురు టీడీపీ నేతలు హాజరై వివిధ తీర్మానాలపై చర్చించారు. ఈనెల 27,28 తేదీల్లో నిర్వహించనున్న టీడీపీ మహానాడులో ప్రవేశపెట్టే తీర్మానాలను కమిటీ సిద్ధం చేసింది. సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రి సవిత, ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు, మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యే కూన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై మహానాడులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.

## సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



పాతపట్నం, మే 19 ప్రభాతవార్త : స్థానిక రైతు సేవా కేంద్రాల పరిధిలోని పాతపట్నం రైతులకు కూటమి నాయకులు చేతుల మీదుగా పచ్చిరొట్ట విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని 18 రైతు సేవా కేంద్రాల పరిధిలో 12 క్వింటాళ్లు జీలుగ,7.5 క్వింటాళ్లు కట్టె జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లుగా మండల వ్యవసాయ శాఖ అధికారి కె.సింహాచలం తెలిపారు. అదే విధంగా 10 కేజీల జీలుగ పూర్తి ధర 1600 కాగా సబ్సిడీ రూ.800 పోను రైతు రూ.800లు చెల్లించుకోవాలని, 10 కేజీల కట్టె జనుము ధర రూ.1540లు కాగా సబ్సిడీ రూ.770 పోను రైతు రూ.770లు చెల్లించుకోవాలని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు. మండల టిడిపి అధ్యక్షులు పైల బాబ్జి, పట్టణ టిడిపి అధ్యక్షులు సైలాడ సతీష్, శ్రీ నీలమణి దుర్గా ఆలయ కమిటీ ఛైర్మన్ అక్కంద్ర సన్యాసిరావు, శంకర్, కుమార్ రైతులు కోరుకొండ శంకర్, ధర్మారావు, శ్రీను, అమ్మరావు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సునీత, తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు పరామర్శ



మెళియాపుట్టి, మే 19 ప్రభాతవార్త : మండలంలోని వసుంధర గ్రామానికి చెందిన కుల్లాన బాలరాజు కుమార్తె ఇటీవల మృతి చెందడంతో వాళ్ల కుటుంబాన్ని రాష్ట్ర తూర్పు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మామిడి శ్రీకాంత్ పరామర్శించారు. అలాగే ముక్తాపురం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సుక్క పగడాలమ్మ ఇటీవల మృతి చెందడంతో వాళ్ల కుటుంబాన్ని పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రతినిధి పాడి అప్పారావు ఎంపీటీసీ ప్రతినిధి ఉర్లాన ఋషి, జే చిన్నబాబు, నక్కవెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై అవగాహన



సంతకవిటి, మే 19 ప్రభాతవార్త : శ్రీహరి నాయుడుపేట, కొండగూడెంలలో మహిళ భద్రత గురించి ఎస్ఐఆర్ గోపాలరావు చెప్పారు. మహిళ పట్ల ఎలా ప్రవర్తించాలో చెప్పారు. అలాగే మాదకద్రవ్యాలు దుర్వినియోగం గురించి చెప్పారు. యూత్ డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని సూచించారు. అలాగే రోడ్డు భద్రతకు సరైన జాగ్రత్తలు తీసుకుని ట్రాఫిక్ సూచనలను పాటించాలని హెల్మెట్ ధరించి వాహనం నడపాలని చెప్పారు. ఈ మధ్యన డ్రగ్స్‌కు అలవాటు పడి యూత్ అందరూ తల్లి తండ్రి చూడకుండా నేరాలు చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు సెల్ ఫోన్లు ఇవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

## పలు గ్రామాల్లో తిరిగిన 'స్వచ్ఛరథం' బండి



కంచిలి, మే 19 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొల్లూరు పంచాయతీలో కొల్లూరు, కర్తలి, సిర్తలి, ఎంఎస్ పల్లి, గుండం గ్రామాలలో స్వచ్ఛరథం బండి రావడం జరిగింది. అనేక రకాల చెత్తను తీసుకొని దానికి బదులు కూరలు, తినే వస్తువులు, పప్పులు, ఉప్పు, కారం అనేక వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీపి కంచిలి మండలం అధ్యక్షులు వాసాల రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, సెక్రటరీ మన్మథరావు పాల్గొన్నారు.

## శత్రుచర్లను పరామర్శించిన ఎమ్మెల్యే గోవిందరావు



పాతపట్నం, మే 19 ప్రభాతవార్త : మాజీమంత్రి శత్రుచర్ల విజయరామ రాజును విశాఖపట్నంలోని వారి నివాసం వద్ద మంగళవారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మర్యాదపూర్వకంగా కలిశారు. శత్రుచర్ల ఆరోగ్య పరిస్థి తిని, యోగక్షేమాలను అడిగి తెలుసుకొని ఆయన త్వరగా పూర్తి ఆరోగ్యవం తులు కావాలని గోవిందరావు ఆకాంక్షించారు.

## నేడు రాజాంలో ప్రైవేట్ మెడికల్ షాపులు బంద్



రాజాం, మే 19 ప్రభాతవార్త: రాజాం పట్టణంలో ఫార్మసీ దుకాణదారులు ఆన్లైన్లో మందులు అమ్ముతున్న నేపథ్యంలో నేడు ప్రైవేట్ మందులు దుకాణాలు సంఘం నిరసన కార్యక్రమం తల పెడుతున్నట్లు తెలిపారు. ఇందుకు నిరసనగా అంబేద్కర్ జంక్షన్ నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళుతూ నిరసన కార్యక్రమం తలపెడుతున్నట్లు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ సంఘం సభ్యులు సూచించారు.

## బంగారం కొనొద్దన్న మోదీ పిలుపుతో స్వర్ణకారులు బంద్

### ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజుకు వినతి

రాజాం, మే 19 ప్రభాతవార్త : ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన బంగారం కొనుగోళ్ల నియంత్రణ పిలుపుకు వ్యతిరేకంగా విజయనగరంలో స్వర్ణకారులు మంగళవారం బంద్‌కు దిగారు. బంగారు దుకాణాలు మూసివేసి స్వర్ణకార సంఘాల కార్యాలయాల వద్ద జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు బంగారు దేవుళ్ళు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే అంతంతమాత్రంగానే జీవనోపాధి కొనసాగుతోందని, తాజాగా బంగారం కొనుగోళ్లపై ప్రజల్లో అనిశ్చితి పెరగడంతో పూర్తిగా ఆర్డర్లు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు బంగారం ధరలు పెరుగుతాయో,లేదా తగ్గుతాయో తెలియక వినియోగదారులు కొనుగోళ్లు మానేశారు. దీంతో తయారీ పనులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని పిలుపు ఇవ్వడానికి ముందు స్వర్ణకార వర్గాలతో చర్చించి ఉండాల్సిందని పేర్కొన్నారు. సంవత్సరం పాటు బంగారం కొనొద్దని చెబితే మా కుటుంబాల పరిస్థితి ఏంటో ప్రభుత్వం సమాధానం చెప్పాలి అని ప్రశ్నించారు. అనంతరం విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజును కలిసి స్వర్ణకారులు వినతి పత్రాన్ని అందజేసి ప్రభుత్వపరంగా తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తోలేటి సంతోష్ కుమార్, గౌరవ అధ్యక్షులు పెదగాడ శివప్రసాద్, కోశాధికారి మానేపల్లి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు కడలి సత్య కామేష్, కన్వీనర్ కుప్పిలి నాగేశ్వరరావు, లక్కోజు శేఖర్, పి.పరమేష్, టి.కృష్ణమూర్తి, కె.జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



పాతపట్నం, మే 19 ప్రభాతవార్త : కొరసవాడ, పెద్దసీది, మెళియాపుట్టి మండలం, పరిసర గ్రామ మాజీ సైనికుల సామాజిక సేవా సంఘం వారు మానవసేవే మాధవసేవ అనే నినాదంతో వేసవిలో చల్లని, నాణ్యమైన మజ్జిగ వితరణ కార్యక్రమం తలపెట్టారు. పాదచారులు, వాహనదారులు, వందల మంది దాహార్తిని తీర్చుకుంటూ ఉన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు, స్థానికులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి : మాజీ ఎమ్మెల్యే



పాతపట్నం, మే 19 ప్రభాతవార్త : వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పెట్రోలు, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ పాతపట్నం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైకాపా శ్రేణులతో కలసి తహశీల్దార్ నందిగాం ప్రసాదరావుకు మంగళవారం వినతి పత్రం అందజేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడం బదులు మరింతగా పెంచడం ద్వారా సామాన్య ప్రజలపై భారీ భారం మోపడంతో పాటు, రైతాంగం, రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా పెట్రోలు, డీజిల్ ధరలను పెంచడం ఆందోళనకర విషయమని, ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గిస్తామని తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించి, దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే అధిక ధరలకు పెట్రోలు, డీజిల్ విక్రయించిన ఘనత టిడిపి కూటమి ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే కోండ్రు చిత్రపటానికి పాలాభిషేకం



వంగర, మే 19 ప్రభాతవార్త : మండలంలోని కొండ వలస జంక్షన్ నుండి భాగంపేట గ్రామం వరకు సుమారుగా మూడు కోట్ల రూపాయలతో రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టడంతో ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండ్రు మురళీమోహన్ చిత్రపటానికి అక్కడ ప్రజలు పాలాభిషేకం చేసి కొండ్రుకు జేజేలు కొట్టారు. ఈ సందర్భంగా శవం పిఎసిఎస్ అధ్యక్షులు బెజ్జిపురం రవి, టిడిపి మాజీ మండల అధ్యక్షులు బెజ్జపురం త్రినాధ, భాగంపేట మాజీ సర్పంచ్ రెడ్డి గోపాల్ నాయుడు, మురళి. పాటువర్ధనం, శ్రీహరిపు రం, సర్పంచ్ తదితరులు మాట్లాడుతూ రాజాం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండ్రు మురళీమోహన్ సేవలు మరువలేనివి. దశాబ్ద కాలంగా ఈ రోడ్డు పనులు శంకుస్థాపనకు పరిమితమైన తప్ప పనుల్లో మాత్రం పురోగతి కనిపించడం లేకపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డామని, నేడు ఎమ్మెల్యే కొండ్రు చొరవతో ఈ పనులు ప్రారంభించడంపై మా 10 గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్‌కు ఎల్లవేళలా రుణపడి ఉంటామని వారు అన్నారు. కార్యక్రమంలో నల్ల కృష్ణమూర్తి, బి.సాయిరాం, రవి, శ్రీహరిపురం దేవకీవాడ, బాగేంపేట పట్టువర్ధనం, నిలవలస, తదితర గ్రామాల ప్రజలు, పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోండి




సంతకవిటి, మే 19 ప్రభాతవార్త : 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు రక్తపోటు, బ్లడ్ షుగర్‌లను నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఏపీ స్టేట్ అల్లైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ రాష్ట్ర సభ్యులు ఎస్.వసంతరావు, ఆప్తాలమిక్ ఆఫీసర్ అన్నారు. జిల్లా అందత్వ నివారణ సంస్థ, విజయ నగరం సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ సహకారంతో శ్రీ భగవాన్ సాయి బాబా సంస్థ మండవకురిటి ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. 40 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు సకాలంలో సమగ్ర నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా రక్తపోటు, చక్కెర వలన సంక్రమించే రెటినోపతి వలనకల్గే అనర్థాల నుండి దృష్టిని కాపాడుకోవచ్చని అన్నారు. కంటి ముందు రంగు రంగుల వలయాలు, నల్లని మచ్చలు కనిపించినపుడు ఏ మాత్రం అశ్రద్ధ చేయవద్దని రోగులకు సూచించారు. ఈ శిబిరంలో ఆసుపత్రి ఆప్టోమెట్రిస్ట్ లోకేష్ 60 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 25 మందికి కంటి శస్త్ర చికిత్సలు కొరకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో సాయి సమితి కన్వీనర్ దువ్వ వెంకన్న,బత్తుల శ్రీనివాస్,బత్తుల రాంబాబు, క్యాంప్ కోఆర్డినేటర్ సాయి కుమార్,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం క్షేత్ర ఆరోగ్య పర్యవేక్షకులు సురేష్, రజనీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి : ఎంపీడీవో



కంచిలి, మే 19 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాలు అభి వృద్ధిలో దూసుకుపోతున్నాయని ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు. మంగళవారం కంచిలి మండలం మండపల్లి గ్రామంలో నాలుగు లక్షల రూపాయలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యదర్శి సంతోష్, కాముడు, త్రినాథ్, గణేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## యేసు క్రీస్తు లోక రక్షకుడు



వంగర, మే 19 ప్రభాతవార్త : వంగర మండలం తలగాం గ్రామంలో పాస్టర్ డి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ దేవుని నామమునకు మహిమకరముగా జరిగింది. సేవకులు యేసు క్రీస్తు లోక రక్షకుడని ఆయనను నమ్ముకొని ఎడల మోక్షం ప్రాప్తిస్తుందని, తలగాం గ్రామంలో గడపగడపకు వెళ్లి కరపత్రాలు అందించి దేవుని రాజ్యము కొరకు ఏసుక్రీస్తు ప్రభువు రెండవ రాకడ కొరకు తెలియజేశారు. అనంతరం మందిరంలో చేరి పాటలతోనూ ఆరాధనతోనూ దేవుని మహిమ పరిచారు. పాస్టర్ అప్పలనాయుడు తన సాక్ష్యాన్ని తెలియజేస్తూ వాక్యాన్ని అందించారు. ఫెలోషిప్ సెక్రెటరీ వి.భాస్కరరావు (యేసు రత్నం )అధ్యక్షులుగా వ్యవహరించారు. పాస్టర్ చార్లెస్, పాస్టర్ దుర్గా పాల్, పాస్టర్ రమేష్,పాస్టర్ కాలేబు, పాస్టర్ కృపారావు, పెద్ద సంఖ్యలో సేవకురాలు పాల్గొన్నారు. ప్రెసిడెంట్ పాస్టర్ ఎలిషా ప్రార్ధనతోనూ ఆశీర్వాదంతోను కార్యక్రమాన్ని ముగించారు.

## కిడ్నీ బాధితుడికి రూ.10 వేలు అందజేత



సంతబొమ్మాళి, మే 19 ప్రభాతవార్త : మండలం నౌపడ గ్రామానికి చెందిన తామాడ ప్రసాద్ బాబు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉద్దానం అభ్యుదయ సేవా సమితి ఫౌండర్ తమాడ లక్ష్మణరావు ఆర్థిక సాయం అందజేశారు. శ్రీకాకుళంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో డయాలసిస్ చికిత్స పొందుతున్నారు. తన రెండు కిడ్నీలు పాడవడంతో వైద్యులు తక్షణమే కిడ్నీ మార్పిడి చేయించుకోవాలని సూచించారు. కిడ్నీ మార్పిడికి డబ్బులు లేక దిక్కుతోచని పరిస్థితిలో వున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకు. రోజు గడవడమే చాలా కష్ట తరంగా మారింది, ఏమి చెయ్యాలో తెలియని పరిస్థితుల్లో వున్నారని విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు, తన స్వగృహం వద్ద మంగళవారం వెళ్లి తనకి రూ.10,000 వేలు నగదు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గుంటు.విజయ్ బ్రదర్స్(ఇన్‌చార్జ్), మండల మహేష్(ఇన్‌చార్జ్), సి హెచ్ పాపారావు(ఇన్‌చార్జ్), గీత నీలకంఠం, (ఇన్‌చార్జ్), కొండవేటి చెన్నకేశ్వరరావు, (ఇన్‌చార్జ్), చింత దానేష్, మండల నీలయ్య, దండుపాటి పవన్ కుమార్, కొండవేటి ఆనందరావు, మహంతి రాజు, మాటూరి రాజేష్, కొరుపురు ధర్మరావు, సుంకర రాణి, చింత రోహిణి, బై.ఊర్వశి, గణగళ్ళ ఉమా పాల్గొన్నారు.

## పాతపట్నం విద్యార్థికి జాతీయ స్థాయి నృత్య పురస్కారం



పాతపట్నం, మే 19 ప్రభాతవార్త : పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రి రోడ్, చర్చ్ వీధికి చెందిన దాసరి సోమేశ్ - ప్రమీల దంపతుల ప్రథమ పుత్రిక దాసరి జాహ్నవి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచింది. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని జయదేవ్ భవన్‌లో 2026 మే 17న నిర్వహించిన 46వ నేషనల్ చిల్డ్రన్స్ ఫెస్టివల్ - 2026లో ఆమె పాల్గొని మో డర్న్ డాన్స్ గ్రూప్ - సీనియర్ విభాగంలో అద్భుత ప్రదర్శనతో ప్రత్యేక జ్యూరీ గుర్తింపు సాధించి జాతీయ విజేత సర్టిఫికెట్‌ను అందుకుంది. ఈ కార్యక్రమాన్ని 'స్వాగతిక' సాంస్కృతిక సంస్థ కళ, సాహిత్యం, సంస్కృతి మరియు పర్యాటక రంగాల అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించింది. ఒడిశా ప్రభుత్వ ఒడియా భాష, సాహిత్య సంస్కృతిక శాఖ సహకారంతో ఈ జాతీయోత్సవం ఘనంగా జరిగింది. దాసరి జాహ్నవి సాధించిన ఈ జాతీయ స్థాయి విజయంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### గత దుర్మార్గ పాలనలో మత్స్యకారుల కష్టాలకు

## ధర కట్టింది కేవలం రూ. పది వేలే : మంత్రి అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి, మే 19 ప్రభాతవార్త : ప్రభుత్వం రాక్షస పాలనలో కేవలం పది వేలు రూపాయలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అలానే ఇచ్చిన ఏ హామీనీ నిలబెట్టుకోలేకపోయారని వైకాపా పార్టీపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. మంగళవారం విడుదల చేయనున్న మత్స్యకారుల సేవలో పేరిట విడుదల చేయనున్న ఆర్థిక సాయం కేవలం సాయం మాత్రమే కాదని అది వారి ఆత్మ గౌరవ ప్రతీక అని అభివర్ణించారు. గత ప్రభుత్వం నిర్ణయం కారణంగా జీఓ నంబర్ 217 అన్నది మత్స్యకారులకు ఉరితాడుగా మారిందని, వారికొక మృత్యపాశం అయిందని ఆవేదన చెందారు. జగన్ మోహన్ రెడ్డి నిర్వాకం కారణంగా ఆ రోజు ఆయనకు సంబంధించిన దళారులు బాగుపడ్డారని, మత్స్యకార సొసైటీలకు చెరువులు, రిజర్వాయర్లు అప్పగిస్తే జగన్ మోహన్ రెడ్డి వాటిని ఆన్లైన్ వేలం పేరిట తన పార్టీ దళారులకు కట్టబెట్టారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేట నిషేధ సమయంలో సంబంధిత మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేం దుకు, అదేవిధంగా సముద్రంలో మత్స్యసంపదను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలలో భాగంగా.. అర్హత గల కుటుంబానికి ఇరవై వేల రూపాయల చొప్పున మత్స్యకారుల సేవలో అనే పథకం పేరిట మంగళవారం నిధులు విడుదల చేశామని అన్నారు. అంతేకాక ఉచిత చేపపిల్లల పంపిణీ నిలిపివేసి కులవృత్తిని నాశనం చేసి మత్స్యకారులకు ఉపాధి అందనివ్వక అత్యంత దయనీయ స్థితిలో వాళ్ల దేశం కాని దేశంలో ఉపాధి అవకాశాలు వెతుక్కునే విధంగా చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదేనని విమర్శించారు. మత్స్యకార భరోసా పేరిట ఎవ్వరినీ ఆదుకున్నది లేదని, రాష్ట్ర వ్యాప్తంగా ఇరవై లక్షల మంది మత్స్యకారులు ఉంటే కేవలం లక్ష మందికి మాత్రమే సాయం అందించి చేతులు దులుపుకున్నా రని, దీనికే సంక్షేమం అని కలరింగ్ ఇచ్చారని పెదవి విరిచారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారు లెవ్వరూ పస్తులుండకూడదని గతంలో ఇచ్చిన మొత్తాన్ని భారీగా పెంచి ఒక్కో కుటుంబానికి ఇరవై వేల రూపాయల లబ్ధి చేకూర్చిందని అన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మత్స్యకారుల సేవలో పేరిట అదనంగా 28కోట్ల రూపాయలను అదనంగా అందించడం వల్ల మత్స్యకారుల విషయమై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ఇది తెలియజేస్తుందన్నారు. కేవలం నిధులు ఇవ్వడమే కాకుండా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించి, సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా ప్రతి మత్స్యకార కుటుంబానికీ మేలు జరిగే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని, నాడు వ్యాపారులుగా ఉన్న మత్స్యకారులను కూలీలుగా మార్చిన వైఖరి వైకాపాదని విమర్శించారు. నేడు మళ్లీ కూటమి ప్రభుత్వ పాలనలో మత్స్యకారులందరూ యజమానులుగా ఎదిగే రోజులు వచ్చాయని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

20 -5Pg9th cheli.qxd:20 -5Pg9th cheli.qxd 1/1/02 7:05 AM Page 1



## నారీ జన సమ్మోహనం



పట్టణ ప్రాంతాల్లో డిజిటల్ వినియోగంలో మహిళలదే ఆధిపత్యం ఈకామర్స్, వినోద కార్యక్రమాల్లో వారిదే ఎక్కువ సమయం వీటీఐఓఎన్, ఐఏఎంఏఐ సంయుక్త నివేదిక వెల్లడి భారత పట్టణ ప్రాంతాల్లో డిజిటల్ కార్యకలాపాల్లో పురుషుల కంటే మహిళలే ముందున్నారని ఓ తాజా నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా ఎంటర్టైన్మెంట్, మెసేజింగ్, ఈకామర్స్ వంటి విభాగాల్లో మహిళలు ఎక్కువ సమయం గడుపుతూ డిజిటల్ వినియోగంలో కీలక చోదకులుగా నిలుస్తున్నారని స్పష్టం చేసింది.కన్స్యూమర్ బిహేవియర్ అనలిటిక్స్ ప్లాట్ఫామ్ వీటీఐఓఎన్, ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ) సంయుక్తంగా ఈ నివేదికను విడుదల చేశాయి. ఈకామర్స్, క్విక్ కామర్స్ విభాగాల్లో మహిళలదే పైచేయి అని నివేదిక పేర్కొంది. 2534 ఏళ్ల వయసున్న పట్టణ మహిళలు ఈ ప్లాట్ఫామ్లపై రోజుకు సగటున 35.2 నిమిషాలు గడుపుతుండగా, అదే వయసు పురుషులు కేవలం 24.8 నిమిషాలు మాత్రమే వెచ్చిస్తున్నారు. ఇది పురుషుల కంటే 42 శాతం అధికం. వినోద కార్యక్రమాల కోసం మహిళలు రోజుకు సగటున 82.4 నిమిషాలు కేటాయిస్తున్నారు.ఈ నివేదికలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యాప్ల వినియోగం కూడా వేగంగా పెరుగుతున్నట్లు తేలింది. ఏప్రిల్ 2025 మార్చి 2026 మధ్య కాలంలో ఏఐ యాప్ల వాడకం 100 శాతానికి పైగా వృద్ధి చెందింది. పట్టణ వినియోగదారులు రోజుకు సగటున 11.3 నిమిషాలు ఏఐ యాప్లపై గడుపుతున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో 1824 ఏళ్ల యువత రోజుకు 120 నిమిషాలు గడుపుతుండగా, 35 ఏళ్లు పైబడిన వారు వినోదంపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. పేమెంట్ యాప్ల వినియోగం మాత్రం అన్ని ఆదాయ వర్గాల్లో దాదాపు సమానంగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా స్మార్ట్ఫోన్ల డేటాను విశ్లేషించి ఈ వివరాలు వెల్లడించారు.

## మల్బరీతో ఆరోగ్యంగా.. !



మల్బరీ పండ్లు.. వీటినే బొంతపండ్లు అనికూడా అంటారు. ఇవి నలుపు, ఎరుపు, తెలుపు రంగుల్లో ఉంటాయి. ఈ పండ్లలో ఆరోగ్యానికి మేలుచేసే ఫైటోన్యూట్రియంట్లు ఎక్కువ. అలానే, విటమిన్లు బి 1,2,3, సి,ఇ,కెతో పాటు పొటాషియం, జింక్ దీన్నుంచి తగినంతగా శరీరానికి అందుతాయి. వీటిలో జీర్ణక్రియను మెరుగుపరిచే పీచు సమృద్ధిగా ఉంటుంది. ఇది పేగు కదలికను సులభతరం చేస్తుంది. జీర్ణసంబంధిత వ్యాధులతో బాధపడే వారు రోజువారీ ఆహారంలో నీటిని చేర్చుకుంటే ఉపశమనం ఉంటుంది. మల్బరీల్లో ఉండే పీచు బరువుని తగ్గిస్తుంది. క్యాన్సర్ కణాలను నిర్మూలించే ఆంతో సైనిన్లు ఇందు లో పుష్కలంగా ఉండి పెద్దపేగు, చర్మ, ప్రొస్టేట్ క్యాన్సర్లను దరిచేరనివ్వవు. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్తనాళాల పనితీరుని మెరుగుపరు స్తాయి. దీంతో గుండె, ఇతర శరీర భాగాలకి రక్తప్రసరణ సరిగ్గా జరిగి రక్తపోటు అదుపులో ఉంటుంది. ఐరన్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఎర్రరక్తకణాలూ వృద్ధి చెందుతాయి. రోగనిరోధకశక్తిని మెరుగు పరచడంలోనూ మల్బరీలు ప్రధానపాత్ర పోషిస్తాయి. వీటిలో ఉండే విటమిన్-సి ఇన్ఫెక్షన్లను దరిచేరనీయదు. విటమిన్-కె, కాల్షియం, ఐరన్ పోషకాలు ఎముకలుగుల్ల బారకుండా కాపాడతాయి.

## నవ్వించేద్దామా.. !



**హాస్యాన్ని ఆస్వాదించని వారుండరంటే అతిశయోక్తి కాదు!** అందుకే 'నవ్వని రోజు వృథా అయినట్టే'అని చార్లీ చాప్లిన్ అంటే, జీవితమంటే అలా బతికేయడమే కాదు, అందులో కొంత హాస్యం కూడా ఉండాలంటారు. అమ్మాయంటే ఇలానే నవ్వాలి. అనే రోజుల నుంచి హాస్యాన్నే తమ కెరియర్గా మలుచుకుంటోన్న అమ్మాయిలూ పెరిగారు. ఫటాఫట్ పంచులు వేసినా, స్టాండప్ కామెడీ చేసినా.. వారి అంతిమ లక్ష్యం ఎదుటివారి ముఖంలో నవ్వులు పూయించడమే. సాధారణంగా మనమెవరైనా తప్పులు చేశామను కోండి అందులో ఫన్కి పెద్దగా ఆస్కారం ఉండదు. కానీ యూట్యూబర్లు, నటీనటులు, న్యూస్ రీడర్లు..లాంటి వాళ్ల వీడియో రికార్డింగ్ చేసేటప్పుడు దొర్లే తప్పులు అవేనండీ బ్లూపర్స్.. అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. సైకాజికల్గా చెప్పాలంటే.. ఇలా సరదా తప్పులకు నవ్వే పద్ధతిని బినైన్వయొలేషన్ థియరీ అంటారు. నిజానికి వాళ్లు చేసే ఆ కార్యక్రమాన్ని ఎంతమంది చూస్తారో తెలియదు కానీ, ఆ బ్లూపర్ వీడియోలు మాత్రం తెగ వైరల్ అవుతుంటాయి. .

## అనుకోకుండానే.. అన్నీ !



ఆన్లైన్లో తగ్గింపు అని కనిపించినా, సరదాగా బయటికి వెళ్లినా ఒకటో రెండో డ్రెస్సులు వెంటబెట్టుకొచ్చేయడం అలవాటు. అప్పటికే బోలెడు క్రీములు ఇంట్లో ఉన్నా.. ఎవరో సిఫారసు చేశారనో, తక్కువకే వస్తున్నాయనో మరిన్ని తెచ్చేయడం కద్దు. అలా చేస్తే అమ్మలుమంటారో తెలుపా! ఉన్నాయి కదా! మళ్లీ ఇవన్నీ ఎందుకు? దండగ ఖర్చు కాకపోతే' అనే కదూ! నిజంగానే ఎందుకిలా కొనేస్తాం? కొన్ని వస్తువులు, దుస్తులు ఎంత నచ్చినా ఆర్థిక పరిస్థితి అనుకూలించక కొనలేరు కొందరు. కొందరికి ఆర్థిక పరిస్థితులు బాగున్నా అలమరాలు నింపేస్తారుగా అంటే.. దానికీ కారణముంది అంటున్నాయి కొన్ని పరిశోధనలు. ఆత్మ విశ్వాసంగా కనిపించడానికి అమ్మాయిలు ఎంచుకునే మార్గాల్లో దుస్తులూ ఒకటి. వాళ్ల వ్యక్తిత్వం, శైలిని వాటి ద్వారా వ్యక్తపరుస్తారట. అందుకే ఎన్ని ఉన్నా తాజా ధోరణులను తెలుసుకుని మరీ వేసుకున్నా వేసుకోకపోయినా దుస్తులు, చెప్పులు మళ్లీ మళ్లీ కొంటూనే ఉంటాట. ఇంకొందరైతే అలా కొనడం అదో ఫ్యాషన్ . అందుకే ఎవరేమన్నా వారి తీరు 'మార్చుకోలేరు. కొన్నీ సార్లయితే మనసులో ఏదో ఒక లోటు తెలుస్తూనే ఉంటుంది. వేడుక ఏదైనా 'పర్ఫెక్ట్'గా ఉండాలనుకునే అమ్మాయిలే ఎక్కువ. అలాంటివాళ్లు వీటినెలా తట్టుకుంటారు చెప్పండి. అందుకని ముందుగానే సిద్ధంగా ఉండాలన్న తాపత్రయంలో తెలియకుండానే ఇలా ఖర్చు చేస్తుంటారు.

**ఈ తీరు ఇబ్బంది కదా!** అంటే.. అవుననే అంటున్నాయి అధ్యయనాలు. ఖర్చు పెట్టే స్థోమత ఉందన్న ధైర్యం, అందుబాటులో ఉన్న క్రెడిట్ కార్డు అనవసర ఖర్చేమో అన్న ఆలోచనే రానీయడం లేదట. కాబట్టి, నెలకి దుస్తులు, సౌందర్య సాధనాలు ఉత్పత్తులకు ఇంత అని బడ్జెట్ పెట్టుకోవాలి. దాన్ని తు.చ. తప్పకుండా పాటించడమే దీనికి సరైన పరిష్కారం.

## బుజ్జాయిల సాయంతోనే..!



నిజానికి ఇంట్లో ఎంత చిన్న వేడుక చేసినా పెద్దలకు నచ్చే రుచులనే ఎక్కువగా వండుతాం. కానీ, ఈ వేసవిలో పిల్లలకోసం మాత్రమే పాట్లక్ పార్టీ ఏర్పాటు చేయండి. దీన్ని మీ పిల్లలూ, వారి స్నేహితుల తల్లులూ కలిసి నిర్వహించండి. తలా ఒక రకాన్ని విందుకోసం సిద్ధం చేయండి. అయితే, ఒక్క షరతు.. వీటిని తయారు చేసేటప్పుడు మాత్రం బుజ్జాయిలు కచ్చితంగా సాయమందించాలనే నియమం పెట్టండి. అప్పుడు పనిలో ఉండే కష్టం, ఇష్టమైనదాని కోసం శ్రమించే తత్వం వంటివన్నీ అలవడతాయి. ఈ వేడుకను అద్భుతంగా వాళ్లు ఆస్వాదిస్తారు.

## ధన వ్యామోహామెందుకు ?

మానవుని ఆడించేది డబ్బే. డబ్బుకి విశేష గుణం ఉంది. డబ్బు గురించి బౌద్దులు చెప్పింది అక్షరాలా సత్యం. వారి బోధనలలో ముఖ్య మైనది.ఇతరుల సంపదను దోచుకోకుండా ఉండటమే అపరిగ్రహం. ఇది బౌద్దుల ముఖ్య లక్షణం. బుద్ధుడు కూడా అపరిగ్రహం కూడదు అన్నాడు. నిజానికి ఎవరు కూడా ఎట్టి పరిస్థితులలో ఇతరుల సంపద పై కన్ను వేయకూడదు. ఆధ్యాత్మిక చింతనలో డబ్బు ఒక మోసపూరితం. కొందరు ఇతరుల సంపద పై ఎక్కువగా ఆధార పడుతుంటారు. డబ్బు అనేది వ్యక్తుల ప్రవర్తననుమారు స్తుంది. ఈ కోవలో దొంగ తనాలు, హత్యలు కూడ చేస్తూ ఉంటారు. ఇది బౌద్ధ ధర్మానికి వ్యతిరేకం. బుద్ధుడు ప్రవచించి నట్లుగా ఎట్టి పరిస్థితులలో వ్య క్తి ధనం పై వ్యామోహం ఉండరాదు. నైతిక వర్తనులుగా, నీతిగా ఉండాలి.ఈ రోజులలో చాలా మంది డబ్బుకే విలువ ఇస్తుంటారు.వ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వరు ముందు వ్యక్తి యొక్క విలువ, గౌరవం తరువాత నే డబ్బు. డబ్బు అవసరమే. కాకపోతే డబ్బే జీవితం కాకూడదు. అందుకే బుద్ధుడు అపరిగ్రహం ఉండ కూడదు అన్న మాట అక్షరాలా సత్యం. డబ్బే లోకం అని చాలా మంది అనుకుంటూ ఉంటారు. డబ్బు మనిషిని దిగజారుస్తుంది. ఒక్కోసారి అందలం ఎక్కిస్తుంది. నడమంత్రపు సిరి ఎక్కువ కాలం మనజాలదు.డబ్బుకు మనం ఎప్పుడు ప్రాముఖ్యత ఇవ్వ కూడదు. అందుకే వ్యక్తి డబ్బు విషయంలో ఆచి, తూచి నడచుకోవాలి.

**- కనుమ ఎల్లారెడ్డి.**

**చెలి** సామాజిక పరిణామంలో మహిళల పాత్ర ఎ ంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్:Cheli@vaartha.com

**చిట్కా:** మధుమేహ వ్యాధులున్నవారు కాకరకాయ కూరను ఎక్కువగా వాడితే మధుమేహ వ్యాధి కొంత తగ్గుతుంది. మునగాకు నూరి కురుపులకు కడితే కురుపులు తగ్గుతాయి.

# తెర

## 'ఐక్య' నా బిడ్డ లాంటిది..



టాలీవుడ్లో ప్రముఖ స్టార్ హీరో రా కింగ్ మనోజ్ మంచు ఎన్నో మంచి చిత్రాలతో ఆడియెన్స్ని అలరించారు. అలాంటి హీరో తన పుట్టిన రోజు (మే 20) సందర్భంగా మంగళవారం నాడు మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించారు.

**'ఐక్య' పెట్టాలనే ఆలోచన ఎలా వచ్చింది?..**

నేను సూపర్ మ్యాన్ని కాదు. అందరికీ అన్ని వేళలా అందుబాటులో ఉండకపోవచ్చు. అందుకే ఈ ట్రస్ట్ను పెట్టాలని అనుకున్నాం. వాయిస్ లెస్కి వాయిస్గా ఈ ట్రస్ట్ ఉంటుంది. అలా ఐక్య ధైర్య సేనా సమితి అని పెట్టడానికి చాలా కారణాలున్నాయి.

**'ఐక్య ట్రస్ట్ ఎలా వర్క్ చేస్తుంది? నియమాలు ఏంటి?..**

ఐక్యకి ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదు. ఎప్పటి నుంచో ఇలాంటి ఓ ట్రస్ట్ను ఏర్పాటు చేయాలని అనుకున్నాం. దానికి సంబంధించిన నియమాల్ని ఇంకా రూపొందించలేదు.

**'ఐక్య'కి ఇతర వివరాల్ని ఎప్పుడు ప్రకటిస్తారు?..**

జూన్ 7న నా కొత్త సినిమా రక్షక్ ప్రారంభం కాబోతోంది. ప్రస్తుతం

**.ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎప్పుడు వస్తారు?..**

మేం పుట్టినప్పటి నుంచీ రాజకీయాల్లోనే ఉన్నాం. కొత్తగా రాజకీయాల్లోకి రావడం అని ఏముంది. వచ్చే ఎన్నికల్లో నా భార్య పోటీ చేస్తారు.

**..మే 20 అంటే ఎన్టీఆర్, సిరివెన్నెల సీతారామశాస్త్రీ పుట్టిన రోజు కూడా కదా?**

నా పుట్టిన రోజుని తారక్ అన్నతో, స్వర్గీయ సిరివెన్నెల సీతారామశాస్త్రితో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉంటుంది.

**డేవిడ్ రెడ్డి ఎలా ఉండబోతోంది?..** నేను దాని గురించి ప్రత్యేకంగా చెప్పేకంటే రేపు (మే 20) సాయంత్రం గ్లింప్స్ రాబోతోంది. మాటల కంటే మన పని చెబితేనే బెటర్. షూటింగ్ దాదాపు 40 శాతం పూర్తయింది.

**వాట్ ది ఫిష్ పరిస్థితి ఏంటి?..** వాట్ ది ఫిష్ ఇప్పుడు రావడం లేదు. అనుకోని కారణాల వల్ల అది కుదరలేదు. నేను, సత్య, వెన్నెల కిషోర్ అందరం కలిసి చేయాల్సిన సినిమా. చివరి నిమిషంలో చాలా మందికి వీసా ప్రాబ్లం వచ్చింది.

**మోహన రాగ మ్యూజిక్ పనులు ఎక్కడి వరకు వచ్చాయి?..**

మోహన రాగ మ్యూజిక్ చాలా బాగా వస్తుంది. అద్భుతమైన ఆర్టిస్టులు, టెక్నీషియన్లు, సింగర్లు పని చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు పాటలు రికార్డ్ అయ్యాయి.

## 'ఆర్ కే దీక్ష' మూవీ జూన్ 12న రిలీజ్

క్రియేషన్స్ బ్యానర్లపై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం 'ఆర్ కే దీక్ష' డి.ఎస్. రెడ్డి సమర్పణలో రూపొందిన



ఈ చిత్రంలో ఢీ, జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్లుగా నటించగా, కిరణ్ హీరోగా కనిపించనున్నారు. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూన్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్కు సిద్ధమవుతోంది. దర్శకనిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం సాయంత్రం హైదరాబాద్లో ఈ చిత్ర సాంగ్స్ , టీజర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నిర్మాత ఎ. గురురాజ్ మాట్లాడుతూ – డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు.'ఆర్కే దీక్ష' చిత్రాన్ని ఎంతో క్వాలిటీగా రూపొందించారని సాంగగ్స్, టీజర్ చూస్తేనే తెలుస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు.పొలిటికల్ లీడర్ గ్యాదరి బాలమల్లు మాట్లాడుతూ – సిద్ధిపేట ప్రాంతం నుంచి వచ్చిన డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ రాజకీయంగా, సినీ రంగంలో ఎంతోకాలంగా కొనసాగుతున్నారు.

## 'పెద్ది' సినిమా ట్రైలర్ లాంచ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బుచ్చి బాబు సానా, వెంకట సతీష్ కిలారు, వృద్ధి సినిమాస్, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ 'పెద్ది' లార్జర్ దెన్ లైఫ్ ఎపిక్ ట్రైలర్ లాంచ్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు ముందే సంచలనం సృష్టిస్తోంది. ప్రతి ప్రోమో దేశవ్యాప్తంగా బజ్ క్రియేట్ చేసింది. దర్శకుడు బుచ్చి బాబు సానా ఈ రూరల్ యాక్షన్ స్పోర్ట్స్ కథను అద్భుతంగా తీర్చిదిద్దారు. రెగ్యులర్ హీరో ఇంట్రడక్షన్ ట్రైలర్లా కాకుండా.. 'పెద్ది' ట్రైలర్ ఒక పల్లె ప్రపంచాన్ని, అక్కడి జీవితాల్ని, పోరాటాన్ని, ఆటపై ఇష్టాన్ని ఎంతో సహజంగా పరిచయం చేసింది. జాన్వీ కపూర్ తన పాత్రలో ఎంతో నేచురల్గా కనిపించింది. గ్రామీణ యువతిగా ఆమె చూపించిన ఎక్స్ప్రెషన్స్ ట్రైలర్కు మంచి వార్మ్నెస్ తీసుకొచ్చాయి. అలాగే శివరాజ్కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ పాత్రలు కూడా కథలో బలమైన ప్రాధాన్యం కలిగి ఉన్నాయని ట్రైలర్ సూచించింది. ఏఆర్ రెహమాన్ బ్యాక్గ్రౌండ్ స్కోర్ ట్రైలర్కు ఆత్మలా నిలిచింది. ఎమోషన్స్ను, యాక్షన్ను ఒకేసారి ఎలివేట్ చేస్తూ ఆయన ఇచ్చిన స్కోర్ ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్లో నిర్మించిన ఈ సినిమా ప్రతి ఫ్రేమ్ కూడా బిగ్ స్క్రీన్ అనుభూతిని కలిగిస్తోంది. ప్రేక్షకులను పూర్తిగా లీనం చేసే ఎక్స్ పీరియన్స్ అందిస్తుంది. ముంబైలో గ్రాండ్ గా జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ... గుడ్ ఈవెనింగ్ ముంబై. మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు. ఈ సినిమా కోసం గత రెండేళ్లుగా ప్రాణం పెట్టి పని చేశాం. బుచ్చిబాబు అయితే గత ఐదేళ్లుగా ఈ సినిమాతోనే ట్రావెల్ అవుతున్నారు. కానీ మా ప్రాజెక్ట్కు సెంటర్ పిల్లర్ రెహమాన్ మ్యూజిక్ అంటే నాకు ఎంతో అభిమానం. ఆయన 'పెద్ది'లో భాగం కావడం మాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. హీరోయిన్ జాన్వికపూర్ మాట్లాడుతూ.. ఈ సినిమా కోసం మేము గత రెండేళ్లుగా పని చేస్తున్నాం. మీ అందరితో కలిసి ట్రైలర్ చూడడం చాలా ఆనందంగా ఉంది.

## 'హై లెస్సో' పోస్టర్ రిలీజ్



'సుడిగాలి సుధీర్' గా పాపులరైన సుధీర్ ఆనంద్, టెలివిజన్, సినిమా రంగాలలో అలరిస్తున్నారు. ఆయన తాజా ప్రాజెక్ట్ 'హై లెస్సో'తో ప్రసన్న కుమార్ కోట దర్శకుడిగా పరిచయం కాగా, వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. సుధీర్ ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన కొత్త పోస్టర్ అందరినీ ఆకట్టుకుం టోంది. పోస్టర్లో సుధీర్ ఎంతో రఫ్, ఇంటెన్స్ అవతార్లో కనిపించారు. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ కథలో స్ట్రాంగ్ ఎమోషన్స్ డ్రామా ఉండబో తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్లో 25 రోజుల పాటు కీలక షెడ్యూల్ పూర్తి చేశారు. ఇందులో ప్రధాన టాకీ పార్ట్తో పాటు జాతర సీక్వెన్స్లు, ఒక పాటను చిత్రీకరిం చారు. త్వరలోనే ఏలూరులో 40 రోజుల భారీ షెడ్యూల్ ప్రారంభం ఈ చిత్రంలో నటాషా సింగ్, నక్షా సరన్ కథానాయిక లుగా నటిస్తున్నారు. కన్నడ నటి అక్షర గౌడ కీలక పాత్రలో కనిపించ నుండగా, మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బేవర దుహిత సారన్య ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది చివర్లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ సౌత్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

## కమల్ హాసన్ స్ఫూర్తిదాయకం



యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ స్ఫూర్తిదాయక నిర్ణయం సోషల్ మీడియాలో ప్రశంసల వెల్లువ సాధారణ ఎకానమీ ఫ్లైట్లో ప్రయాణిస్తూ హైదరాబాద్ లో కల్కి షూటింగ్ సెట్స్కు వచ్చిన కమల హాసన్ సినిమా పరిశ్రమ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఈ సమయంలో యూనివర్సల్ స్టార్ కమల్హాసన్ తీసుకున్న ఓ నిర్ణయం ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది.ప్రైవేట్ చార్టర్స్, లగ్జరీ ట్రావెల్స్ను పక్కన పెట్టి సాధారణ ఎకానమీ ఫ్లైట్లో ప్రయాణిస్తూ హైదరాబాద్లో కల్కి షూటింగ్ సెట్స్కు వచ్చారు. ఎంత స్టార్ డమ్ ఉన్నప్పటికీ సినిమాపై ప్రేమ, బాధ్యత ముఖ్యమని కమల్ హాసన్ మరోసారి నిరూపించారు.ప్రస్తుతం సినీ పరిశ్రమ కొత్త ఆలోచనల వైపు అడుగులు వేస్తున్న సమయంలో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం ఇండస్ట్రీకి ఒక స్ఫూర్తిదాయకమైన సందేశంగా మారింది. పరిశ్రమకోసం మార్పు మన నుంచే మొదలుకావాలనే కమల్ హాసన్ తీసుకున్న చొరవకు సోషల్ మీడియాలో ప్రశంసలు అందుతున్నాయి.సినిమా రంగంలో జరగబోయే గొప్ప మార్పులకు ఇది తొలి అడుగు కానుంది.

## 'పురుష' చిత్రం 22న విడుదల



కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల సరస్వతి సమర్పణలో బత్తుల కోటేశ్వరరావు నిర్మించిన చిత్రం పురుష ఈ మూవీతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్, రాయంచ కొక్కర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాను మే 22న రిలీజ్ చేయ బోతోన్నారు. ఈ క్రమంలో మూవీ ప్రమోషన్స్లో భాగంగా ట్రైలర్ను రిలీజ్ చేశారు.బ్రహ్మచారి భర్తగా మారాలని నిర్ణయించుకున్న తరువాత జీవితం యుద్ధభూమిలా మారుతుంద్ధి అని వెన్నెల కిషోర్ డైలాగ్తో ట్రైలర్ స్టార్ట్ అవుతుంది. ఆ తరువాత వచ్చే సీన్లు, భార్యల చేతిలో భర్తలు నలిగిన తీరు అందరినీ ఆకట్టుకునేలా ఉంది ఈ ట్రైలర్లో సతీష్ ముత్యాల కెమెరా వర్క్, శ్రవణ్ ఆర్ఆర్ అన్నీ కూడా హైలెట్ అవుతున్నాయి. ఫ్యామిలీ ఎమోషన్స్తో తీసిన ఈ చిత్రం ఆద్యంతం వినోదభరితంగా ఉందని ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది. ఈ మూవీకి శ్రవణ్ భరద్వాజ్ సంగీతాన్ని అందిస్తున్నారు. సతీష్ ముత్యాల కెమెరామెన్గా, కోటి ఎడిటర్గా పని చేశారు.

20vzm15:20vzm15.qxd 19-05-2026 20:51 Page 1



## కిశోర వికాస్ - రోడ్డు ప్రమాదాల నివారణకు సూచనలు



గరుగుబిల్లి, మే 19, ప్రభాతవార్త : కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా సోమవారం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి , జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు టీనేజ్ పిల్లలు వారు ఎదుర్కొనే సమస్యలు వాటి పరిష్కారం గురించి చర్చిస్తూ, పోక్సో చట్టం గురించి, బాల్యవి వివాహాల నిరోధక చట్టం గురించి, గృహహింస చట్టం గురించి, మాదకద్రవ్యాల వినియోగం నుంచి దూరంగా ఉం డడానికి, సైబర్ నేరాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి, రోడ్డు ప్రమాదాలను నివారించడానికి యువత ముఖ్యంగా టీనేజ్‌లో ఉన్న యువత ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయంలో తగిన సలహాలు సూచనలు ఇవ్వడంతో పాటు విద్యార్జనలో గమ్యం ఆవశ్యకత గమ్యాన్ని చేరుకోవడానికి చేయవలసిన ప్రణాళిక వాటి గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో ఏపిఎం పి . అప్పలనాయుడు, సిసి చందాన తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్ స్టేషన్‌ను సద్వినియోగం చేసుకోండి

**ఎంపీడీవో సిహెచ్ సూర్యనారాయణ**



వేపాడ, మే 19 , ప్రభాతవార్త: మండల కేంద్రమైన వేపాడలోని ఆర్టీసీ బస్ స్టేషన్‌ను విద్యార్థులు ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సిహెచ్ సూర్యనారాయణ కోరారు. దశాబ్దాల కాలంగా నిరుపయోగంగా ఉన్న బస్‌స్టేషన్ను ఇటీవల ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు ప్రయాణికులు బస్‌స్టేషన్‌ను వినియోగించుకోకపోవడంతో చెట్ల వద్ద, షాపుల వద్ద ప్రయాణికులు వేచి ఉండడంతో ఆర్టీసీ బస్సు నిలపడానికి డ్రైవర్ అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రయాణికులకు విద్యార్థులకు ఎంపీడీవో అవగాహన కల్పించారు. వేపాడ మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు , ప్రభుత్వము నడుపుతున్న బడి బస్సులపై ప్రయాణం సాగించే విద్యార్థులు , బస్సు షెల్టర్ వద్దనే వేచి ఉండి బస్సు వచ్చే సమయంలో బస్సు ఎక్కే అలవాటును అలవర్చుకోవాలని, చెట్ల వద్ద, షాపుల వద్ద వేచి ఉండే అలవాటును మార్చుకోవాలని కోరారు. ప్రభుత్వం బస్సు సెంటర్ ఏర్పాటు చేసి బెంచీలు కూడా ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించినందున వినియోగించుకోవాలని కోరారు. విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు కూడా బస్సు సెంటర్ వద్ద వేచి ఉండే అలవాటును పాటించి ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణ అధికారి ఎస్ రవికుమార్, ఏపీవో ఆదిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ ఆర్య వైశ్య ఫెడరేషన్
## జిల్లా ఉపాధ్యక్షుడిగా గుప్తా ప్రమాణ స్వీకారం



గరివిడి, మే19, ప్రభాత వార్త: ఇంటర్నేషనల్ ఆర్య వైశ్య ఫెడరేషన్ విజయనగరం జిల్లా శాఖ ఉపాధ్యక్షులు గా గరివిడి కి చెందిన సీనియర్ ఆర్య వైశ్య సంఘ నాయకులు వి వి ఎస్ ఎస్ ఎన్ గుప్తా నియామకం అయ్యారు. ఈ మేరకు మంగళవారం గుప్తా...ఇంటర్ నేషనల్ ఆర్య వైశ్య ఫెడరేషన్ సమావేశంలో లో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘ జాతీయ నాయకులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా,మాజీ ఎమ్మెల్యే అంబికా గుప్తా,విజయనగరం మాజీ డెప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి,ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు తదితర జాతీయ,రాష్ట్ర నాయకులు పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యులు ఐక్యత తో సామాజిక,రాజకీయా సాధికారత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో పురోగమించాలని వారు ఆకాంక్షించారు. కాగా ఐ వి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా గుప్తా నియామకం పట్ల పలువురు ఆర్య వైశ్య సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం భరోసా: ఎమ్మెల్యే కోళ్ల

**క్యాన్సర్ బాధితురాలికి రూ. 4 లక్షల ఎల్‌ఓసీ (ఏల్‌ఓసి) అందజేసిన ఎమ్మెల్యే**



లక్కవరపుకోట,మే 19, ప్రభాత వార్త : ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుం దని శృంగవరపుకోట నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం ఎల్.కోటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఎల్‌ఓసీ (లెటర్ అఫ్ క్రెడిట్) పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎల్.కోట గ్రామానికి చెందిన బంగారు వెంకటేశ్వరమ్మ అనే మహిళ గత కొంతకాలంగా క్యాన్సర్ మహమ్మారితో బాధపడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆమె తక్షణమే స్పందించారు. వెంకటేశ్వరమ్మకి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుండి రూ. 4 లక్షల విలువైన ఎల్‌ఓసీ (ఏల్ ఒ సి) మంజూరు చేయించి, ఆ పత్రాలను ఈరోజు బాధితురాలి కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో ఏ ఏం సి చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, ఎంపీటీసీ రాయవరపు చంద్ర శేఖర్, మాజీ సర్పంచ్ గేదెల దేముడు మాస్టర్, స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్స్యకార కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండ

**- నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి - ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు**



భోగాపురం, మే 19,(ప్రభాతవార్త) : మత్స్యకారుల సంక్షేమం, వారి సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు స్పష్టం చేశారు. మండలంలోని ముక్కాము గ్రామంలో మంగళవారం నిర్వహించిన మత్స్యకార సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని మత్స్యకారులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారి జీవన విధానాన్ని, వేటవృత్తిలో ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మత్స్యకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, వేట నిషేధ సమయంలో ఉపాధి కోల్పోయిన ప్రతి మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేలు చొప్పున కూటమి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. జిల్లాలోని మత్స్యకార మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో ఉన్నటువంటి 9,046 కుటుంబాలకు చెందిన 4,126 మంది మత్స్యకారుల ఖాతాల్లో రూ.8.24 లక్షల కోట్లను కూటమి ప్రభుత్వం జమ చేయడం జరిగిందన్నారు. మత్స్యకారులు శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీ ఎఫ్ సీ ఎస్ అధ్యక్షులు పాపారావు, రాష్ట్ర మత్స్యకార సాధికార కమిటీ కన్వీనర్ ఎం. సింహాచలం, పార్లమెంట్ అధికారి ప్రతినిధి నీలాపు అప్పలరామిరెడ్డి, కూటమి నాయకులు మట్టా అయ్యప్ప రామకృష్ణారెడ్డి, పల్లంట్ల జగదీష్, కోలా రామసూరి, గనగల్ల బాబాజీ, గరికిన చిన్న రాములు, గ్రామ ప్రజలు, మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పల్లెల ప్రగతితోనే దేశ ప్రగతి సాధ్యం : ఎమ్మెల్యే



డెంకాడ, మే 19 ప్రభాతవార్త: మండలంలోని దొడ్డిబడువ గ్రామంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన జలజీవన్ మిషన్ను ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెల ప్రగతితోనే దేశ ప్రగతి సాధ్యమని నమ్మకంతో కూటమి ప్రభుత్వం ప్రతి పల్లెను ఆదర్శంగా తీర్చిదిద్దుతోందని ఆమె స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అద్భుతమైన మార్గదర్శకత్వం, పల్లెల పట్ల ఆయనకున్న ప్రత్యేక శ్రద్ధ వల్లే నీరు మారుమూల గ్రామాలకు సైతం నిరంతరాయంగా అందుతున్నాయని ఆమె కొనియాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామీణ నీటి సరఫరా విభాగాన్ని బలోపేతం చేసి ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన జలాలు అందించేందుకు ఉపముఖ్యమంత్రి తీసుకుంటున్న విప్లవాత్మక చర్యలు కృషి అభినందనీయమని ఆమె ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తాగునీటి పరిశుభ్రతను పాటించినప్పుడే ఆరోగ్యకరమైన గ్రామాన్ని నిర్మించగలమని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, టిడిపి మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, టిడిపి సీనియర్ నాయకులు కలిదిండి పనిరాజు, తుమ్మి లక్ష్మి, శ్రీనివాసు, అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి కూటమి ప్రభుత్వం బాదుడు

**వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ**



నెల్లిమర్ల, మే 19 ప్రభాతవార్త : యుద్ధం పేరిట పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు నడ్డి విరిచిందని వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు, నెల్లిమర్ల మండల వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ విమర్శించారు. నెల్లిమర్లలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రెండేళ్లు కరోనా కష్టాలు, లాక్ డౌన్లతో రాష్ట్ర ఖజానా భారంగా మారినా ఆ భారం ఎక్కడా ప్రజల పై పడకుండా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ పాలనను అందించారన్నారు. అభివృద్ధిని కూడా విస్మరించకుండా మెడికల్ కాలేజీలు, పోర్టులు, భోగాపురం ఎయిర్ వంటి భారీ ప్రాజెక్టులు చేపట్టింది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఆయన పేర్కొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే



నెల్లిమర్ల, మే 19, ప్రభాతవార్త: పల్లెల ప్రగతి తోనే దేశ ప్రగతి సాధ్యమనే నమ్మకంతో కూటమి ప్రభుత్వం ప్రతి పల్లెనూ ఆదర్శంగా తీర్చిదిద్దుతోం దని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి స్పష్టం చేశారు. సారిపల్లి పంచాయతీ పరిధిలో పలు తాగునీటి అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం ప్రారంభోత్సవం చేశారు. నూతన బోర్ల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అనంతరం పంచాయతీ పరిధిలోని కుదిపిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'జల జీవన్ మిషన్' తాగునీటి మంచినీటి కుళాయిల (టాప్ కనెక్షన్లు) ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కుదిపి గ్రామంలోని ప్రతి ఇంటికీ నేరుగా తాగునీటి కుళాయి సౌకర్యం లభిస్తుందన్నారు. ఆమె మాట్లాడుతూ... ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అద్భుతమైన మార్గదర్శకత్వం, పల్లెల పట్ల ఆయనకున్న ప్రత్యేక శ్రద్ధ వల్లే నేడు మారుమూల గ్రామాలకు సైతం నిరంతరాయంగా నిధులు అందుతున్నాయని కొనియాడారు. కూటమి పార్టీల నాయకులు చనమల్ల వెంకటరమణ, అంబళ్ల అప్పలనాయుడు, పాలూరి భానుజీ, మజ్జి రామారావు, బి. ఆదినారాయణ , ఎస్. గోపాలమూర్తి , ఇడదేసి సాయి, కలిశెట్టి సీతారాం గ్రామీణ నీటి సరఫరా విభాగం డి ఈ ఈ జమ్ము వైకుంఠం నాయుడు , ఏఈ ప్రవీణ్ శంకర్, జనసైనికులు కుదిపి, సారిపల్లి గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కిషోర్ వికాస్‌పై అవగాహన కార్యక్రమం



కొమరాడ, మే19, ప్రభాతవార్త : కిషోర్ బాలికలు సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవాలని కొమరాడ సబ్ ఇన్స్పెక్టర్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు మండలం దలైపేట, కెమిసిల ,కంబవలస గ్రామాలలో మహిళలకు,బాలికలకు 'కిషోరో వికాసం' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కిషోర్ బాలికలు శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా దృఢంగా ఉండాలని పిలుపునిచ్చారు. దృఢ సంకల్పంతో ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని, తమ హక్కులు, రక్షణ పట్ల చైతన్యవంతంగా ఉండాలని కోరారు. ప్రతి బాలికకు ఆరోగ్యం మరియు సామాజిక అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు ,బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం , భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాల గురించి వివరించారు. మహిళా చట్టాలు, పోక్సో చట్టలపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల ద్వారా సౌకర్యాలు పొందాలి



చీపురుపల్లి, మే19, ప్రభాతవార్త అంగన్వాడీ కేంద్రాల ప్రతి కిషోర్ బాలిక అవగాహన పెంపొందించు కోవాలని ఐసిడిఎస్ అధికారులు మంగళవారం నాడు కిషోర్ బాలికలకు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కిశోర వికాసం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి సిడిపిఓ పి. నాగమణి, సూపర్వైజర్ పి శశికళ కోరారు. మంగళవారం నాడు చీపురుపల్లి పట్టణ పరిధిలోని మెట్ట కాలనీ అంగన్వాడి కేంద్రాల పరిధిలో కిషోర్ బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటిసారిగా ఒకరిని ఒకరు తెలుసుకోవడం, బ్యాడ్ టచ్, గుడ్ టచ్ వంటి అంశాల పట్ల బాలికలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా జీవన నైపుణ్యాలు శ్రియ అవగాహన ఆరోగ్యమేల తదితర అంశాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. చట్టాలపై అవగాహన హెచ్ఐవి గురించి అవగాహన సమాజంలో పిల్లలు ఎదుర్కొనే వ్యక్తిగత సామూహిక అవసరాలు సవాళ్లు ఎదుర్కొనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అదే విధముగా శారీరక వ్యాయామం విద్య, భవిష్యత్తు మార్గదర్శకాల కొరకు కిషోర్ బాలికలకు వివరించాలన్నారు. ప్రధానంగా బాల్యవివాహాలు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పి శశికళ, అంగన్వాడీ హెల్పర్ కుమారి, పలువురు కిశోర బాలికలు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి కట్టుకున్న ఇల్లు కూల్చొద్దు.. న్యాయం చేయండి

**రిక్షా కాలనీ వాసుల ఆవేదన**



చీపురుపల్లి, మే 19, ప్రభాతవార్త : రిక్షా తొక్కుకొని చెమటోడ్చి కట్టుకున్న తమ ఇళ్లను రైల్వే 3వ లైను పేరుతో తమ ఇళ్ళను తొలగించి మాకు అన్యాయం చేయవద్దు అంటూ చీపురుపల్లి పట్టణ పరిధిలోని రిక్షా కాలనీ నివాసులు మంగళవారం నాడు ఆందోళన వ్యక్తం చేశారు. చీపురుపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో 3 రైల్వే లైన్ కొరకు జరిపిన సర్వేలో రైల్వే స్టేషన్ సమీపంలో గల రిక్షా కాలనీలో సుమారు 40 గృహాలు తొలగింపబడతాయంటూ సంబంధిత రైల్వే అధికారులు సర్వేలు జరిపి ఇళ్లను గుర్తించడంతోపాటు మార్కింగ్ లు చేయడం పట్ల కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వేల ప్రకారం సుమారుగా ఇళ్లను కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వం అదనంగా ఇల్లుతో పాటు బాధిత నష్టపరిహారాన్ని కూడా అందజేస్తామంటూ అధికారులు నమ్మబల్కుతున్నప్పటికీ కాలనీవాసులు వారి ఆందోళనను విరమించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో చీపురుపల్లి మండల రెవెన్యూ సిబ్బంది రిక్షా కాలనీలో గుర్తించిన ఇళ్లపై సర్వే జరపడం పట్ల కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక తాసిల్దార్ డి. ధర్మరాజు సిబ్బంది కాలనీవాసుల పిలుపుమేరకు మంగళవారం నాడు కాలనీ సందర్శించి వారితో ప్రసంగించారు. ఏళ్ల తరబడి కష్టపడి నిర్మించుకున్న తమ ఇళ్ళను తొలగించవద్దంటూ.. రైల్వే శాఖకు సంబంధించి తమ కాలనీకి ఆనుకొని ఇరువైపులా ఎకరాల కొద్ది స్థలాల ఉన్నప్పటికీ తమ కాలనీని 3వ రైల్వే లైన్ పేరుతో ఖాళీ చేయించడం కుదరదంటూ కాలనీవాసులు తేల్చి చెప్పారు. ప్రభుత్వం ఎంత నష్టపరిహారం చెల్లిస్తున్న తమ కాలనీ విడదీసి మా కుటుంబాలను వేరు చేయకండి అంటూ కాలనీవాసులు స్థానిక తాసిల్దార్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో ఇల్లు ఇచ్చినా తమకు అవసరం లేదని, రిక్షా కాలనీ మూడువా రైల్వే లైన్ పేరుతో ఖాళీ చేయవలసి వస్తే మొత్తం అందర్నీ ఖాళీ చేసి ప్రభుత్వం తమకు అవసరమైన చోట ఇళ్లను నిర్మించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలంటూ తాసిల్దార్ కు మొరపెట్టుకున్నారు. తాసిల్దార్ ధర్మరాజు మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన కొరకు ప్రస్తుతం తమ సిబ్బంది సర్వే జరుపుతున్నారని కాలనీవాసుల డిమాండ్లను ప్రభుత్వానికి నివేదించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు మౌనంగా ఉండకూడదు



రామభద్రపురం, మే 19 ప్రభాతవార్త: మండల పరిధిలోని అరికాతోట గ్రామం నర్సాపురం గ్రామంలో జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు అవేర్నెస్ ప్రోగ్రామ్ ఉమెన్స్ సేఫ్టీ ,రోడ్డు సేఫ్టీ , సైబర్ క్రైమ్, ఏంటి డ్రగ్స్ /గంజాయి వీటి మీద ఇవ్వడం జరిగింది. ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ రావు మాట్లాడుతూ మహిళలు మౌనంగా ఉండకూడదని , పిల్లలు కుటుంబములను అతి జాగ్రత్తగా నడిపించాలి అని, పిల్లలకు మంచి పద్ధతి నేర్పించాలి అని చెడు ప్రవర్తనకు దూరంగా ఉంచాలన్నారు. యువకులు మాదకద్రవ్యాలుకు దూరంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలి అని అన్నారు. సమావేశంలో పోలీసులు, గ్రామస్తులు హాజరయ్యారు.

## నేడే మండల సర్వసభ్య సమావేశం

రామభద్రపురం, మే 19 ప్రభాతవార్త : ఎంపిడివో కార్యాలయం నందు మండల సర్వ సభ్య సమావేశం బుధవారం మండల అధ్యక్షులు చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన జరుగునని ఎంపిడివో రత్నం తెలిపారు. ప్రతి మూడు నెలలు కై ఒకసారి సమావేశం జరుగునని ఎంపిటిసిలు, జెడ్పిటిసి మండలస్థాయి అధికారులు అందరు హాజరు అయ్యి ముందు జరిగిన ప్రగతిని తెలియపరచాలి అని ఎంపిడివో రత్నం కోరారు.

## పెండింగ్ కేసులు లేకుండా పరిష్కరించాలి : డి.ఎస్.పి

దత్తిరాజేరు మే 19 ప్రభాతవార్త: స్టేషన్లో ఎటువంటి పెండింగ్ కేసులు లేకుండా పరిష్కారం చేయాలని బొబ్బిలి డి.ఎస్.పి గోవిందరావు అన్నారు గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసి నాయుడుతో కలిసి పెదమానాపురం పోలీస్ స్టేషన్ మంగళవారం పరిశీలించారు స్టేషన్లో ఉన్నఅన్ని రికార్డులను పరిశీలించారు రోడ్డు ప్రమాదాలు డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి వాటిపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు మైనర్ బాలికలు వాహనాల నడిపిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు యువత క్రికెట్ బెట్టింగులు జూదం ఆడి జీవితాలు నాశనం అయిపోతున్నాయని వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ నాయుడు పిఎస్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## దళిత ద్రోహి జగన్ రెడ్డి :ఎమ్మెల్యే కోళ్ల ఆరోపణ



ఎస్.కోట,మే,19,ప్రభాతవార్త : గత వైసీపీ ఐదేళ్ల తుగ్లక్ పాలనలో దళితులపై దాడులు,దౌర్జన్యాలు విపరీతంగా పెరిగాయని నా ఎస్సీలు నా ఎస్టీలు అంటూనే జగన్ రెడ్డి దళిత సమాజం గొంతు కోశారని ఎస్.కోట కోళ్ల లలితకుమారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఎస్.కోట ఎస్సీ కాలనీలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ హయాంలో దారుణంగా హత్యకు గురైన దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం సంస్మరణ సభలో ఆమె పాల్గొని విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ఐదేళ్ల పాలనలో కేవలం 8,211 దాడులు జరిగితే వైసీపీ ఐదేళ్ల అరాచకపాలనలో ఏకంగా 56,981కి చేరాయని ఈవిషయాన్ని కేంద్ర ప్రభుత్వమే రాజ్యసభలో లెక్కలతో సహా వివరించిందని గుర్తుచేశారు.జగన్ రెడ్డి తన హయాంలో దళిత డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం,వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్నలతో పాటు 200 మందికి పైగా దళితులను ఊచకోత కోయించారని ఆమె మండిపడ్డారు. పులివెందులలో దళిత మహిళ నాగమ్మ, ఉదయగిరిలో అనూష,ధర్మవరంలో క్రీడాకారిణి స్నేహలత,గుంటూరులో బీటెక్ విద్యార్థిని రమ్య వంటి ఎందరో దళిత బిడ్డలపై అత్యాచారాలు హత్యలు జరిగినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఇంతటి ఘోరాలకు పాల్పడిన జగన్ రెడ్డికి దళితుల గురించి మాట్లాడే అర్హత లేదని ప్రజలు ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం చేసి శిక్షించినా ఆయన సైకో మూకల తీరు మారలేదని లలితకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఎంసీ చైర్మన్ సీహెచ్ మల్లు నాయుడు,మండల పార్టీ అధ్యక్షుడు దోకుల చిన్న అచ్చం నాయుడు,ఎల్ కోట మండల పార్టీ అధ్యక్షుడు కరెడ్ల ఈశ్వరరావు, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ ఎన.రమనాజీ, పార్లమెంట్ అధికార ప్రతినిధి ఇందుకూరి శ్రీనురాజు,పలువురు టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కిషోర్ వికాస్‌పై అవగాహన కార్యక్రమం



కురుపాం, మే18, ప్రభాతవార్త : కిషోర్ బాలికలు సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవాలని కురుపాం సబ్ ఇన్స్పెక్టర్ పి నారాయణ రావు అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు గుమ్మలో మహిళలకు ,బాలికలకు 'కిషోరో వికాసం' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, కిషోర్ బాలికలు శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా దృఢంగా ఉండాలని పిలుపునిచ్చారు. దృఢ సంకల్పంతో ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని, తమ హక్కులు, రక్షణ పట్ల చైతన్యవంతంగా ఉండాలని కోరారు. ప్రతి బాలికకు ఆరోగ్యం మరియు సామాజిక అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు వివాహం చేయడం చట్టపరంగా నేరంఅని ,బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం , భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాల గురించి వివరించారు. మహిళా చట్టాలు, పోక్సో చట్టలపై క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మండల లో నీలకంఠాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సాకి గ్రామంలోఎస్సై నీలకంఠరావు ఆధ్వర్యంలో కిషోర్ వికాసం పై అవగాహన సదస్సు నిర్వహించారు. 18 సంవత్సరాలలోపు బాలికలకు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని ఆయన వివరించారు అలాగే పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయనతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## కిశోరి వికాసంపై అవగాహన ప్రోగ్రాం

సాలూరు, మే19, ప్రభాతవార్త : సాలూరు పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న హైస్కూల్‌లో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా హజరైన పట్టణ సీఐ అప్పల నాయుడు బాల్య వివాహాల నిషేధ చట్టం ఇంకా పోక్సో చట్టం అలాగే విద్యా హక్కు చట్టం పై అవగాహన కల్పించారు. అంతేకాకుడా ఈ ప్రోగ్రాంలో విద్యార్థులకు బాల్య వివాహాల ప్రమాదాలు,అలాగే బాలల రక్షణకు ఉన్న చట్టపరమైన హక్కులు, విద్య ఆవశ్యకత గురించి వివరించారు. ఐసీడీఎస్ సీడీపీవో మంగవేణి,జిల్లా కౌన్సిలర్ తవిటినాయుడు, విద్యాశాఖ అధికారులు,సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భోగాపురం పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు



భోగాపురం, మే 19,(ప్రభాతవార్త) : ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం భోగాపురం పోలీస్ స్టేషన్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ కు వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ కే దుర్గాప్రసాద్, సబ్ ఇన్స్పెక్టర్ పాపారావులతో పాటు స్టేషన్ లోని పోలీసు సిబ్బంది అందరికీ ఉచితంగా రక్తపోటు (బిపి), మధుమేహం (షుగర్) వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రాధాన్యత క్రమంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విది నిర్వహణలో నిమగ్నమై ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, సరైన జీవనశైలిని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కిషోర్ బాలికలకు చట్టాలపై అవగాహన

బలిజిపేట మే 19: ప్రభాత వార్త : మండలం బలిజిపేట గ్రామంలో అంగన్వాడి సెంటర్లో పరిధిలో కిషోర్ వికాసం 6 సెషన్ భాగంగా ఈరోజు చట్టాలపై అవగాహన వాటి ప్రాముఖ్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సులేఖ మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం గురించి, కిషోర్ బాలబాలికలు జీవన నైపుణ్యాలు కలిగి ఉండాలని మరియు మంచి ఆహారపు అలవాట్లు ఉండాలని ,మానసికంగా దృఢంగా ఉండాలని తెలియజేశారు, విద్య హక్కు ప్రతి పిల్లవాడు కూడా తప్పనిసరిగా చదువుకోవాలని మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098,గురించి తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. బలిజి పేట ఎస్సై వై సింహాచలం మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి, డొమెస్టిక్ వైలెన్స్ గురించి, గృహహింస ,కట్నం నిషేధ చట్టం గురించి పోలీసు వారి హెల్ప్ లైన్ 100 గురించి అత్యవసర పరిస్థితి ఏదో వచ్చినా కానీ ఈ నెంబర్ను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, పోలీసు సిబ్బంది, బాలబాలికలు హాజరయ్యారు.

## వసతి గృహాల్లో స్ప్రేయింగ్

కురుపాం,మే19: ప్రభాతవార్త : దోమల నివారణ, మలేరియా నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా కురుపాంలోని పలు వసతి గృహాలు, పాఠశాలల్లో మంగళవారం ఏసీఎం 5% ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్ప్రేయింగ్ పనులను జిల్లా మలేరియా అధికారి సూర్యనారాయణ స్వయంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ?ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ మలేరియా ప్రభావం ఎక్కువగా ఉన్న గ్రామాలు, గిరిజన ప్రాంతాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు మరియు వసతి గృహాలే లక్ష్యంగా ఈ ఏసీఎం స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే ప్రమాదకరమైన మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేయించుకోవాలని ఆయన ప్రజలను కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా కన్సల్టెంట్ రామచంద్ర, ఏఎంఓ జి. జయ, ఎంటీయస్ రాజశేఖర్, స్థానిక వైద్య సిబ్బంది ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్‌నేరాలు, పోక్సో చట్టాలపై అవగాహన అవసరం



పాచిపెంట మే 19 ప్రభాతవార్త : చట్టాలను విద్యార్థులు అవపాసం పట్టాలని ఎస్సై ఎల్.అర్జున్ విద్యార్థినులకు సూచించారు. మండల కేంద్రమైన పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో అవగాహన సదస్సు మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిషోర వికాసంలి కార్యక్రమంలో భాగంగా కార్యక్రమం నిర్వహించారు.. కార్యక్రమంలో యువతులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను క్షుణ్ణంగా వివరించారు. అలాగే పోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్, మహిళా చట్టాలు, రైట్ ఎడ్యుకేషన్, గుడ్ టచ్, బాడ్ టచ్, పై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలలోపు యువతులు స్వచ్ఛందంగా బాల్యవావాహాలను వ్యతిరేకించాలని ఆయన కోరారు . బాల్య వివాహాలు చేస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సీడీపీఓ బి. అనంతలక్ష్మి, సచివాలయం సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

20-05pg10fV.qxd:20-05pg10fV.qxd 1/1/02 6:48 AM Page 1



# అఫ్ఘాన్‌తో టెస్ట్, వన్డేలకు టీమిండియా ఎంపిక

- *టెస్ట్, వన్డేలకు కెప్టెన్‌గా గిల్
- *బుమ్రా, జడేజాలకు విశ్రాంతి
- *రోహిత్, హార్దిక్‌లకు కండిషన్
- *ప్రిన్స్ , గుర్నూర్‌లకు పిలుపు
- *రెండు ఫార్మాట్లలోనూ నితీష్







**ముంబై, మే 19:** ఆఫ్ఘనిస్థాన్‌తో స్వదేశంలో జరిగే టెస్ట్, వన్డే సిరీస్‌లకు టీమిండియాను భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా నేతృత్వంలో జరగిన సెలెక్షన్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రెండు ఫార్మాట్లకు భారత జట్టు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ వ్యవహరిస్తాడు. జూన్ 6నుంచి అఫ్ఘానిస్థాన్‌తో ఒక టెస్టు మ్యాచ్, మూడు వన్డేలు ఆడనుంది.

**టెస్ట్ వైస్ట్ కెప్టెన్‌గా రాహుల్**

టెస్ట్ జట్టుకు రిషబ్ పంత్ స్థానంలో కేఎల్ రాహుల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. రిషబ్ పంత్ వికెట్ కీపర్ బ్యాటర్‌గా జట్టులో కొనసాగుతాడు. అలాగే పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాలకు విశ్రాంతి కల్పించిన సెలెక్టర్లు.. వారి స్థానాల్లో గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబ్‌లను ఎంపికచేశారు. వీరిద్దరితో పాటు ప్రిన్స్ యాదవ్, మానవ్ సుతార్ తొలిసారిగా మెన్ బ్లూ జట్టులో చోటు దక్కించుకున్నారు. అక్షర్ పటేల్, ఆకాశ్ దీప్‌లకు చోటు దక్కలేదు.

**వన్డే వైస్ కెప్టెన్‌గా శ్రేయాస్**

ఇక వన్డే జట్టుకు శ్రేయాస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య ఎంపికయినా, వారు ఫిట్‌నెస్ నిరూపించు కుంటేనే జట్టులో కొనసాగుతారు. వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణలతో పాటు ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్‌లకు చోటు దక్కింది. ఐపీఎల్‌లో వికెట్ల పంట పండించిన మహ్మద్ షమి గురించి చర్చించలేదని చీఫ్ సెల్కర్ట్ అజిత్ అగార్కర్ పేర్కొన్నాడు.

**రెండుఫార్మాట్లకు నితీష్**

హైదరాబాద్ సూపర్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్‌రెడ్డి రెండు ఫార్మాట్లకు ఎంపికయ్యాడు. ఐపీఎల్‌లో ఆల్‌రౌండర్‌గా నిరూపించుకున్న నితీష్.. టెస్ట్, వన్డే జట్టులోనూ చోటు సంపాదించాడు. ఇక హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ మహ్మద్ సిరాజ్... టెస్ట్ జట్టులో స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. వన్డే జట్టులోకి మాత్రం సిరాజ్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు.

**టెస్ట్ జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్‌కెప్టెన్), యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, మానవ్ సుతార్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, ధ్రువ్ జురెల్, హర్ష్ దూబె.

**వన్డే జట్టు :** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), శ్రేయస్ అయ్యర్(వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, , కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్య, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గూర్నూర్ బ్రార్, హర్ష్ దూబె.

**మ్యాచ్‌ల షెడ్యూల్**

**ఏకైక టెస్టు:** జూన్ 6–10 (ముల్లాన్‌ఫుర్)
**తొలి వన్డే:** జూన్ 14 (ధర్మశాల)
**రెండో వన్డే:** జూన్ 17 (లక్నో)
**మూడో వన్డే:** జూన్ 20 (చెన్నై)

# రెండో టెస్ట్‌లోనూ ఓటమి దిశగా పాకిస్థాన్

**షెల్హెట్, మే 19:** బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లోనూ పాకిస్థాన్ ఓటమి దిశలో కొనసాగుతోంది. 437 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్.. నాలుగో ఆట ముగిసేసరికి ఏడు వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. ఇంకా ఒక రోజు ఆటమిగిలి ఉంది. ఇంకా 121 పరుగులు చేయాల్సి ఉండగా చేతిలో మూడు వికెట్లు మాత్రమే ఉన్నాయి. స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ రూపంలో మహ్మద్ రిజ్వాన్(135 బంతుల్లో 75 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు.

నాలుగో రోజు ఆట ఆరంభంలోనే పాకిస్థాన్ వేగంగా వికెట్లు కోల్పోయింది. నవిద్ రాణా, తైజుల్ ఇస్లాం... పాక్ టాప్ ఆర్డర్, మిడిల్ ఆర్డర్ పనిపట్టారు. దీంతో 162 పరుగులకే అయిదు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో సల్మాన్ అఘా(102 బంతుల్లో 71), మహ్మద్ రిజ్వాన్ ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 134 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. సల్మాన్ అఘాను తైజుల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. మహ్మద్ రిజ్వాన్ క్రీజ్‌లో నిలదొక్కుకుని ఆడుతున్నాడు. బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లాం నాలుగు వికెట్లు, నవీద్ రాణా రెండు వికెట్లు పడగొట్టారు. ఢాకాలో జరిగిన తొలి టెస్ట్‌లో బంగ్లా ఘనవిజయం సాధించింది.

# రాయల్స్ వైభవం

## బ్యాటింగ్ వండర్ సూర్య వంశీ
## 38 బంతుల్లో 93 రన్స్
## 10 సిక్స్‌లు, 7 ఫోర్లు



జైపూర్‌లో లక్నోతో జరిగిన మ్యాచ్‌లో 15 ఏళ్ల బ్యాటింగ్ అద్భుతం వైభవ్ సూర్య వంశీ మరోసారి తనదైన శైలిలో రెచ్చిపోయాడు. అయితే మునుపటి వైభవ్‌లా కాకుండా అనుభవజ్ఞుడైన ఆటగాడిగా, తను క్రీజ్‌లో నిలవడడం జట్టుకు ఏ స్థాయిలో అవసరమో తెలిసిన వాడిగా కనిపించాడు. తన సహజ శైలిలో తొలి బంతికి సిక్స్‌కు పోకుండా ఎదుర్కొన్న మూడో బంతికి అదీ సింగిల్స్‌తో ఖాతా తెరిచాడు. మొదటి పది బంతుల్లో వైభవ్ చేసింది కేవలం అయిదు పరుగులే. జైస్వాల్ ఆడుతున్నంత సేపు మరో ఎండ్‌లో ప్రేక్షకుడిగానే ఉన్నాడు.

ఎదుర్కొన్న 11వ బంతికి సిక్స్‌తో మొదలుపెట్టిన వైభవ్... ఆ తర్వాత కూడా ఆచితూచే ఆడాడు. ఆరో ఓవర్ నుంచి శివాలెత్తడం మొదలు పెట్టాడు. ప్రిన్స్ వేసిన మొదటి బంతికి సిక్స్‌తో స్టార్ట్ చేసి మరో రెండు బౌండరీలు బాది 15 రన్స్ సాధించాడు. ఇక 9వ ఓవర్లో నైతే ఆకాశ్‌కు చుక్కలు చూపాడు. మొదటి బంతికి సిక్స్, ఆ తర్వాత 4,4,6,4తో మొత్తం 22 రన్స్ చేశాడు. 23 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. అదే జోరులో రాఠీ బంతికి సిక్స్, ప్రిన్స్ బంతులకు బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లు, మయాంక్ ఓవర్లో వరుస రెండు సిక్స్‌లు, రాఠీ మరో ఓవర్లో సిక్స్, ఫోర్‌తో సెంచరీకి సమీపించాడు. 93 పరుగుల వద్ద అవుటై శతకం మిస్సయ్యాడు. పది బంతులకు 5 రన్స్ చేసిన వైభవ్.. ఆతర్వాత 28 బంతుల్లో 88 రన్స్ సాధించాడు. జురెల్‌తో కలిసి శతకం భాగాస్వామ్యం అందించాడు. తనలోని మరో వైభవ్‌ను చూపెట్టి క్రికెట్ అభిమానులను ఉర్రూత లూగించాడు.

# తొలి రౌండ్‌లో భారత్ జోడీ సంచలనం




**కౌలాలంపూర్:** మలేషియా మాస్టర్స్ సూపర్ -500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత జోడీ సంచలనం సృష్టించింది. హారిహరన్–అర్జున్ జోడీ పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఫ్రాన్స్ జోడీ క్రిస్టో పొపొవ్–థామస్ పొపొవ్‌పై గెలుపొందారు. తొలి సెట్‌ను 21–19తో నెగ్గిన భారత్ జోడీ.. రెండో సెట్‌ను మరింత అలవోకగా 21–15తో ముగించింది. కేవలం 36 నిమిషాల్లోనే ఫ్రాన్స్ జోడీని ఓడించింది. గత థామస్ కప్ సెమీఫైనల్లో ఫ్రాన్స్ చేతిలో ఎదురైన పరాజయానికి భారత్ షట్లర్లు స్వీట్ రివేంజ్ తీర్చుకున్నారు. కాగా మోచేతి గాయంతో థామస్ కప్‌కు దూరమైన లక్ష్యసేన్.. తొలి రౌండ్‌లో మోహ జాకీ ఉబైదిల్లా(ఇండోనేసియా)తో తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో తరుణ్ మానేపల్లి.. జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్), కిరణ్ జార్జ్.. అలెక్స్ లానియర్ (ఫ్రాన్స్), హెచ్.ఎస్. ప్రణయ్.. క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్)తో పోటీపడతారు. మహిళల సింగిల్స్‌లో తన్వీ శర్మ.. పిచ్చామోన్ ఓపట్నిపుత్ (థాయ్‌లాండ్)తో, ఉన్నతి హుడా.. హాన్ కియాన్స్ క్సీ (చైనా)తో, మాళవిక బన్సోద్.. వైవోస్ లీ (జర్మనీ)తో, అన్మోల్ ఖర్బ్.. లైన్ హోజ్ మార్క్ కెర్స్‌ఫెల్డ్ (డెన్మార్క్)తో తలపడనున్నారు. ఈ నెల ఆరంభంలో డెన్మార్క్ లోని హోర్సెన్స్‌లో జరిగిన థామస్ కప్ సెమీస్‌లో ఇండియా 0–3తో ఫ్రాన్స్ చేతిలో ఓడింది. అయితే ఆ మూడు సింగిల్స్‌లో ఆడిన ప్లేయర్లు ఇప్పుడు ఈ టోర్నీలోనూ ఇండియన్స్‌తో తలపడుతున్నారు. దాంతో వీళ్లపై గెలిచి థామస్ కప్ ఓటమికి బదులు తీర్చుకోవాలని భావిస్తున్నారు.

## భారీ స్కోర్ల మ్యాచ్‌లో లక్నోపై విజయం

# గెలిచి నిలిచిన రాజస్థాన్ రాయల్స్

**జైపూర్:** ఐపీఎల్ 2026లో భాగంగా సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరిగిన కీలక మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ గెలిచి నిలిచింది. ప్లే ఆఫ్ అవకాశాలను సజీవంగా నిలుపుకుంది. లక్నో ఉంచిన 221 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 5 బంతులుండగానే మూడు వికెట్లు కోల్పోయి అందుకుంది. మొదట యశస్వి జైస్వాల్(23 బంతుల్లో 43), ఆ తర్వాత వైభవ్(38 బంతుల్లో 93), చివరకు ధృవ్ జురెల్(38 బంతుల్లో 53 నాటౌట్) మెరుపులు మెరిపించారు. చివరి మ్యాచ్‌లోనూ రాజస్థాన్ రాయల్స్ గెలుపొందితే నాలుగో జట్టుకు ప్లే ఆఫ్‌కు చేరుకుంటుంది.

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్‌కు ఓపెనర్లు ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. జోష్ ఇంగ్లిస్(29 బంతుల్లో 60; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), మిచెల్ మార్ష్(57 బంతుల్లో 96; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు).. రాజస్థాన్ బౌలర్లపై చెలరేగారు. బౌండరీలు, సిక్స్‌లతో విరుచుకుపడ్డారు. క్రేజీ షాట్లతో స్కోరు బోర్డును పరిగెత్తించారు. కేవలం 29 బంతుల్లోనే 60పరుగులు చేసి ప్రమాదకరంగా మారుతున్న ఇంగ్లీస్‌ను యశ్ రాజ్ అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో 109 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇంగ్లీస్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (16) ఎక్కువ సేపు నిలవలేదు. లక్నో కెప్టెన్ రిషభ్ పంత్(35) కూడా పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డాడు. మార్ష్‌తో కలిసి 64 పరుగులు జోడించాడు. ఆయుష్ బదానిని ఆర్చర్ డకౌట్ చేశాడు.

**మిచెల్ సెంచరీ మిస్ :** ఒకవైపు వికెట్లు పడుతున్నా మరో ఎండ్ లో ఓపెనర్ మిచెల్ మార్ష్ విధ్వంసకర బ్యాటింగ్‌ను కొనసాగించాడు. రాజస్థాన్ బౌలర్లపై కనికరం లేకుండా విరుచుకుపడిన మార్ష్.. 57 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 96 పరుగులు చేశాడు. అయితే ఇన్నింగ్స్ చివరి ఓవర్ అయిదో బంతికి దురదృష్టవశాత్తూ రనౌట్ కావడంతో కేవలం 4 పరుగుల తేడాతో సెంచరీ చేసే సువర్ణావకాశాన్ని చేజార్చుకున్నాడు. అయినప్పటికీ మార్ష్ ధాటికి లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 220 పరుగుల మార్కును అందుకుంది. రాజస్థాన్ బౌలర్లలో యశ్‌రాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు.

# స్వల్పనష్టాలకు పరిమితమైన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, మే 19:** స్టాక్ మార్కెట్లు వారంలో రెండోరోజు స్వల్పనష్టాలకు గురయ్యాయి. భారత్‌రూపాయి భారీగా క్షీణించింది. గ్లోబల్‌సెంటిమెంట్ బలహీనపడటంతో ఆరంభ లాభాలు ముగిసే సమయానికి ఆవిరయ్యాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 114.19 పాయింట్లు క్షీణించి 75,200.85వద్ద స్థిరపడగా నిఫ్టీ 31.95 పాయింట్లు క్షీణించి 23,618వద్ద ట్రేడింగ్ ముగించింది. అమెరికా బాండ్లపై రిటర్నులు పెరగడం, ప్రపంచ మార్కెట్‌ధోరణులు మిశ్రమంగా ఉన్న తీరు భారత్ మార్కెట్లపూ చూపింది. రంగాలవారీగాచూస్తే ఐటి స్టాక్స్ కొంత కొనుగోళ్లమద్దతిచ్చాయి.

ప్రైవేటు బ్యాంకులు, ఆర్థిక సంస్థలషేర్లు మాత్రం ఒత్తిడికి లోనయ్యాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.73శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.17శాతం చొప్పున లాభపడ్డాయి. బిఎస్‌ఇలో 2590 షేర్లు ముందుకు కదిలితే 1596 షేర్లు క్షీణించాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 96.58వద్ద ముగిసింది. ఒకదశలో 96.61వద్దకుచేరిన రూపాయి చివరకు 96.58వద్ద ట్రేడింగ్ ముగించింది. భారత్‌లో పదేళ్ల బెంచ్‌మార్కు బాండ్లు 0.29శాతం క్షీణించి 7.100కి రిటర్నులుచేరాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ 5 సెటిల్‌మెంట్‌దరలు రూ.1,59,950కి చేరాయి. అమెరికా పదేళ్ల బాండ్లు కూడా 4.608శాతంగా ఉన్నాయి. కమోడిటీ మార్కెట్లలో జులై నెల సెటిల్‌మెంట్ ధరలు 1.86 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 110.24 డాలర్లుగా ఉన్నాయి. నిఫ్టీలో ఐటిసూచీ 3.23శాతంపెరిగింది.

మూడు సెషన్లలోను ఈ సూచీ 7.12వాతం ర్యాలీ తీసింది. ఆదాని గ్రూప్‌స్టాక్స్ రివ్వున ర్యాలీ తీసాయి. అమెరికా జస్టిస్ విభాగం ఆదానికేసులు మొత్తం ఉపసంహరించి నట్లు ప్రకటించడంతో కంపెనీ గ్రూప్‌షేర్లు ఒక్కసారిగా పెరిగాయి. ఆదాని గ్రీన్ ఎనర్జీ 0.64శాతం, ఆదాని టోటల్‌గ్యాస్ 2.16శాతం, ఆదాని ఎంటర్ ప్రైజెస్ 1.31శాతం, ఆదాని ఎనర్జీ సొల్యూషన్స్ 0.09శాతం చొప్పున పెరిగాయి. హెచ్‌పిసిఎల్ 3.37శాతం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 2.42శాతం, బిపిసిఎల్ 2.01శాతం చొప్పున పెరిగాయి. అపోలో మైక్రోసిస్టమ్స్ 9.55శాతంపెరిగింది. ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రా మాత్రం 0.57శాతం దిగజారింది. ఆస్ట్రాల్‌కంపెనీ 6.26శాతం క్షీణిస్తే డూమ్స్ ఇండస్ట్రీస్ కూడా 2.05శాతం నెగిటివ్‌లో ఉంది. జెకె పేపర్ 6.60శాతం పెరిగింది. ఇంద్రప్రస్థ గ్యాస్ కూడా 3.77శాతం పెరిగింది. అలాగే త్రివేణి టర్బైన్ 6.94శాతం, సోమాని సిరమిక్స్ కూడా 12.60శాతం చొప్పున పెరిగాయి. మొత్తంగాచూస్తే కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు కొన్ని కంపెనీలకు సానుకూలం అయితే మరికొన్నింటికి ప్రతికూలంగా మారాయి.



## ఆల్‌టైమ్ కనిష్టానికి భారత్ రూపాయి

# డాలర్ వర్సెస్ రూపీ 96.58

న్యూఢిల్లీ, మే 19: భారత్‌రూపాయి మరోసారి ఆల్‌టైమ్ కనిష్టానికి చేరుకుంది. మంగళవారం ఇంటర్‌బ్యాంకు ఫోరెక్స్ కౌంటర్లలో డాలరుతో చెలామణి మరింత బలహీనపడింది. రూ.96.58వద్ద ట్రేడింగ్ ముగిసినతర్వాత మొత్తం 23 పైసలు క్షీణించినట్లు తేలింది. వరుసగా 12వ రోజుకూడా భారత్‌రూపాయి అంతర్జాతీయ మార్కెట్‌లో క్షీణతను ఎదుర్కొంది. ఇంట్రాడేలో రూపాయి 96.61 వరకూ క్షీణించింది. తర్వాత క్రమేపీ బలపడి 96.58వద్దకు చేరింది. ముందు రోజు కూడా భారత్ రూపాయి 96.36వద్ద ఊగిసలాడింది. ఇప్పటివరకూ ఈ ఏడాది భారతరూపాయి డాలర్ మారకంలో ఏడుశాతం క్షీణించింది. కౌంటర్‌ప్రారంభంలో 96.37వద్ద ప్రారంభం అయి ఇంట్రాడేలో 96.61కి చేరాక కొంతమేర నెమ్మదించి చివరకు 96.58వద్ద స్థిరపడింది. ప్రారంభంతో పోలిస్తే 25పైసలు పతనం అయినట్లు తేలింది. ముడిచమురు ధరలు పెరగడం, డాలర్ చెల్లింపులకు భారీ డిమాండ్ ఏర్పడటంతో రూపాయి భారీగా క్షీణించిందని నిపుణులు చెపుతున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారక పోవడం కూడా ఇందుకు మరికొంతకారణం అయింది. అమెరికా ఫెడ్‌రిజర్వుకూడా డాలర్ పటిష్టతను కొనసాగించే నిర్ణయాలనే ప్రకటించడంతో ఇతర కరెన్సీలు బలహీనపడటం ప్రారంభించాయి. వీటిలో రూపాయి కూడా ఉంది. డాలర్ పటిష్టం అవుతుండటంతో విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. దీనివల్ల కార్పొరేట్ రంగానికి కూడా తీవ్రస్థాయిలో మార్జిన్ ఒత్తిడులు ఉండే అవకాశం ఉంది. ఎగుమతి ఆధారిత విభాగాలు కొంతప్రభావిం అవుతాయి. ముడిచమురుధరలు దిగిరానంత వరకూ కూడా రూపాయి క్షీణత కొనసాగుతూనే ఉంటుందని కరెన్సీ నిపుణులు పేర్కొంటున్నారు.

# బిపిసిఎల్‌కు క్షీణించిన లాభాలు



**ముంబయి, మే 19:** ప్రభుత్వరంగంలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ నికరలాభం నాలుగో త్రైమాసికంలో 58శాతం క్షీణించింది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ నికరలాభం రూ.7545 కోట్లనుంచి రూ.3191 కోట్లకు క్షీణించింది. వన్‌టైమ్ నష్టం కింద రూ.4349.13 కోట్లు కంపెనీపై భారం పడింది. ఆయిల్ గ్యాస్ బ్లాకుల్లో తన పూర్తి అనుబంధ సంస్థ భారీగా తగ్గించింది. బిపిఆర్ఎల్ ప్రపంచ వ్యాప్తంగా ఆయిల్, గాస్ బ్లాక్‌ల్లో పెట్టుబడులు పెట్టింది. ప్రత్యక్షంగా కానీ, తన అనుబంధ సంస్థలనుంచి కానీ పెట్టుబడులు ఉంటాయి. కొన్ని బ్లాకుల్లో పెట్టుబడులను పెట్టింది. అదే ప్రభావం ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్‌పైనా చూపించింది. దానితో బిపిఆర్ఎల్‌కు 4349.13 కోట్ల నష్టం వచ్చింది. మూడో త్రైమాసికంలో 1.19 లక్షల కోట్లనుంచి స్వల్పంగా తగ్గింది. ఎబిడిటా 14శాతం క్షీణించి 10,061కోట్లకు చేరింది. గత త్రైమాసికంలో 11,677 కోట్లుగా ఉంది. నిఫ్టీలో బిపిసిఎల్ షేర్లు 2 శాతం పెరిగి రూ.286.45వద్ద ముగిసింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.